అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఉపకారం కాదు.. అవసరం

తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణం

అజిత్ పవార్ విమానం బ్లాక్ బాక్స్ లభ్యం 05

సంపుటి 28, సంచిక: 218 | శుక్రవారం | 30-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## వచ్చే ఆర్థిక సంవత్సరంలో
# 7% వృద్ధిరేటు

**ఎకనామిక్ సర్వే అంచనా**

- ఎఐతో ముప్పు; నియంత్రణకు ఎఐ ఆర్థిక మండలి అవసరం
- 100 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి లక్ష్యం
- కార్మికులు, గిగ్ వర్కర్లకు లేబర్ కోడ్‌లతో రక్షణ






**న్యూఢిల్లీ:** భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటుకు సమర్పించిన ఎకనామిక్ సర్వే నివేదికను అనుసరించి, 2026–27 ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధిరేటు 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతున్నదని ఆ నివేదికలో పేర్కొన్నారు. సంభావ్య వృద్ధి రేటును సుమారు 7 శాతంగా సర్వేలో తెలిపారు. ఆర్థిక సలహాదారుడు వి. అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని నిపుణుల బృందం సిద్ధం చేసిన ఆర్థిక సర్వేను తరువాయి 2లో



## ఎయిర్‌పోర్టులను త్వరితగతిన పూర్తిచేయాలి

- మామునూరు ఎయిర్‌పోర్టుకు భూమి అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు 03



## సిఎం, మంత్రుల ప్రమేయం లేకుండా... ఫోన్ ట్యాపింగ్ జరగదు

- సిట్ విచారణతో అసలు నిజాలు బయటికి వస్తాయి
- టిపిసిసి అధ్యక్షుడు 03

## భారత్ అభివృద్ధి చర్యల్లో భాగస్వాములు కండి



- తెలంగాణలో ఉన్న అవకాశాలు రాష్ట్ర బలాబలాలను ప్రపంచానికి తెలిసేలా బ్రాండ్ అంబాసిడర్లుగా ముందుకు రావాలి
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్ఠి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బిఎస్) లో చదువుతున్న భారతీయ విద్యార్థుల బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తమ స్కూల్‌కు ఆహ్వానించింది. అత్యంత బిజీ షెడ్యూల్, తరగతులు, అసైన్‌మెంట్లను పూర్తి చేసిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల తరువాయి 2లో

# మేడిగడ్డ బ్యారేజీ అత్యంత ప్రమాదకరం



- డేంజరస్ డ్యాముల కేటగిరి 1లో ఉన్నట్లు కేంద్ర జల్‌శక్తి వెల్లడి
- తగిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు స్పష్టీకరణ
- లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం
- వర్షాకాలం తర్వాత 6,553 డ్యాములు తనిఖీ
- దేశవ్యాప్తంగా 50 ఏళ్ల పైబడిన డ్యాములు 1681
- గణాంకాలను ప్రకటించిన కేంద్రం

**ప్రజాపక్షం/హైదరాబాద్**

దేశంలోనే అత్యంత ప్రమాదకర డ్యాముల కేటగిరి 1 పరిధిలో తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ బ్యారేజీ(లక్ష్మి బ్యారేజీ) ఉన్నదని కేంద్ర జల్‌శక్తి వెల్లడించింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఇదివరకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. వర్షాకాలం తర్వాత 6553 డ్యాములను తనిఖీ చేశామని, ఇందులో మూడు డ్యాములు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని, ఇందులో మేడిగడ్డ(తెలంగాణ), తరువాయి 2లో

## కేరళలో సకల వర్గాలకు
# సమప్రాధాన్యం

**కేరళ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం**

> ‘కోటి మందికి చేరువయ్యే సామాజిక భద్రతా సాయం, ఐదు లక్షల మందికి ఇళ్లు, కోటి మందికి పైగా ఉచిత చికిత్స, కడు పేదరికం నుండి విముక్తి, అప్పుల ఊబిలో పడిన వారికి ఇళ్లను కాపాడి ఇవ్వడం, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరచడం మేము చేపట్టిన బాధ్యతలు. అది మా రాజకీయం. ఆ రాజకీయాన్ని ప్రతి నిశ్వాసంలోనూ ఉన్నతంగా చాటుతాం’
> – బడ్జెట్ ప్రసంగంలో కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాలన్

- తొలిసారిగా వృద్ధులకు ప్రత్యేక బడ్జెట్
- సంక్షేమ పెన్షన్‌లకు రూ.14,500 కోట్లు
- ఆశావర్కర్‌లు, వంట కార్మికులు, సాక్షరత ప్రేరక్‌లకు వేతనాల పెంపు
- ఉద్యోగులపై వరాల వర్షం, పిఆర్‌సి, అష్యూర్డ్ పెన్షన్ పథకం ప్రకటన
- అన్ని వర్గాలకు కేటాయింపులు : సిఎం పినరయ్ విజయన్
- కేరళ ప్రత్యామ్నాయాన్ని ప్రతిబింబించిన బడ్జెట్: బినోయ్ విశ్వం



**తిరువనంతపురం :** ప్రతి ఒక్క కుటుంబాన్ని తడుతూ, బడి పిల్లల నుంచి శ్రామిక మహిళలు, వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి సంక్షేమమే కేంద్రంగా కేరళ వామపక్ష సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం గురువారం రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది.సంక్షేమ పెన్షన్ లబ్ధిదారులు, సామాన్య కార్మికులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా అన్ని రంగాల వారికి పెద్ద పీట వేసింది. వృద్ధుల కోసం ప్రత్యేక ‘ఎల్డర్లీ బడ్జెట్ (పెద్దల బడ్జెట్)’ను ప్రవేశపెట్టి కేరళ దేశానికి తరువాయి 12లో

# గద్దెపైకి సమ్మక్క

- చిలకల గుట్ట నుండి భారీ పోలీసు బందోబస్తు మధ్య సమ్మక్కను గద్దెకు చేర్చిన పూజారులు
- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
- ఇప్పటికే 80లక్షలు దాటినట్లుగా అంచనా
- దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- జనసంద్రాన్ని తలపిస్తున్న మేడారం


దర్శించుకున్న కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, ఓరమ్

**ప్రజాపక్షం/మేడారం/ములుగు**

ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం జాతరలో గురువారం మహాఘట్టం జరిగింది. జాతరలోనే అతి కీలక ఘట్టమైన సమ్మక్క తల్లి గద్దెకు చేరుకున్నది. చిలకల గుట్ట నుండి సమ్మక్క పూజారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య సమ్మక్కను గద్దెలపైకి చేర్చారు. తొలుత జాతరలో వెదురు కర్రలను గద్దెపై ప్రతిష్టించారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన సమ్మక్క పూజారులు ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం చిలుకల గుట్టకు చేరుకుని కుంకుమ భరిణ రూపంలో ఉన్న సమ్మక్కను మేడారంలోని గద్దెపై ప్రతిష్టించారు.దీంతో అప్పటికే వనదేవతలు పగిడిద్దరాజు, సారలమ్మ, గోవిందరాజులు మేడారం గద్దెలపైకి రావడంతో భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. గద్దెలను దర్శించుకున్న భక్తుల సంఖ్య ఇప్పటికే 80లక్షల పైగా దాటినట్లుగా అధికారులు చెబుతుండగా, గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 15 లక్షలకు పైగా భక్తులు అమ్మవార్ల దర్శించుకున్నారని అంచనా వేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో సారలమ్మను, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, గోవిందరాజులను పూజారులు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం.. రహస్య పూజలు నిర్వహించిన అనంతరం గద్దెలకు చేర్చారు. ముగ్గురు దేవరులు గద్దెలపైకి చేరడంతో గురువారం తెల్లవారుజాము నుంచే గద్దెల వద్ద భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. గద్దెల ప్రాంగణానికి అనుసంధానమై ఉన్న క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఉదయం జంపన్న వాగువద్ద ఇసుక వేస్తే రాలనంత జనం కనిపించడం గమనార్హం. ఘాట్లకు రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర భక్తుల స్నానాలు ఆచరించే దృశ్యాలు కనిపించాయి. జంపన్న వాగుకు అను సంధానమైన రహదారులు ట్రాఫిక్ జామ్‌లతో కనిపించాయి. ప్రైవేటు వాహనాలను రద్దీ ప్రాంతాల్లోకి రానివ్వకుండా నివారించడంలో తరువాయి 12లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో
# కెసిఆర్‌కు నోటీసులు

- నేడు విచారణకు రావాలని పేర్కొన్న అధికారులు
- విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు లేఖ రాసిన మాజీ సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్**

:దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు గురువారం తరువాయి 2లో



## గుట్టలో గోల్డ్ డాలర్లు మాయం!

- ఆడిట్‌లో వెలుగుచూసిన అవకతవకలు
- భక్తుల్లో ఆందోళన
- విచారణకు ఆదేశించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్**

ప్రపంచ ప్రసిద్ధ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఆలయ ప్రచార విభాగానికి చెందిన రూ.20 లక్షల విలువైన బంగారు డాలర్లు మాయమైనట్లు వార్షిక ఆడిట్‌లో బయటపడటంతో తీవ్ర కలకలం నెలకొంది.ఈ ఉదంతంపై విచారణ జరిపాలని దేవాదాయ శాఖ మంత్రి తరువాయి 2లో

# సమాజాన్ని చీల్చే ప్రమాదం


- యుజిసి కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే
- రెగ్యులేషన్స్‌ను పున: పరిశీలించాలని జడ్జిలతో కూడిన కమిటీకి సూచన




**న్యూఢిల్లీ :** విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో కుల ఆధారిత వివక్షను నిరోధించడంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) జారీ చేసిన సమానత్వ (ఈక్విటీ) నిబంధనలపై గురువారం సుప్రీంకోర్టు ‘స్టే’ విధించింది. ఆ నిబంధనలు ప్రాథమికంగా ‘అస్పష్టమైనవి’, ‘దుర్వినియోగం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి’ అని నిరూపించిందని సర్వోన్నత న్యాయస్థానం కీలక తరువాయి 2లో

## ఏ దేశానికీ
# చైనా ముప్పుకాదు

- ఇతరదేశాల అంగుళం భూమిని కూడా ఆక్రమించలేదు
- బ్రిటన్‌తో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం
- స్టార్‌మర్‌తో భేటీలో జిన్‌పింగ్ ప్రకటన
- బ్రిటన్ నుండి చైనాకు 30 రోజులు వీసాలేని ప్రయాణాలు



**బీజింగ్:** లోతైన సంబంధాలు పటిష్టం చేసుకోవడానికి దీర్ఘకాలిక సమగ్ర వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్య సహకారం కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ ఉద్ఘాటించారు. మూడు రోజులు చైనా పర్యటనలో ఉన్న కీర్‌స్టార్‌మర్–జిన్ పింగ్ మధ్య బీజింగ్‌లోని గ్రేట్‌హాల్‌లో అనుకున్నదానికంటే రెట్టింపు సమయం ముఖాముఖీ సమావేశం జరిగింది.

రెండు దేశాలమధ్యా సంబంధాల్లో మలుపులు, మెలికలూ ఉన్నప్పటికీ ఇరు దేశాలమధ్యా సంబంధాలు మాత్రం అనివార్యంగా కొనసాగుతాయని జిన్‌పింగ్ అన్నారు. చైనా ఎంతగా అభివృద్ధి చెందినా, ఎలా అభివృద్ధి చెందినా ఏ ఇతర దేశానికీ ముప్పు కలిగించదని అన్నారు. శాంతియుతమైన అభివృద్ధితో చైనాకు ఉన్న నిబద్ధతను జిన్‌పింగ్ ఉద్ఘాటించి చెబుతూ, చైనా ఎప్పుడూ ఎక్కడా యుద్ధం ప్రారంభించలేదని, విదేశాలకు చెందిన ఒక్క అంగుళం భూమిని కూడా ఏనాడూ ఆక్రమించలేదని స్పష్టం చేశారు. ప్రపంచశాంతి,సుస్థిరత, ఆర్థిక వ్యవస్థల ప్రయోజనాల రీత్యా రెండు దేశాలమధ్యా మరింతగా సంభాషణలు జరగడం అనివార్యమని జిన్‌పింగ్ అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధానంతరం ప్రపంచ క్రమానికి ఎదురైన సవాళ్ళను, నాటో మిత్రులు,గ్రీన్‌లాండ్, ఇరాన్‌తో అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ విషయాలను నాయకులిద్దరూ ప్రస్తావించకపోయినప్పటికీ వ్యక్తీకరణలో తరువాయి 12లో

# ఇరాన్ మెడలు వంచేందుకు ట్రంప్ తీవ్ర యత్నం





**వాషింగ్టన్ :** సమయం మించిపోతోందని, ఇరాన్ తొందరపడి అణు ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక చేశారు. అణ్వాయుధాలను నివారించే ఒప్పందం అన్ని దేశాలకూ మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో ఇరాన్ ప్రభుత్వం కూడా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. అమెరికా చర్యలను వివరిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరింది. ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా ట్రంప్‌కు దీటుగా సమాధానం ఇచ్చారు. యుద్ధం ముంచుకువస్తే తమదేశం బలంగా ప్రతిఘటిస్తుందని మరోసారి ప్రతి హెచ్చరిక చేశారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయడం లేదని శాంతియుత ప్రయోజనాలకోసమే అణుశక్తిని ఉపయోగిస్తోందని మరోసారి ఆయన ఉద్ఘాటించారు. అమెరికా ఇరాన్ మధ్య గత ఏడాది ఏప్రిల్ 12 వ తేదీన వరుసగా ఐదుసార్లు అణు చర్చలు పలుచోట్ల జరిగాయి. ఆ తర్వాత ఈ చర్చల్లో ఫలితాలు రాకపోవడంతో నిరవధికంగా వాయిదాపడ్డాయి. ఇక ఉద్రిక్తతలు పెరిగి ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా వరుస దాడులు చేశాయి. అప్పటినుండీ ఇప్పటివరకూ ఆ ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌లో ఖమేనీ పరిపాలన అంత్య దశకు చేరిందని ట్రంప్ పదే పదే ప్రకటనలు చేస్తున్నారు.
పశ్చిమాసియాకు మరిన్ని యుద్ధ విమానాలను మోసుకెళ్ళే నౌకల దండు బయలుదేరిందని బుధవారంనాడే ట్రంప్ ప్రకటించారు. అబ్రహాంలింకన్ నౌక నుండి ఇప్పటికే అమెరికా సేనలు ఇరాన్ సమీపంలో గగనతల విన్యాసాలు చేస్తున్నాయి. ఇదేసమయంలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సెనేట్ విదేశీ వ్యవహారాల కమిటీ ఎదుట మాట్లాడుతూ, ఇరాన్‌లో ఆ దేశ సర్వాధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీని అధికారం నుండి తప్పిస్తే చివరకు పరిపాలనపగ్గాలు ఎవరి చేతుల్లోకి వెళతాయో తెలియదన్నారు. ఐతే ఇరాన్ మాజీ యువరాజుగా ప్రకటించుకున్న రెజా పహ్లవీ చాలా దశాబ్దాల అజ్ఞాతం తర్వాత అమెరికా ప్రోత్సాహంతో ఇరాన్‌లో అడుగుపెట్టేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. ఇరాన్‌కు వెళ్ళేందుకు సమయం కోసం ఆయన కాచుకుని ఉన్నారు.

**వెనిజులాకు సోఫియా నౌకను స్వాధీనం చేసిన అమెరికా :** కరీబియన్ జలాల్లో స్వాధీనం చేసుకున్న అతిపెద్ద చమురు నౌక సోఫియాను వెనిజులాకు అమెరికా తిరిగి స్వాధీనం చేసింది. గడచిన ఆరునెలలుగా వెనిజులాపై ప్రత్యేక మిషన్‌ను నడిపిన అమెరికా కరీబియన్ జలాల నుండి ఏడు వెనిజులా నౌకలను స్వాధీనం చేసుకుంది. వీటిల్లో అతిపెద్దదైన సోషియా నౌకను మొదటి విడతతా వెనిజులా తాత్కాలిక ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. జనవరి మూడో తేదీన వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్‌చేసి న్యాయార్క్‌కు తరలించిన తర్వాత కూడా కరీబియన్ జల్లాలలో మాఫియా డ్రగ్స్ ముఠాల పేరుతో ఒక పడవపై అమెరికా దళాలు దాడిచేసి ఇద్దరిని హతమార్చాయి. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలితో సానుకూల సంబంధాలు కొనసాగించే క్రమంలో భాగంగా సోఫియా నౌకను స్వాధీనం చేశారు. ఇదే సమయంలో వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌కు పోలీసులు, సైనికులు పూర్తి విధేయత ప్రకటించారు. అంతర్గత సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోవాలని ఆమె ఇప్పటికే దేశంలోని అన్ని విభాగాలకు పిలుపు ఇచ్చారు.

# బాగ్దాద్‌లో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు



**బాగ్దాద్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో వందలాదిమంది నిరసన ప్రదర్శన జరిపారు. బాగ్దాద్‌లో అమెరికా దౌత్యకార్యాలయం ఎదుట గురువారం వందలమంది గుమిగూడి అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. ఇరాక్ దేశ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని నినాదాలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ అనుసరిస్తున్న దుందుడుకు విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఇరాక్‌లో ఎవరు ప్రధానమంత్రిగా ఉండాలో ట్రంప్ నిర్ణయించలేరని, ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విధమైన జోక్యం ఇరాక్ సార్వభౌమాధికారాన్ని, ఇరాన్ ప్రజాస్వామ్య విధానాన్ని ఉల్లంఘించడమేనని ప్రదర్శకులు విమర్శించారు. ఇరాన్ మాజీ ప్రధానమంత్రి నూరీ అల్ మలికిని తిరిగి ప్రధానమంత్రి పదవిలో కూర్చోబెడితే సహించేదిలేదని, ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించబోమని, ఆ దేశంతో సంబంధాలు తెంచుకుంటామని ట్రంప్ చేసిన హెచ్చరికలతో బాగ్దాద్‌లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. 2006 నుండి 2014 వరకూ అల్ మలికి ఇరాక్ ప్రధానమంత్రిగా ఆ తర్వాత రెండేళ్ళు ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. ఇరాక్ పార్లమెంటులో అత్యధికంగా ఉన్న షియా ప్రజాప్రతినిధుల కూటమి గడచిన శనివారం అల్ మలికీని దేశ ప్రధానమంత్రి పదవికి ఎంపిక చేస్తూ తీర్మానం చేసింది. తదుపరి ప్రభుత్వానికి మూడోసారి ఆయనే ప్రధానమంత్రిగా నాయకత్వ బాధ్యతలు తీసుకుంటారని షియా కూటమి ప్రకటించింది. దీనిని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## ద.కొరియా మాజీ ఫస్ట్‌లేడీకి 20నెలల జైలుశిక్ష



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుఖ్ యోల్ సతీమణి, ఆ దేశ మొదటి పౌరురాలు(మాజీ) కిమ్ కియోన్ హీ (52)కు సియోల్ సెంట్రల్ జిల్లా న్యాయస్థానం అవినీతి కేసులో ఇరవై నెలలు జైలుశిక్ష విధించింది. రెండు లగ్జరీ హ్యాంగ్‌బ్యాగ్‌లు, బిఎండబ్ల్యు కారు డీలర్‌షిప్, ఒక వివాదాస్పద చర్చి వంటివన్నీ ఆమెపై కేసు విచారణకు, జైలుశిక్షకు దారితీశాయి. గత ఏడాది ఆగస్టు నెలలో దర్యాప్తు అధికారులు కియోన్ హీను అరెస్టు చేశారు. మతపరమైన వివాదాస్పద యూనిఫికేషన్ చర్చికి మేలు చేసినందుకుగాను చర్చి నుండి ఆమె వజ్రాల హారం, లగ్జరీ ఛానెల్ బ్యాగ్ వంటివాటిని లంచాలు తీసుకున్నందుకు న్యాయస్థానం ఆమెను దోషిగా నిర్థారించింది. బిఎండబ్ల్యు డీలర్ డ్యూచ్ తో కలిసి మోటార్ స్టాక్ ధరలను రిగ్గింగ్ చేయడం ద్వారా 2010–2012 మధ్యకాలంలో 552,570 డాలర్లు ఆమె సంపాదించారని న్యాయస్థానం ఎదుట ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. 2024లో ఆమె భర్త, దేశాధ్యక్షుడు యూన్‌సుఖ్ యోల్ దేశంలో మార్షల్ లా విధించి తప్పిదం చేయడంతో ఆయన పదవీచ్యుతుడయ్యారు. ఐదేళ్ళు జైలుశిక్షకు గురయ్యారు. ఐతే భర్త నిర్ణయాల్లో కియోన్ హీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమె అవినీతి కేసులో శిక్షకు గురయ్యారు. మూడు నేరాల కింద ఆమెకు 15 సంవత్సరాలు జైలు శిక్ష విధించాలని ప్రాసిక్యూటిర్ వాదించారు.

## వియత్నాం–యూరప్ మధ్య మరింత మెరుగైన భాగస్వామ్య బంధం

**హనోయ్ :** వియత్నాం–యూరోపియన్ యూనియన్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలు నాయకులు మరింత మెరుగైన స్థాయిలో పునరుద్ధరించుకున్నారు. భారత్‌తో వ్యూహాత్మక,దీర్ఘకాలిక సమగ్ర స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం చేసుకున్న తర్వాత యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా గురువారం వియత్నాంలో పర్యటించి ఇప్పటివరకూ ఉన్న భాగస్వామ్య ఒప్పందాన్ని మరింత మెరుగైనస్థాయిలో పునరుద్ధరించుకున్నారు. అమెరికా టారిఫ్ ఒత్తిడుల నేపథ్యంలో ప్రపంచక్రమం, వాణిజ్యం, ఇంధన భద్రత, సరఫరాల వ్యవస్థ ఏ మాత్రం దెబ్బతినకుండా ఉండటంకోసం మరింత శక్తిని కూడదీసుకునేలా ఈ మెరుగైనస్థాయిలో ఒప్పంద పునరుద్ధరణ జరిగింది. దేశంలో ఆర్థిక వృద్ధి సాధ్యమని వియత్నాం కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి తో లామ్ ప్రకటించిన వారంరోజుల తర్వాత ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

## దక్షిణాఫ్రికాలో ప్రమాదం : 11 మంది మృతి

**జోహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికాలో ఒక మినీబస్ టాక్సీ, లారీ ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. దర్బన్ నగర సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన జరిగిందన రవాణా విభాగం అధికారి సిబొనిసో దుమా చెప్పారు. మరణించినవారిలో ఒక పాఠశాల విద్యార్థి కూడా ఉన్నారు. లారీ డ్రైవర్ యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వారం రోజుల క్రితం దేశంలో జరిగిన ఘోర ప్రమాదంలో 14 మంది స్కూలు పిల్లలు మరణించారు. ఈ ఘటన మరువకముందే మరో ప్రమాదం చోటుచేసుకుంది. మినీబస్ డ్రైవర్ నలిగిపోయిన భాగాలమధ్య ఇరుక్కుని మరణించాడు.

# 11మంది మాఫియా కుటుంబీకులకు ఉరి



**బీజింగ్ :** మయన్మార్ ఈశాన్య ప్రాంత సరిహద్దుల్లో అవినీతిని ప్రోత్సహించే అనేక కేంద్రాలను నడిపిని ఒకే కుటుంబానికి చెందిన 11 మంది మాఫియా సభ్యులను చైనా ప్రభుత్వం ఉరితీసింది. చైనా–మయన్మార్ మధ్య 2,129 కి.మీ పొడవునా సరిహద్దులున్నాయి. ఈ సరిహద్దు ప్రాంతాల్లో మింగ్ కుటుంబానికి చెందినవారు హత్యలు, అక్రమాలు,మోసాలు,జూదం, వ్యభిచార గృహాలు వంటి అనేక నేర కేంద్రాలతో మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మయన్మార్ ప్రభుత్వం ఈ కుటుంబీకులను పట్టుకుని చైనాకు స్వాధీనం చేసింది. చైనా బెజియాంగ్ రాష్ట్రంలోని న్యాయస్థానం వారికి ఉరిశిక్షలు విధించి శిక్ష లు అమలు చేసిందని వార్తా నివేదికలు చెబుతున్నాయి. లక్కింగ్ అనే పట్టణాన్ని నడిపిన వంశాలలో మింగ్ వంశం ఒకటి. ఈ వంశీకులు చివరకు తరాలు మారేసరికి మాఫియా కార్యకలాపాలకు దిగారు. ఈ లక్కింగ్ పట్టణాన్ని మింగ్ కుటుంబీకులు అతి పెద్ద క్యాసినో, వ్యభిచార కేంద్రంగా మార్చడంతో ఈ మాఫియా కార్యకలాపాల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2023లో మయన్మార్ ప్రభుత్వం సైన్యంతో వెళ్ళి వారి మాఫియా సామ్రాజాన్ని కుప్పకూల్చి వారందరినీ అరెస్టు చేసింది. చైనాకు అప్పగించింది. ఇక మీదట ఇలాంటి మోసాలు చెల్లుబాటు కావని చైనా సందేశం పంపింది. కానీ ఇప్పుడు ఈ విధమైన మాఫియా కార్యకలాపాల కేంద్రాలన్ని చైనా సరిహద్దులకు దూరంగామయన్మార్–థాయ్‌లాండ్, కాంబోడియా, లావోస్ సరిహద్దు ప్రాంతాలకు తరలివెళ్ళాయి. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మయన్మార్–ఆగ్నేయ ఆసియా ప్రాంతాలలో ఆన్‌లైన్ మోసాలు, కార్యకలాపాలు నిర్వహించడానికి లక్షలమందిని అక్రమంగా తరలించారు. ఈ విధంగా అక్రమంగా తరలించినవారిలో చైనా జాతీయులే ఎక్కువమంది ఉన్నారు. పైగా వీరంతా చైనీయులనే మోసం చేసి అక్రమంగా డబ్బులు గుంజుతున్నారన్నది ఐక్యరాజ్యసమితి నివేదిక చెబుతున్నది. గడచిన నవంబరునెలలో బాయ్ కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులను కూడా ఉరితీశారు. ఈ నేర కేంద్రాల కారణంగా 2015 నుండి 2023 వరకూ 14 మంది చైనీయులు మరణించారని, అనేకమంది గాయపడ్డారని తీర్పు సందర్భంగా చైనా కోర్టు పేర్కొంది.

## భాగస్వాములు కండి
(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానానికి స్పందించి వారితో సానుకూలంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌బిఎస్ విద్యార్థుల కెరీర్ లక్ష్యాలు, వృత్తి పరమైన సవాళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తెలుసుకున్నారు. అలాగే వృత్తి జీవనంలో విజయం సాధించడానికి అవసరమైన అంశాలు, తన వ్యక్తిగత అనుభవాల ఆధారంగా రూపొందించుకున్న విజయ మంత్రాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలోని ముఖ్యాంశాలను వివరిస్తూ, తమ నెట్‌వర్క్, ప్రతిభను వినియోగించి భారత్ అభివృద్ధి చర్యలలో భాగస్వాములు కావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో ఉన్న అవకాశాలు, రాష్ట్ర బలాబలాలను ప్రపంచానికి తెలియజేసే బ్రాండ్ అంబాసిడర్లుగా విద్యార్థులు ముందుకు రావాలని సిఎం కోరారు. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలో చదువుతున్న యువత దేశ అభివృద్ధికి దోహదపడాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కీలకమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## అత్యంత ప్రమాదకరం
(మొదటి పేజీ తరువాయి)

ఖజురి (యుపి),బొకారో (ఝార్ఖండ్) డ్యాములు ప్రమాదకరంగా ఉన్నాయని ఆ శాఖ వెల్లడించింది. పార్లమెంట్‌లో ఎంపిలు లక్ష్మి నారాయణ, బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. దేశంలో 50 ఏళ్ల పైబడిన డ్యాములు 1681 ఉన్నాయని, ఇందులో గత ఏడాది వర్షాకాలంలో 6553 డ్యాములను తనిఖీ చేశామని, దేశ వ్యాప్తంగా 50 ఏళ్లకు పైబడిన 1,681 డ్యాములు ఉన్నట్టు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ ) రూపొందించిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ స్పెసిఫైడ్ డ్యాముల 2025 నివేదిక ఆధారంగా ఈ గణాంకాలను కేంద్రం ప్రకటించింది. వర్షాకాలంలో తనిఖీల్లో భాగంగా దేశంలోని డ్యామ్‌ల భద్రతను మూడు వర్గాలుగా వర్గీకరించింది. ఇందులో అత్యంత ప్రమాదకరం స్థితిని 'కేటగిరీ1' పరిధిలో పొందుపర్చింది. కాగా తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ బ్యారేజీ విషయంలో నిర్మాణ, భద్రత, స్థిరత్వం, దీర్ఘకాలిక దృఢత్వాన్నికాపాడేందుకు ఎన్‌డిఎస్‌ఎ సూచించిన వివిధ నివారణ , ప్రమాద నియంత్రణ చర్యలను అమలు చేయాలని కేంద్ర జలశక్తి రాష్ట ప్రభుత్వానికి సూచించింది. బ్యారేజ్ భద్రతకు ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టలని స్పష్టం చేసింది.

## డాలర్లు మాయం!
(మొదటి పేజీ తరువాయి)

కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆదికారులను కోరారు. భక్తులకు అమ్మకానికి ఉంచిన బంగారు డాలర్ల నిల్వలు, రికార్డుల మధ్య భారీ తేడా ఉండటాన్ని ఆడిట్ అధికారులు గుర్తించారని, ఈ వ్యవహారం ఆలయ పరిపాలనలో లోపాలు, నిర్లక్ష్యంపై అనుమానాలకు తావిస్తోందన్నారు.ఈ వ్యవహారం పై నేరాకి పాల్పడిన ఓ క్లర్క్ నుంచి ఇప్పటికే రూ.17 లక్షలు రికవరీ చేసినట్లు తెలిసింది. మరో రూ.3 లక్షలు రివకరీ చేయాలి ఉంది. అయితే ప్రతి ఏడాది యాదగిరిగుట్ట ఆడిట్ రిపోర్టు పరిశీలిస్తురు. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం ఆడిట్ చేస్తుండగా ఈ వ్యవహారం బయటపడింది. ఆలయ ప్రచార విభాగానికి చెందిన క్లర్క్ వెండి, బంగారు డాలర్లను విక్రయించి వచ్చిన సొమ్మును యాదగిరిగుట్ట దేవస్థానం అకౌంట్‌లో జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్నాడని తెలిసింది. ఇలా ఇతగాడు ఏడాది కాలంలో రూ.20 లక్షలు కాజేశాడని తేలింది. నెలవారి వాయిదాల చొప్పున నిందితుడి నుంచి రూ.17లక్షలు రికవరీ చేయగా మిగిలిన సొమ్మును కూడా రివకరీచేసే పనిలో పడ్డారు. ఇప్పటికే గతంలోనూ ఆలయ పరిపాలనపై ఆరోపణలు రావడంతో, ఈ తాజా ఘటన ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారినట్లు చర్చ సాగుతోంది.భక్తుల నమ్మకానికి భంగం కలిగించే ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే ఉద్యోగులు, అధికారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

## కెసిఆర్‌కు నోటీసులు (మొదటి పేజీ తరువాయి)

నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నెంబర్ 243/2024 కేసు విచారణలో భాగంగా కెసిఆర్‌కు జూబ్లీహిల్స్ ఎసిపి వెంకటగిరి నోటీసులు జారీ చేశారు. సైబర్ నేరాలు, మోసం, ఫోర్జరీ తదితర తీవ్రమైన ఆరోపణలతో నమోదైన ఈ కేసు ప్రస్తుతం మరింత విచారణ దశలో ఉందని నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలు, పరిస్థితులపై కెసిఆర్‌కు అవగాహన ఉన్నట్లు దర్యాప్తులో వెలుగులోకి రావడంతో ఆయన వాంగ్మూలం అవసరమని ఎసిపి తను జారీ చేసిన నోటీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే కెసిఆర్ వయస్సు 65 ఏళ్లు దాటిన కారణంగా, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 160 నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్‌కు హాజరు కావడం తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. కావాలంటే స్వచ్ఛందంగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు రావచ్చని, లేకపోతే హైదరాబాద్ నగర పరిధిలో తనకు అనుకూలమైన ఇతర ప్రాంతాన్ని సూచిస్తే అక్కడే విచారణ చేపడతామని నోటీసులో వెల్లడించారు. విచారణ జరిపే స్థలాన్ని ముందుగా తెలియజేయాలని కూడా సూచించారు.
ఈ నోటీసును జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి జారీ చేశారు. రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన వ్యక్తికి నోటీసులు జారీ కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**విచారణకు హాజరుకాలేను**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు స్పందించారు. ఈ మేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ డివిజన్ ఎసిపి వెకంటగిరికి గురువారం రాత్రి ఆయన లేఖ రాశారు. మున్సిపల్ ఎన్నికలు, నామినేషన్ల పర్వం కొనసాగుతుండడంతో శుక్రవారం విచారణకు హాజరు కాలేనని, తనకు కాస్త సమయం కావాలని కెసిఆర్ కోరారు. ఎర్రవెల్లిలోని ఫామ్హౌజ్‌లోనే విచారణ చేయాలని లేఖలో పోలీసులకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసిన తర్వాత విచారణ చేపట్టాలని కోరారు. బాధ్యత గల పౌరుడిగా విచారణకు సహకరిస్తానని అన్నారు. సిఆర్‌పిసి సెక్షన్ 160 ప్రకారం, విచారణ నిమిత్తం పిలవబడే వ్యక్తి 65 సంవత్సరాల పైబడినవారైతే, అతడిని అతని నివాస స్థలం తప్ప మరెక్కడికీ హాజరుకావాలని ఆదేశించరాదని చట్టం స్పష్టంగా పేర్కొంటుందని కెసిఆర్ గుర్తుచేశారు. మహిళలు, వృద్ధులు, శారీరకంగా బలహీనులైన వారిని కూడా వారి నివాసంలోనే విచారించాల్సి ఉంటుందని వివరించారు.కావున తనను కూడా తన నివాసంలోనే విచారించాలన్నారు. చట్టబద్ధమైన విచారణకు పూర్తి సహకారం అందిస్తానని, అయితే నిబంధనలకు విరుద్ధమైన ఆదేశాలను అంగీకరించలేనని లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

**సానుకూలంగా స్పందించిన సిట్ అధికారులు..**

కెసిఆర్ రాసిన లేఖపై సిట్ అధికారులు సానుకూలంగా స్పందించారు. శుక్రవారం జరగాల్సిన విచారణను వారు వాయిదా వేసినట్లు సమాచరం. తదుపరి విచారణ తేదీలను త్వరలో ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

## చీల్చే ప్రమాదం (మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోని పక్షంలో ఆ నిబంధనలు ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతాయని, 'సమాజాన్ని విభజిస్తుందని' అత్యున్నత న్యాయస్థానం మౌఖికంగా వ్యాఖ్యానించింది. యుజిసి కుల ఆధారిత వివక్షకు 'చేర్చబడని' నిర్వచనాన్ని స్వీకరించిందని, సంస్థాగత రక్షణ నుంచి కొన్ని వర్గాలను మినహాయించిందని వివిధ పిటిషన్లు వాదించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిబంధనలు వివిధ ప్రాంతాలలో నిరసనలకు దారితీసాయి. విద్యార్థి సంఘాలు, సంస్థలు దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌ను లేవనెత్తాయి. కేంద్రం, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు నోటీస్ జారీ చేస్తున్నప్పుడు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ ఈ నిబంధనలను ప్రముఖ న్యాయమూర్తులతో కూడిన కమిటీ పున: పరిశీలించాలని సూచించింది.'ఇష్యూ నోటీస్ మార్చి 19న తిరిగి ఇవ్వబడుతుంది. సొలిసిటర్ జనరల్ నోటీస్...అదే సమయంలో 2026 యుజిసి నిబంధనలూ అలాగే ఉండనివ్వండి. 2012 నిబంధనలు కొనసాగుతాయి' అని బెంచ్ పేర్కొంది. విచారణ సందర్భంగా ధర్మాసనం ఇలా వ్యాఖ్యానించింది.'ప్రాథమికంగా రెగ్యులేషన్ భాష అస్పష్టంగా ఉందని మేం భావిస్తున్నాం. నిపుణులు భాషనుదుర్వినియోగం చేయకుండా మాడ్యులేట్ చేయాలో? లేదో? పరిశీలించాలి. కాగా వివక్షత ఫిర్యాదులను పరిశీలించడానికి 'ఈక్విటీ కమిటీలు' ఏర్పాటు చేయాలనే కొత్త నిబంధనలను జనవరి 13న నోటిఫై చేశారు. ఈక్విటీని ప్రోత్సహించడానికి ఈక్విటీ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఆదేశించాయి. యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈక్విటీ ఉన్నత విద్యా సంస్థల (ప్రమోషన్) నిబంధనలు 2026 ప్రకారం కమిటీలలో ఇతర వెనకబడిన తరగతులు (సి, షెడ్యూల్డ్ కులాలు(ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి) దివ్యాంగులు, మహిళలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. కుల ఆధారిత వివక్షను ఎస్‌టిలు, ఎస్‌సిలు, ఒబిసిల సభ్యులపై వివక్షగా కచ్చితంగా నిర్వచించారనే కారణంతో పిటిషన్లు రెగ్యులేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించాయి. కుల ఆధారిత వివక్షను కేవలం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల సభ్యులపై వివక్ష మాత్రమే పరిమితం చేయడం ద్వారా యుజిసి జనరల్ లేదా నాన్ రిజర్వ్ వర్గాలకు చెందిన వ్యక్తులకు సంస్థాగత రక్షణ, ఫిర్యాదుల పరిష్కారాన్ని సమర్థవంతంగా నిరాకరించిందని, వారు వారి కుల గుర్తింపు ఆధారంగా వేధింపులు లేదా పక్షపాతాన్ని కూడా ఎదుర్కొంటారని పేర్కొంది. మృత్యుంజయ్ తివారీ న్యాయవాది వినీత్ జిందాల్, రాహుల్ దివాన్ దాఖలు చేసిన యుజిసి ఈక్విటీ రెగ్యులేషన్స్2026 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం విచారిస్తోంది.

## 7% వృద్ధిరేటు(మొదటి పేజీ తరువాయి)


ప్రకారం, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం యొక్క అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. తక్కువ ప్రస్తుతం అత్యంత సానుకూల పరిస్థితుల్లో ఉందని సర్వే వెల్లడించింది. అన్ని రంగాల్లో విస్తృతంగా సాగుతోందని, గ్లోబల్ షాక్‌లు లేదా అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన వ్యవస్థ భారత్ వద్ద ఉందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధి రేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మధ్యకాలికంగా చూస్తే.. భారతదేశం యొక్క వృద్ధి పథం చాలా బలంగా ఉందని, ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. బడ్జెట్ 2026 కు అసలైన 'రిపోర్ట్ కార్డ్ కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఈ ఎకనామిక్ సర్వేను సమర్పించారు. ఆర్థిక వ్యవహారాల విభాగం రూపొందించిన ఈ కీలక పత్రం, ప్రభుత్వ ఆర్థిక పనితీరుకు ఒక నివేదిక లాంటిది.

1. విపరీతంగా పెరుగుతున్న 'డిజిటల్ అలవాటు' భవిష్యత్తులో విద్యా వ్యవస్థపై, యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
2. ఉద్యోగావకాశాలు పెరగడానికి, నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి కొత్తగా ప్రవేశపెట్టబోయే నాలుగు లేబర్ కోడ్స్ ఉపయోగపడ తాయి.
3. వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధ్యమైనప్పటికీ, వాతావరణ సమస్యలు, సాగునీటి వనరుల తగ్గుదల వంటి సమస్యలు వేధిస్తున్నాయి.
4. కృత్రిమ మేధస్సు (ఎఐ) రంగంలో మన దేశం కొంత ఆలస్యంగా అడుగుపెట్టినప్పటికీ, వేగంగా దూసుకెళ్లే సత్తా ఉంది.
5. యూరియా ధర 45 కిలోల సంచీకి రూ. 242గా 2018 నుంచి కొనసాగుతున్నది. ఈ ధరను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలి. అయితే, అందుకు సమానమైన మొత్తాలను ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలి.
6. రైతులు స్వచ్ఛందంగానే పంట మార్పిడి విధానాలను అనుసరించాలి. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి ఈ చర్య అత్యవసరం. కాబట్టి, రైతులే స్వయంగా పంట మార్పిడిని అనుసరించాలి.
7. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, మొత్తం జాతీయోత్పత్తి (జిడిపి)లో 4.4 శాతంగా ఉండవచ్చని అంచనా. ఈ లోటను భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది.
8. ఒకవైపు పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తూనే, మరోవైపు 'విక్సిత్ భారత్' లక్ష్యాలను

### ఎకనామిక్ సర్వే ప్రస్తావించిన కీలక అంశాలు..

చేరడానికి వీలుగా పరిశ్రమలను ప్రోత్సహించాలి. ఈ రకంగా స్వల్పకాల, దీర్ఘకాల ప్రయోజనాలను ఒకే సమయంలో అందుకోవడానికి భారత్ ప్రయత్నించాలి.

9. ప్యాక్ చేసిన ఆహార వస్తువులను నిషేధించాలి. కనీసం, వాటి అమ్మకాలకు సంబంధించిన ప్రకటనలను ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకూ నిషేధించాలి. జంక్ ఫుడ్ వల్ల దేశ ప్రజలు, ప్రత్యేకించి పిల్లలు, యువత ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవాలి. జిఎస్‌టి రేటుతో సంబంధం లేకుండా ఇలాంటి ఆహారంపై 'అల్ట్రా–ప్రాసెస్డ్ ఫుడ్' (యుపిఎఫ్) పన్నులు వేయాలి.
10. ఒడిదుడుకులు లేని స్థిరమైన విదేశీ సంస్థాగత పెట్టుబడులు రాబట్టుకునేందుకు ప్రభుత్వం బహుళ ప్రయోజన విధానాలను అనుసరించాలి.
11. పిల్లలకు విద్యా సంబంధమైన అంశాలను అందిస్తున్నట్టు ప్రకటించుకుంటున్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ సంస్థలే, అందులో పేర్కొన్న లేదా వివరించిన అంశాలకు బాధ్యత వహించాలి. అదే విధంగా ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అమలు చేస్తున్న రీతిలో, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను ఉపయోగించుకోవడానికి కనీస వయసును ఖరారు చేయాలి. కొవిడ్ 19 కాలంలో అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ బోధనా విధానాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాలపై ఆధారపడడాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించుకోవాలి. పిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన, సులభంగా ఉపయోగించగలిగే టాబ్స్ వంటి పరికరాలు ఇవ్వాలి.
12. ఏప్రిల్ నుంచి అమలుకానున్న నాలుగు లేబర్ కోడ్స్ వల్ల దేశంలో ఉద్యోగితా శాతం పెరుగుతుంది. ప్రైవేటు రంగంలో పెట్టుబడులు అధికమవుతాయి.
13. ఆర్‌టిఐ చట్టాన్ని పునఃసమీక్షించాలి. రెండు దశాబ్దాల క్రితం నాటి ఈ చట్టాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సిన అవసరం ఉంది.
14. జిఎస్‌టి వంటి చట్టాల్లో సంస్కరణలను 2027లో అమల్లోకి తీసుకురావాలి.
15. 2027 నాటికి ద్రవ్యోల్బణం ప్రస్తుత అంచనాలకు మించి ఉండవచ్చు.
16.గిగ్‌వర్కర్లకు కొత్త విధానాలను రూపొందిం చాలి.
17. ఐరోపి దేశాలతో కుదిరిన ఒప్పందాల వల్ల దేశంలో ఉత్పత్తి రంగం బలోపేతం అవుతుంది.
18. 'స్వదేశీ' వస్తువులను వాడాలని ప్రచారం చేయాలి. తద్వారా దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి. దీనితో దేశంలో ఉత్పత్తితో పాటు ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి. విదేశాలకు ఎగుమతులుపెరగడం తో, విదేశీ ద్రవ్య నిల్వలు పెరుగుతాయి.
19. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అస్థిర పరిస్థితుల కారణంగా, ఎలాంటి రిస్క్ లేని పెట్టుబడులుగా బంగారం, వెండిని పరిగణలోకి తీసుకోవడంతో, వీటి ధరలు పెరుగుతున్నాయి. మరి కొంతకాలం ఇదే పరిస్థితి ఉంటుంది.



## ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టులను
# త్వరితగతిన పూర్తిచేయాలి

మామునూరు ఎయిర్‌పోర్టుకు భూమి అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పనిని వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని, ఆయన తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సిఎం కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సిఎం అన్నారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ భూమికి సంబంధించిన పత్రాలను డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క ప్రసంగిస్తూ 2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పదేళ్ల పరిపాలించిన వారు పట్టించుకోకపోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సిఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ నగరాలు అయిన కొత్తగూడెం, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును తెలంగాణ మంత్రివర్గం కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ముందుకు వెళ్లడం శుభ పరిణామమని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలుపెట్టారని, ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అని డిప్యూటీ సిఎం తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు రూ.300 కోట్లు అవసరమని గుర్తించి వాటిని వెంటనే విడుదల చేసి వడివడిగా అడుగులు వేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని డిప్యూటీ సిఎం తెలిపారు.

# రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా కార్యాచరణ

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వచ్చే 'ఆర్థిక సంవత్సర 2026–27' బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని, రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలిగే విధంగా కార్యాచరణ రూపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. 'తెలంగాణ విజన్2047' లక్ష్యాలను సాధించేందుకు వీలుగా శాఖల వారిగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, సచివాలయంలో బడ్జెట్ ప్రతిపాదనలపైన వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపి, తదితర ఉన్నతాధికారులతో మంత్రి గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ శాఖకు కేటాయించిన బడ్జెట్, ఖర్చులు, రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న వ్యవసాయ, ఉద్యానవనం, సహకార, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల పథకాల వివరాలను ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. రైతులకు ఇన్‌పుట్ సరఫరా, విస్తరణ సేవలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ సదుపాయాలు, డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలు,సహకార సంస్థల పనితీరు వంటి పలు అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. అనంతరం మంత్రితుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి శాఖల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలను సమగ్రంగా, స్పష్టమైన లక్ష్యాలతో సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు,మౌలిక వసతుల కల్పన, ఆధునిక సాంకేతికత అభివృద్ధి, కేంద్ర ప్రాయోజిత పథకాలను పూర్తిగా వినియోగించుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వృథా ఖర్చులకు ఆస్కారం లేకుండా, పథకాల అమలుకు నిజంగా అవసరమైన అంశాలను మాత్రమే గుర్తించి, ఖచ్చితమైన అంచనాలతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత పెంపు, రైతుల ఆదాయం మెరుగుదల, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాల రూపకల్పన, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సమర్థవంతంగా అమలు జరగాల్సిన పథకాల అవసరాన్ని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, వాస్తవ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతు కేంద్రంగా వ్యవసాయ విధానాలు రూపొందించడం, పథకాల అమలులో పారదర్శకత, ఫలితాలపై దృష్టి సారించడమే ప్రభుత్వ లక్ష్యమని తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వ్యవసాయ,ఉద్యాన వర్సిటీల వైస్ చాన్స్‌లర్లు జానయ్య, రాజిరెడ్డి, తెలంగాణ సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎం.డి కిరణ్,మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్ :** కేంద్ర ప్రాయోజిత పథకాలకు గత ఏడాది కేటాయించిన నిధులకు అదనంగా మరో రూ. 200ల కోట్లను కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తద్వారా రాష్ట్రంలో నేషనల్ మిషన్ ఆన్ అగ్రికల్చర్, పర్‌డ్రాప్ మోర్ క్రాప్, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసే అవకాశాలు ఉంటాయన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఆరు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడారు. కేంద్రం గత ఏడాది కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంగా కేంద్ర నిధులను వినియోగించు కోకపోవడంతో రైతులు నష్టపోయారని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 202526 సంవత్సరానికి కేంద్రం కేటాయించిన నిధులకు రాష్ట్ర వాటాను కూడా కలిపి మొత్తం నిధులను వినియోగించినట్టు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ దిశగా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి అభినందించినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. పామాయిల్‌పైన ఉన్న దిగుమతి సుంకాన్ని పెంచే దిశగా కృషి చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు.

## విచారణ కాదు... ప్రతీకారం : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రస్తుతం విచారణల పేరుతో బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు నోటీసులు జారీ చేయడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఇది విచారణ కాదని, ప్రతీకారమని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది న్యాయం కాదని, ఇదొక రాజకీయ దురుద్దేశమన్నారు. నోటీసులు, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరని, తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కెటిఆర్ అన్నారు.
కక్షసాధింపు రాజకీయాలను బిఆర్ఎస్ ఖండిస్తుందన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా అన్యాయ పాలనపై తాము పోరాటాన్ని కొనసాగిస్తామని, తెలంగాణ చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తామని కెటిఆర్ చెప్పారు.

**చౌక బారు రాజకీయాలకు పరాకాష్ట : హరీశ్‌రావు**

'సిట్' పేరుతో కెసిఆర్‌కు నోటీసులు జారీ చేయడం సిఎం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని బిఆర్ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్ రెడ్డి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని, తెలంగాణ సమాజమంతా కెసిఆర్ వెంటే ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాజకీయ వేధింపులకు తాము భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కెసిఆర్‌ను టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని హరీశ్ రావు తెలిపారు.

**ఇది రాజకీయ కక్ష సాధింపు : వినోద్ కుమార్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు సిట్ నోటీసు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఖండించారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు. సాధ్యం కాని హామీలను ఆచరణలో అమలు చేయలేక పోలీసులను అడ్డం పెట్టుకుని బిఆర్ఎస్ నాయకులను నోటిసుల పేరుతో బెదిరించే యత్నం చేస్తే భయపడేది లేదని వినోద్ కుమార్ అన్నారు.

## సిఎం, మంత్రుల ప్రమేయం లేకుండా...
# ఫోన్ ట్యాపింగ్ జరగదు

సిట్ విచారణతో అసలు నిజాలు బయటికి వస్తాయి

కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంలో రాజకీయ దురుద్దేశం లేదు

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగవని, అధికారులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడబోరని, సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటికి వస్తాయని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో జరిగిన వాస్తవాలు తెలుసుకోవడానికి సిట్ ఎవరికి అయిన నోటీసులు ఇవ్వొచ్చన్నారు. కెసిఆర్ అంటే ఉద్యమ నాయకుడిగా తమకు గౌరవం ఉందని, కెసిఆర్‌కి సిట్ నోటీసులు ఇవ్వడంలో రాజకీయ దురుద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో గురువారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహకాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని లక్ష్యంగా చేసుకుని, తీసుకోవాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.
ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ 500లకు పైగా నంబర్లు ట్యాపింగ్ అయ్యాయనే సమాచారం ఉందని, ఫోన్ ట్యాపింగ్ కేసులో పారదర్శక విచారణ జరగాలని, ట్యాపింగ్‌కు కారకులు ఎవరో తెలియాల్సి ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వాస్తవాలు బయటికి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

**ఇన్‌చార్జి మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉంది**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ జారీ విషయంలో ఇంచార్జ్ మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉందని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని చూరగోనేలా పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల కోసం డైవర్షన్ పాలిటిక్స్ చెయ్యాల్సిన అవసరం లేదని, మెజారిటీ స్థానాలు గెలుస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, ఎంఎల్‌ఎ భూపతి రెడ్డి, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్, కేశ వేణు సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఉన్నాయనే కెసిఆర్‌కు నోటీసులు..

నేరస్తులు పర్యవసానాలను ఎదర్కొంటారా? లేదా?

వేచి చూడాలి : కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ అనేది చాలా బాధాకరమైన అంశమని, దీని పర్యవసనాలను నేరస్తులు ఎదుర్కొంటారా లేదా ? అనేది వేచి చూడాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గుంపు మేస్త్రీ చేపట్టిన సిట్ నాన్ సీరియస్‌గా జరుగుతుందని, ఎన్నికల జరుగుతున్నాయనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. హైదరాబాద్‌లో కవిత గురువారం మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణను పూర్తి చేసి ఈ కేసును కంక్లూడ్ చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా లేదని, ఫోన్ ట్యాపింగ్‌లో ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని కవిత అన్నారు.




## పారిశ్రామిక రంగంలో యువత రాణించాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎపి మంత్రి టి.జి.భరత్


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ఆర్థికాభివృద్ధికి రెండు దశాబ్దాలకు పైగా అఖిల భారత ఆర్య వైశ్య పారిశ్రామికవేత్తల ఫోరం (ఎఐఎవిఐఎఫ్) ఎంతో కృషి చేస్తున్నదని, ప్రభుత్వ సహకారంతో రానున్న రోజుల్లో యువతకు పారిశ్రామిక రంగంలో మెలకువలు నేర్పించడంతో పాటు ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందిస్తామని ఎఐఎవిఐఎఫ్ అధ్యక్షులు రాంబాబు పబ్బిశెట్టి తెలిపారు. ఎఐఎవిఐఎఫ్ రజతోత్సవాలను ఫిబ్రవరి 1న హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని 'ప్రధాన్ కన్వెన్షన్'లో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గురువారం జరిగిన ఎఐఎవిఐఎఫ్ ప్రి లాంచ్ మీడియా సమావేశంలో అధ్యక్షుడు రాంబాబు పబ్బిశెట్టి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బత్తుల, సంయుక్త కార్యదర్శి కాశి విశ్వనాధం చింత, ట్రెజరర్ విజయ ప్రసాద్ గుంపల్లి, కన్వీనర్ మంచి రాజశేఖర్, మీడియా చైర్మన్ ఎర్రం బాలక్రిష్ణ తదితరులు కలిసి ఫోరం రజతోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్, గౌరవ అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ ఎంఎల్‌ఎ ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంఎల్‌సి బొగ్గారపు దయానంద్‌తో పాటు పలువురు ఎంఎల్‌ఎ లు, ఎంపిలు, ఐఎఎస్ లు, ఐపిఎస్ లు, ఆర్యవైశ్య ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని నిర్వాహకులు వివరించారు. ఈ వేడుకల్లో పారిశ్రామిక రంగం పట్ల యువతలో ఆసక్తిని పెంపొందించేందుకు 50 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గత 25 ఏళ్లుగా ఫోరం యువ పారిశ్రామికవేత్తలకు పొత్సాహాన్ని అందిస్తున్నదని, వ్యాపార, వాణిజ్య రంగాలలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తూ వారి అభ్యున్నతికి తొడ్పడుతున్నామన్నారు.

## మేడారం సందర్శించిన భట్టి, మహేష్ గౌడ్



**ప్రజాపక్షం/మేడారం :** మేడారం మహా జాతరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,దనసరి సీతక్కలు ఆదివాసీ సాంప్రదాయ కళాకారుల నృత్య ప్రదర్శన ద్వారా స్వాగతం పలికారు. అనంతరం వారు మేడారంలోని సమ్మక్క, సారలమ్మ లకు నిలువెత్తు బంగారంతో అమ్మవార్లకు మొక్కులు సమర్పించి అనంతరం సమ్మక్క సారలమ్మ లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని తల్లులను వేడుకున్నామని, ప్రభుత్వం రూ.210 కోట్లతో చేపట్టిన చరిత్రాత్మక కట్టడాలు దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయన్నారు. గతం కంటే ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని పేర్కొన్నారు. వనదేవతలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలా సుఖ సంతోషాలతో ఉంచాలని వేడుకున్నారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, జువల్ ఓరం



**ప్రజాపక్షం/ములుగు :** మేడారం మహాజాతరలో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జువల్ ఓరం, ఎస్‌సి ఎస్‌టి సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలు ప్రత్యేక ఛాపర్ ద్వారా గురువారం మేడారానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ దివాకరులు గిరిజన ఆచార సాంప్రదాయాలతో కొమ్ముకోయ బృందం నృత్యాలతో గద్దెల ప్రాంగణానికి కొమ్ముకోయ కళాకారుల డబ్బుల దరువులు, కొమ్ముల కిరీటాల నృత్యాల నడుమ సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు సమ్మక్క సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మేడారం శాశ్వత అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క




**ప్రజాపక్షం/మేడారం :** మేడారం సమ్మక్కసారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ గురువారం వరకు దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**మేడారం శాశ్వత అభివృద్ధికి 70 ఎకరాల విస్తరణ**

మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు.దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు.జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్పలక్నవరంజంపన్న వాగు వరకు పైప్లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్ డ్యాములు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**దుష్ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి : మంత్రి సీతక్క**

సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, నార్సింగి సర్కిల్-45, ఎస్‌ఎల్‌పి జోన్ : జిహెచ్‌ఎంసి.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No.01/EE/CIR-45/SLPZ/GHMC/1-4/2025-26 తేదీ: 29-01-2026

**పని కేటగిరి:** సివిల్ పనులు, **అంచనా విలువ:** రూ.52.35 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 30.01.2026న మ.03.00గం.ల నుండి 06.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సర్కిల్-45, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్: 9063816949.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-45, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 14653-PP/CL/ADVT/1/2025-26, Date: 29-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-9, ఉప్పల్.**

టెండర్ నోటీసు

TENDER NOTICE NIT No.26/EEC-9/UPL/GHMC/2025-26 తేదీ: 28-01-2026

**పని పేరు:** 4 పనుల కోసం: 'జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, చిల్కానగర్, వార్డ్ నెం. 7, శ్రీ రాఘవేంద్ర కాలనీ, రోడ్ నెం. 2, హౌస్ నెం. 2-17-76/3/10లో సిసి రోడ్డు వేయడం ద్వారా నీటి నిల్వను తొలగించడం. (వెడ్డర / సాగర / ఉప్పర కమ్యూనిటీ వ్యక్తులు మరియు సంఘాల కోసం రిజర్వ్ చేయబడింది)........ జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-9లోని ఉప్పల్ జోన్ ఇంజనీరింగ్ విభాగాన్ని పునరుద్ధరించడం.', **అంచనా విలువ:** రూ.71.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 06.02.2026న మ.02.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరి కిషోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.9, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-9, ఉప్పల్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 14642-PP/CL/ADVT/1/2025-26, Date: 29-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కార్యనిర్వాహక ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.

కొటేషన్ల ఆహ్వాన నోటీసు

NIQ No.10/EE-II/KHAIRATABAD ZONE/GHMC/2025-26 తేదీ: 29-01-2026

**NIQ No.**10, **పని పేరు:** జిహెచ్‌ఎంసి, కేజెడ్, ఖైరతాబాద్ సర్కిల్-35, రెడ్ హిల్స్ డివిజన్-146 పరిధిలోని పబ్లిక్ గార్డెన్‌లోని రాయల్ మసీదు ప్రాంగణంలో రంజాన్ పండుగ (2026) సందర్భంగా 40 రోజుల పాటు తాత్కాలిక ప్రాతిపదికన గాల్వనైజ్డ్ వాటర్‌ప్రూఫ్ షీట్లు మరియు చెక్క ఫ్లోరింగ్‌తో సూపర్ స్ట్రక్చర్ (వాటర్‌ప్రూఫ్) సరఫరా మరియు ఏర్పాటు చేయడం ద్వారా పౌర సౌకర్యాలను కల్పించడానికి కొటేషన్లు ఆహ్వానించడమైనవి.

| | |
|---|---|
| టెండర్ నోటిఫికేషన్/బిడ్ ఆహ్వాన తేదీ/స్పెసిఫికేషన్ పొందే తేదీ | 30-01-2026 మధ్యాహ్నం 12.00 గంటలకు, |
| బిడ్ సమర్పణ చివరి తేదీ మరియు సమయం / (లేదా) సీల్డ్ కొటేషన్లు స్వీకరించే తేదీ | 02-01-2026 మధ్యాహ్నం 12.15 గంటలకు, |
| ప్రీ-క్వాలిఫికేషన్ మరియు టెక్నికల్ బిడ్లను తెరవడం | 02-01-2026 మధ్యాహ్నం 12.30 గంటలకు |

**గమనిక:-** స్పెసిఫికేషన్‌ను కార్యనిర్వాహక ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్ నుండి పొందవచ్చు మరియు సీల్డ్ కొటేషన్లను కార్యనిర్వాహక ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్‌లో సమర్పించాలి. కావున, అర్హత గల ఏజెన్సీలు పైన పేర్కొన్న కాలంలో అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్లను సమర్పించవచ్చు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 14692-PP/CL/ADVT/1/2025-26, Date: 29-01-2026

# ఫైర్ సేఫ్టీపై హైడ్రా ఉక్కుపాదం

జూబ్లీహిల్స్‌లో 'నీరూస్' షోరూమ్ సీజ్
నాంపల్లి స్టేషన్ రోడ్డులో ఫర్నీచర్ షోరూంకు తాళం
ఫైర్ సేఫ్టీపై హైడ్రా విస్తృత తనిఖీలు
ప్రమాద నివారణ చర్యలు చేపట్టకపోతే కఠిన చర్యలు
హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక నిబంధనల అమలుపై హైడ్రా తనిఖీలను ముమ్మరం చేసింది. ప్రజల భద్రతను గాలికొదిలేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న షోరూమ్‌లపై కమిషనర్ ఏ.వి. రంగనాథ్ నేతృత్వంలోని బృందం కఠిన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్, నాంపల్లి ప్రాంతాల్లోని ప్రముఖ షోరూమ్‌లను అధికారులు సీజ్ చేశారు. ఈ క్రమంలో గురువారం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లో ఉన్న ప్రముఖ నీరూస్ షోరూమ్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులు కలిగిన ఈ భవనంపై అనుమతి లేకుండా రూఫ్ షెడ్ నిర్మించి, భారీగా వస్త్రాలను నిల్వ చేయడాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. వాటిపై కఠిన చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో హైడ్రా, ఫైర్, జిహెచ్‌ఎంసి, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

**జూబ్లీహిల్స్ నీరూస్ షోరూమ్ సీజ్ :** జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36లోని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ నీరూస్ షోరూమ్‌లో గురువారం హైడ్రా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. అనుమతి లేని రూఫ్ షెడ్డు వేసి భారీగా వస్త్రాలను నిల్వ చేశారు. రెండు అంతస్తుల్లో అమ్మకాలు జరుపుతూ, మిగిలిన మూడు అంతస్తులను గోదాముగా వాడుతున్నారు. కనీస ఫైర్ ఎన్‌ఓసి లేకపోవడం, అగ్నిప్రమాద నివారణకు ఏర్పాటు చేసిన పరికరాలు పని చేయకపోవడం. దీనిని తీవ్రంగా పరిగణించిన కమిషనర్, షోరూమ్‌ను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు పవర్ కట్ చేయగా, ఇది 'ఫైర్ అన్ సేఫ్' షాపు అని బోర్డులు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

**నాంపల్లిలో ఫర్నీచర్ షోరూమ్ మూసివేత**
గత శనివారం నాంపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు మరణించినా, అక్కడి వ్యాపారుల్లో మార్పు రాకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులోని స్టాండర్డ్ ఫర్నీచర్ దుకాణంలో తనిఖీలు జరిపారు. 6 అంతస్తుల భవనం నిండా, చివరికి మెట్ల మార్గంలో కూడా ఫర్నీచర్ నింపేయడం గుర్తించారు. ప్రమాదం జరిగితే బయటకు వచ్చే దారి కూడా లేని విధంగా స్టాక్ ఉండటంపై అధికారులు సీరియస్ అయ్యారు. ఎక్కడా ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడంతో ఆ భవనాన్ని వెంటనే సీజ్ చేసి, విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

**ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు : కమిషనర్ రంగనాథ్**
నగరంలో ఎక్కడైనా ఫైర్ నిబంధనలు ఉల్లంఘించినా, సెల్లార్లను గోదాములుగా మార్చినా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు. హైడ్రా కంట్రోల్ రూమ్ : 9000113667, కమిషనర్ వాట్సాప్ నెంబర్ : 7207923085 సమాచారం ఇవ్వాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారి వివరాలను ఫోటోలు లేదా వీడియోల రూపంలో వాట్సాప్ ద్వారా కానీ, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కానీ పంపాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో హైడ్రా అధికారులతో పాటు జిహెచ్‌ఎంసి, ఫైర్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజలకు పారదర్శక సేవలు

సిఎస్ రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజలకు సకాలంలో పారదర్శకతతో కూడిన వేగవంతమైన సేవలను అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ , ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఇంధన శాఖపై సమీక్షించిన సిఎస్ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి వరంగల్, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాలలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్య శాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్‌ఎస్ పథకం, వైద్య పరికరాల సరఫరా తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, నవీన్ మిట్టల్, మైన్స్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, హెచ్ యం.డి.ఎ. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, టిజి ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, టిజి ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఎండి ఈవీ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఎం.డి. ఆశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండర్ నోటీసు నెం. 05 నుండి 06 DRM_W_HYB_26 తేది: 28/01/2026 PUB/1837

భారత రాష్ట్రపతి తరపున, డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం 23/02/2026వ తేదీ మధ్యాహ్నం 03.00 గంటల వరకు బహిరంగ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం.:** 05_DRM_W_HYB_26 **పని పేరు:** హైదరాబాద్ డివిజన్ - ZRTI - గోదావరి హాస్టల్ - దెబ్బతిన్న స్తంభాలు, గోడల ప్లాస్టర్, లీకవుతున్న పైకప్పు, తలుపులు, కిటికీలు మరియు మరుగుదొడ్లకు మెరుగుదలలు. **సుమారు విలువ (రూ.):** 3,43,82,429 **ఈఎండి (రూ.):** 3,21,900

**టెండర్ నెం.:** 06_DRM_W_HYB_26 **పని పేరు:** MUE-SC సెక్షన్: ADEN/NZB సబ్ డివిజన్: SSE/PW/UMRI మరియు SSE/PW/NZB సెక్షన్ కోసం భారతీయ రైల్వేలలో యార్డ్ మెరుగుదలలు మరియు ఉన్నతీకరణ పనులు. **సుమారు విలువ (రూ.):** 6,63,28,520 **ఈఎండి (రూ.):** 4,81,700

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

డివిజనల్ రైల్వే మేనేజర్/ వర్క్స్/హైదరాబాద్

టెండర్ నోటీసు నెం: G/E.29/Tr./ టెండర్ నోటీసు/47/2025-26 PUB/1839

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ట్రాక్షన్/గుంతకల్ వారు భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశాల మేరకు కింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం.:** GTL-TRD-29-eTN-78- 2025-26 **పని పేరు:** గుంతకల్ డివిజన్‌లో భద్రత దృష్ట్యా ప్లాట్‌ఫారం లైవ్ OHE భాగాన్ని నివారించడానికి OHE అమరికలో మార్పులు. **సుమారు విలువ (రూ.):** 1,28,02,594/- **ఈఎండి (రూ.):** 2,14,000/-

**టెండర్ ముగింపు తేదీ & సమయం:** 19.02.2026 మధ్యాహ్నం 03.00 గంటలకు
**గమనిక:**
1. టెండర్ పత్రాలను టెండరదారులు www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్ దాఖలు చేయడానికి మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వండి. ఏవైనా సవరణలు ఉంటే, అవి కేవలం ఆన్‌లైన్‌లోనే జారీ చేయబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

నెం.Dy.CEE-GS-BZA-33-2025-26 తేది: 27.01.2026 PUB/1840

చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ, భారత రాష్ట్రపతి తరపున కింది పనుల కోసం ఓపెన్ టెండర్ / సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**క్ర.సం.:** 01 **టెండర్ నెం.:** BZA-GSU- Elec-33-2025-26 తేదీ.23.01.2026 **పని పేరు:** బిట్రగుంట (BTTR) వద్ద CC రేక్ నిర్వహణ కోసం గూడ్స్ రైళ్ల తనిఖీ సౌకర్యాల అభివృద్ధికి విద్యుత్ సరఫరా ఏర్పాట్ల కల్పన. **టెండర్ విలువ (రూ.):** 70,86,461.33 **ఈఎండి (రూ.):** 1,41,700/- **పూర్తి చేయు కాలం:** 09 నెలలు **టెండర్ ఫారం ధర (రూ.):** ఏమీ లేదు **ముగింపు తేదీ & సమయం:** 19.02.2026 మధ్యాహ్నం 03.00 గంటలకు

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి https://www.ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.
2. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లింపును IREPSలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న నెట్ బ్యాంకింగ్ చెల్లింపు గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చెల్లించాలి (లేదా) బిడ్ సెక్యూరిటీకి సంబంధించి బ్యాంక్ గ్యారెంటీని FA&CAO/Con/S.C.Railway, సికింద్రాబాద్ వారికి అనుకూలంగా మాన్యువల్‌గా సమర్పించవచ్చు.
3. టెండరర్లు టెండర్ ముగింపు తేదీకి పదిహేను రోజుల ముందు ప్రారంభమయ్యే టెండర్ సమర్పణ / బిడ్డింగ్ కాలంలో తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
4. టెండరర్లు టెండర్ సమర్పణ/బిడ్డింగ్ కాలం ప్రారంభమయ్యే తేదీ వరకు జారీ చేయబడిన ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.

A2328 చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతి శక్తి, విజయవాడ

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

## గాలి నాణ్యత ప్రజారోగ్య సూచీ



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదని, అది ప్రజారోగ్య సూచీతో పాటు ఉత్పాదకత, ఆర్థిక సూచీ కూడా అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ అంశంలో ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరించడం ద్వారా హైదరాబాద్ నగరం తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ మంత్రివర్గం ముందుకు వెళుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగం (ఎంసిఆర్‌డిహెచ్‌యు) లో గాలి నాణ్యత సూచీ, గాలి నాణ్యత నిర్వహణ అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు యొక్క స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు. నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగిందని, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు. సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు,అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. 2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు. అధిక రక్తపోటు తర్వాత నేడు గాలి కాలుష్యం ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందన్నారు. ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోందని తెలిపారు. ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతున్నట్లు తేలిందన్నారు. వాయు కాలుష్యాన్ని నివారించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని వెల్లడించారు. ఇందులో భాగంగా 2024లో గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను రెట్టింపు చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశామని త ద్వారా రియల్‌టైమ్, విశ్వసనీయ డేటా అందుతుందని తెలిపారు.రెండవ అంశం ప్రణాళికలో భాగంగా 2025లో రాష్ట్ర గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళికను రూపొందించామన్నారు. వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి ప్రధాన కాలుష్య మూలాలను ఈ ప్రణాళిక పరిష్కరిస్తోంది. ఇది ఇప్పటికే అమలులో ఉందనీ తెలిపారు.మూడవ అంశంలో భాగంగా వాహనాల ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించడానికి ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు అందించడంతో పాటు ఈబస్సులు, మెట్రో విస్తరణ ద్వారా ప్రజా రవాణాను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ చేపట్టిన అనేక చర్యల ద్వారా ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణలు, శుభ్రమైన గాలితో ముందుకు సాగే తెలంగాణను నిర్మిద్దామని, అదే మన నిజమైన వారసత్వం అని ఉపముఖ్యమంత్రి తెలిపారు.



## జిహెచ్‌ఎంసి స్టాఫ్, వర్కర్స్ యూనియన్ క్యాలండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అనుబంధం 2026వ నూతన సంవత్సరపు క్యాలండర్‌ను ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మాలు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు అన్ని చట్టాలు అమలు చేయాలని, కార్మికులపై పనిభారం తగ్గించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రవికిషోర్ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీ శివ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి, బాలక్రిష్ణ, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, లడ్డు లాల్, అడిషనల్ సెక్రెటరీ కుమార్, అడిషనల్ అధ్యక్షులు జయ కిషోర్, కోశాధికారి మహేష్ కుమార్, సీనియర్ నాయకులు యం.డి.కాలే, పాల్గొన్నారు.

## స్కామ్‌లపై విచారణ అంతా డ్రామా : రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, స్కామ్‌ల విషయంలో బిఆర్‌ఎస్ ధోరణిలోనే సాగుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ అక్రమాలపై 100 రోజుల్లోనే విచారణ జరిపి కెసిఆర్ కుటుంబానికి జైలులో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తామని ప్రగల్భాలు పలికారని, కానీ రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క కీలక నేతను కూడా అరెస్ట్ చేయలేదని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో జరిగిన స్కామ్‌లపై ఇప్పటివరకు సమగ్ర విచారణ లేదన్నారు. ప్రభుత్వం మారింది తప్ప కమిషన్‌ల విధానం మారలేదన్నారు.



## కులగణనలో బిజెపి తీవ్ర కుట్ర

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కులగణనలో బిజెపి తీవ్రమైన కుట్రకు పాల్పడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జనగణనలో ఎస్‌సి,ఎస్‌టిలతో పాటు ఒబిసి,ఇబిసిలను కూడా ప్రత్యేకంగా లెక్కించాలని డిమాండ్ చేశారు. పోరాటం ద్వారానే ఒబిసి, బిసి, ఇబిసి కాలం వస్తుందని, పోరాటం చేయకపోతే మళ్లీ పదేళ్ల వరకు బిసిల లెక్కలు రావని సూచించారు. మున్సిపల్, జెడ్‌పిటిసి ఎన్నికల్లో కులగణనను ఒక ఏజెండాగా తీసుకురావాలన్నారు. హైదరాబాద్‌లోని ''జాతీయ జనగణనలో కులగణనసమగ్ర చర్చ'' అనే అంశంపైన గురువారం రౌండ్ టేబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కులగణనలో ఎస్‌సి,ఎస్‌టి కాలం పెట్టారని, కానీ ఒబిసి అని పెట్టకుండానే కులం పేరుతో కాలం మాత్రమే డాక్యుమెంట్‌లో పెట్టారన్నారు. కులగణన విషయంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ తమ వైఖరి ఏమిటో స్పష్టం చేయలేదని మండిపడ్డారు. కులగణన అంటే కులం కేటగిరీతో పాటు సబ్ కేటగిరీ కూడా ఉండాలని, అప్పుడే ప్రతి ఒక్క కులాన్ని గౌరవించినట్టుగా ఉంటుందన్నారు. ఎస్‌సి,ఎస్‌టిలకు రాజ్యాంగ రక్షణ ఉండటంతో వారికి అన్యాయం జరగడం లేదని, కానీ బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ దేశంలో 4 వేల కులాలు ఉన్నాయని, ఇతరులు అనే ఆప్షన్ పెడితే వారిని ఏ కులంగా భావించాలని ప్రశ్నించారు. అన్ని కులాలను కేంద్రం ఒకటే విధంగా పెడితే ఏ విధంగా లెక్క తేలుతుందన్నారు. కులగణన విషయంలో మైనార్టీలు భయపడుతున్నారని, వారు మతమైనప్పటికీ వారికి అందరూ అండగా ఉండాలన్నారు. సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్దన్ మాట్లాడుతూ 90 ఏళ్ల తర్వాత కూడా బిసి కులగణన జరగకపోవటం బాధాకరమన్నారు. కులగణనలో ఇచ్చిన 33 అంశాల్లో ఇతరులు అనే కాలమ్ ప్రమాదకరంగా ఉందన్నారు. పిఒడబ్ల్యు నాయకురాలు సంధ్య మాట్లాడుతూ నిర్ణయాధికారంలో సమభాగం అనే నినాదాన్ని తొక్కివేశారని, మహిళ రిజర్వేషన్ల కోసం చర్చ జరిగితే, ఆ బిల్లును బిసి నాయకులే చించేశారన్నారు. నిష్పాక్షిక ధోరణితో ఒక సామాజిక లక్ష్యంతో పోరాటం చేయాలని సూచించారు. మైనార్టీ నాయకుడు మహ్మద్ మునవార్ అలీ మాట్లాడుతూ దేశంలో ముస్లింలకు రక్షణ లేకుండా పోయిందని, ఎన్‌ఆర్‌సి, సిఐఎ పేరుతో తరుచూ ముస్లింలను ఇబ్బంది పెడుతున్నారని, అందుకే కులగణన పేరు చెబితేనే తమకు భయం వేస్తోందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ లోక్ సత్తా పార్టీ అధ్యక్షులు మన్నారం నాగరాజు, అఖిల భారత ఆరె కటిక సంఘం సౌత్ ఇండియా కన్వీనర్ మురారికార్ ప్రశాంత్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్,మహిళా నాయకురాలు అనురాధా గౌడ్, సోమ శైలజాగౌడ్, పోటీ పరీక్షల నిపుణులు అశోక్ , తెలంగాణ స్టూడెంట్ జెఎసి నాయకుడు డాక్టర్ కుమార స్వామి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు ప్రసంగించారు.

## జనాభా దామాషా పద్ధతిలో బిసిలకు టికెట్లు ఇవ్వాల్సిందే

జాజుల శ్రీనివాస్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు జనాభా దామాషా ప్రకారం 56 శాతం టికెట్లు కేటాయించాలని, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని బిసి నేతల బృందం భేటీ అయ్యి, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వారికి అందజేశారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున, తక్షణమే రాహుల్ గాంధీ నినాదం, విధానమైన ఎవరి జనాభా ఎంత ఉందో? వారికి అంతే వాటా దక్కాలని చెప్పిన సూత్రాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని ఆయన కోరారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల కంటే మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు 32 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయని, అయినప్పటికీ బిసిలకు రాజకీయ అవకాశాలు పెంచడానికి పార్టీ పరంగా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామని, పార్టీలో చర్చించి బిసిలకు రాజకీయంగా న్యాయం జరిగే విధంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ భేటిలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కో చైర్మన్ వీరస్వామి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రం గౌడ్, డాక్టర్ రమేష్, మాదేశి రాజేందర్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, సోమాచారి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తి నింపిన ఐద్వా మహాసభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐద్వా 14వ మహాసభల స్ఫూర్తితో భవిష్యత్ ఉద్యమాలు చేపడుతామని నాయకులు అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, సీనియర్ నాయకులు టి.జ్యోతి, అరుణ, ఆశలత మాట్లాడారు. ఐద్వా మహాసభలు విజయవంతం అయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మహాసభల విజయవంతానికి 23 కమిటీలు ఏర్పాటు చేశామని, గత ఐదు నెలలుగా ఈ కమిటీలు ఇంటింటికి తిరిగి విజయవంతానికి కృషి చేశాయన్నారు. మహాసభల్లో జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రంలో మహిళలు ఎదుర్కుంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారమని తెలిపారు. సమస్యలపై ఎదు కమిషన్‌లు ఏర్పాటు చేసి, గ్రూపులుగా చర్చించామని చెప్పారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో పాటు సమ్రాజ్య వాదంపై సమగ్రంగా చర్చలు జరిగాయన్నారు. మహిళలు ఎదుర్కుంటున్న సమస్యలపై అందరం ఐక్యంగా ఉద్యమించేందుకు మహాసభలు స్ఫూర్తి నింపాయని చెప్పారు.

## రచయిత ఆచార్య చందు సుబ్బారావు మృతి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మార్క్సిస్ట్ రచయిత, అభ్యుదయ రచయితల సంఘంలో ప్రముఖులు ఆచార్య చందు సుబ్బారావు (80) గురువారం ఉదయం అనారోగ్యంతో విశాఖపట్నంలో తుది శ్వాస విడిచారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, భూభౌతిక శాస్త్రవేత్తగా, మార్క్సిస్ట్ రచయితగా, అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీల సభ్యులుగా చాలాకాలం పాటు పనిచేశారు. అభ్యుదయ వాదులందరికీ చిరపరిచితులే. అలాంటి రచయిత మరణం అభ్యుదయ, తెలుగు సాహిత్య సమాజానికి, నవచేతన పబ్లిషింగ్ హౌస్‌కు తీరని లోటని, వీరి మృతికి నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంతాపం తెలిపింది. సంపాదకులు ఏటుకూరి ప్రసాద్, జనరల్ మేనేజర్ మధుకర్, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి నారాయణ రెడ్డి, ఆరసం సభ్యులు చందు సుబ్బారావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## జనాభా ప్రకారం వైశ్యులకు సీట్లివ్వాలి : కాచం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** అన్ని రాజకీయ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం వైశ్యులకు సీట్లివ్వాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త కోరారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక నేతలు కొత్త రవి, దయాకర్, బుద్ధ ప్రవీణ్, ఆంజనేయులు, మురళి,రమేశ్, శ్రీనివాస్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో బిజెపి, జనసమితి, జాగృతి వాళ్లు హామీనిచ్చారన్నారు. వైశ్యులకు సీట్లివ్వని పార్టీలను ఓడగొడతామని స్పష్టంచేశారు.

## ఉపకారం కాదు.. అవసరం

### సాగుకు మద్దతుపై సిపిఐ ఎంపి సందోష్ కుమార్



**న్యూఢిల్లీ:** రబ్బర్, టీ, కాఫీ సాగుచేసే రైతాంగం సంక్షోభంలో చిక్కుకుపోవడంపై సిపిఐ ఎంపి పి.సందోష్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేరళలో వాణిజ్య పంటల సాగు నష్టాల్లో ఉన్నట్లు తెలిపారు. తక్షణమే జోక్యం చేసుకొని, సమున్నత మద్దతు అందించడం ఆవశ్యకమని కేంద్రానికి సూచించారు. సందోష్ కుమార్ గురువారం రాజ్యసభలో మాట్లాడుతూ ప్లాంటేషన్ రంగం పరిస్థితిని వివరించారు. తక్షణమే జోక్యం చేసుకోవడం అంటే ఉపకారం చేసినట్లు కాదని, ఇది అవసరమైన చర్య అని సందోష్ కుమార్ స్పష్టం చేశారు. 'ఈ రంగం కనీస లాభాలతో మనుగడ సాగిస్తోంది. పెరుగుతున్న సాగు వ్యయంతో ఇబ్బంది పడుతోంది. నేలలో సారం క్రమంగా తగ్గిపోవడం కూడా సమస్యగా మారింది' అని సిపిఐ ఎంపి అన్నారు. భారత్‌లో సాగుకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను విమర్శించారు. వాటి వల్ల వాణిజ్య పంటల సాగు దెబ్బతింటోందని, వ్యవసాయాధారిత ఆదాయం ప్రభావితమవుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తెచ్చిన విధానాలతో రైతులు, పంటల సాగు బలహీనం కాగా, ప్రస్తుత బిజెపి పాలన ఆ పరిస్థితి మరింత క్షీణింప చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో రైతన్నకు సాగు భారంగా మారుతోందని సందోష్ కుమార్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణలో పెరిగిన సాగు విస్తీర్ణం

### ఏపిలో తగ్గుతున్న ద్రవ్యోల్బణం
### ఆర్థిక సర్వే వెల్లడి



**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో తెలుగు రాష్ట్రాల్లోని అభివృద్ధి అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన పలు విషయాలను ఆర్థిక సర్వే వివరించింది. ఏపిలో పెటా ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోందని తెలిపింది. తెలంగాణలో సాగుకు యోగ్యమైన భూ విస్తీర్ణం పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగు విస్తీర్ణం మెరుగుపడినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ద్రవ్యోల్బణం 2022–23లో 7.57 శాతం ఉంటే... 2025–26 నాటికి 1.39 శాతానికి తగ్గిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. తెలంగాణలో 8.61 శాతం నుంచి 0.20 శాతానికి దిగివచ్చిందని తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సగటు ద్రవ్యోల్బణం 1.72 శాతం కంటే తక్కువగా నమోదైనట్లు వివరించింది. అకాల వర్షాలు, ప్రకృతి ప్రకోపాల కారణంగా వ్యవసాయ దిగుబడి తగ్గిందని పేర్కొంది. కొత్త నగరాల విస్తరణ, అభివృద్ధి వ్యవహారాల్లో ఏపి రాజధాని అమరావతి గురించి ప్రస్తావించింది. అమరావతి హరిత నగర నిర్మాణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నగర నిర్మాణంలో అరుదైన అవకాశాలు అమరావతికి లభించాయని తెలిపింది. వాణిజ్య సంస్థలకు కార్యాచరణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, దీని కారణంగా రాష్ట్రంలో వ్యాపార వాతావరణం మెరుగుపడుతోందని అభిప్రాయపడింది. సింగిల్ విండో ద్వారా పారిశ్రామిక అనుమతుల మంజూరు చేయడాన్ని ఆర్థిక సర్వే ప్రస్తావించింది. రాష్ట్రంలో 6,900 గ్రామాల్లో 81 లక్షల భూకమతాల రీ సర్వే, 86 వేల సరిహద్దు వివాదాలు పరిష్కారమయ్యాయని వివరించింది. ఏపిలో ప్రపంచ స్థాయి బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. పంజాబ్, ఏపి, గుజరాత్‌ల విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని సర్వే వెల్లడించింది. దేశంలో జీవన యోగ్య నగరాల్లో టాప్ 10లో విజయవాడ, తిరుపతి నిలిచినట్లు తెలిపింది. ఇక తెలంగాణలో సాగుకు యోగ్యమైన భూ విస్తీర్ణం 2014–23 మధ్య 1.31 కోట్ల ఎకరాలు ఉండగా, అది 2.21 కోట్లకు పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటా నమోదు చేసినట్లు పేర్కొంది. ఏఐ స్టార్టప్‌ల్లో తెలంగాణ వాటా 7 శాతం కాగా... 30 శాతంతో కర్నాటక అగ్రస్థానంలో నిలిచింది. ఐటీ, ఫైనాన్స్, ప్రొఫెషనల్ సర్వీసుల్లో కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల వాటా 40 శాతంగా ఉంది. భూ భారతి పోర్టల్ ద్వారా రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల విభాగాలను తెలంగాణ ఏకీకృతం చేసింది. దేశీయ పట్టణ జనాభాలో ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ఉన్నట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ నాలుగో స్థానం, విజయవాడ 10వ స్థానంలో నిలిచాయి. 2035 నాటికి హైదరాబాద్ జిడిపి 201.4 బిలియన్ డాలర్లు, విజయవాడ 21.3 బిలియన్ డాలర్ల స్థాయికి పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.

## మోడీది కపటత్వంతో నిండిన సందేశం

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విమర్శ

**న్యూఢిల్లీ:** బడ్జెట్ సమావేశాలపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. ప్రతి సమావేశం ప్రారంభానికి ముందు ఆయన సాధారణ కపటత్వంతో నిండిన సందేశాన్ని దేశానికి అందజేస్తారని, ప్రస్తుత పని తీరు కూడా ఆ శ్రేణికి భాగమేనని మండిపడింది. 'జాతీయ సమస్యలపై ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవడానికి ఆయన (ప్రధాని) అంగీకరించరు. అభిలపక్ష సమావేశాలకు అధ్యక్షత వహించరు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జ్ జైరాం రమేష్ పేర్కొన్నారు. చివరి నిమిషంలో అకస్మాత్తుగా బిల్లులను ప్రవేశపెట్టి, అవసరమైన శాసనసభ పరిశీలన లేకుండా పార్లమెంటు ద్వారా బుల్డోజర్ చేయిస్తారని, మోడీ పార్లమెంటులో కూర్చుని ప్రతిపక్ష నాయకుల ఆందోళనలకు స్పందించరని, బదులుగా ఉభయ సభల్లో ఎన్నికల ర్యాలీ ప్రసంగాలు చేస్తారని రమేష్ పేర్కొన్నారు. ప్రతి సమావేశం ప్రారంభానికి ముందు, పార్లమెంటు నేపథ్యంలో ఆయన తన సాధారణ కపటత్వంతో నిండిన 'దేశ్ కే నామ్ సందేశ్' చేస్తారని ధ్వజమెత్తారు.

## పార్లమెంటరీ విలువలు పాటించండి

### రాజ్యసభ సభ్యులకు చైర్మన్ రాధాకృష్ణన్ పిలుపు




**న్యూఢిల్లీ:** సభ్యులు సభా మర్యాద పాటించాలని, సభలో ప్రయోజనాత్మకమైన చర్చలు జరపాలని బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ పిలుపు ఇచ్చారు.ఎగువసభ 217వ సమావేశం సందర్భంగా గురువారం ఉదయం ఆయన సభలో తొలి ప్రసంగం చేస్తూ, 2026–27 బడ్జెట్ సమావేశాల చర్చలను ఫలప్రదం చేసేందుకు, ఇతర కీలకమైన శాసన ప్రతిపాదనలను ఆమోదించేందుకు వీలుగా సభ్యులు అత్యున్నతమైన ప్రామాణిక పార్లమెంటరీ విలువలను, మర్యాదను పాటించాలని కోరారు. పార్లమెంటరీ పార్టీల నాయకులు,సభ్యులు పూర్తి సహకారం అదించడం ద్వారా స్వయంసమృద్ధమైన, సంపద్వంతమైన, వికసిత్ భారత్ ప్రయాణంలో జరిగే ఈ చర్చలు అత్యంత ప్రయోజనాత్మకంగా, పటిష్టంగా, ఒక మైలురాయిగా ఉండేలా చేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య అత్యున్నత ప్రమాణాలను ప్రతిబింబించేలా ఈ బడ్జెట్ సమావేశాలను మనం దరం కలిసి విజయవంతం చేద్దామని కోరారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధానదేశంగా ముందుపిఠిన నిలబడి ఉందని, ప్రపంచ మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ప్రయాణిస్తోందని అన్నారు. ''భారతదేశ ప్రభావం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశ ఉన్నతి,స్థాయీ రోజు రోజుకూ పెరుగుతోంది, ఈ పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్ది దిశా నిర్దేశం చేయడంలో అత్యున్నతమైన చట్టసభ సభ్యులుగా మనం కీలకపాత్ర పోషించాలి'' అని రాధాకృష్ణన్ కోరారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో రాజ్యసభ 30 సార్లు సమావేశమవుతుంది. కేంద్ర బడ్జెట్ పరిశీలనపైన, ప్రతిపాదిత శాసన తీర్మానాలపైన ప్రధానంగా దృష్టి సారిస్తుంది. శాఖాపరంగా పార్లమెంటరీ స్థాయీ సంఘాలు కూడా విరామ సమయంలో గ్రాంట్స్‌కు సంబంధించిన డిమాండ్లను పరిశీలన చేస్తాయి. ''ఎగువసభపై తమదైన ముద్రవేసేవిధంగా సభ్యులు చర్చల్లో పాల్గొనాలి, అదేవిధంగా సభా కమిటీలలో కూడా తమ ప్రభావాన్ని చూపించాలి'' అని కోరారు. రాబోయేరోజుల్లో తక్కువ సమయంలో భారీ ఎత్తున శాసనపరమైన విధులు నిర్వర్తించాల్సి ఉందని ఆయన పదే పదే గట్టిగా చెబుతూ ప్రతి సభ్యుడూ బాధ్యతగా మెలగాలని కోరారు. చట్టసభలో క్రమశిక్షణను ప్రతి సభ్యుడూ పాటించాలని కోరారు. ''భిన్నాభిప్రాయాల ద్వారా, స్ఫూర్తిమంతమైన చర్చల ద్వారా మన ప్రజాస్వామ్యం వికసిస్తోంది, పరస్పర గౌరవంతో కూడిన నిర్మాణాత్మకమైన చర్చలు, సంభాషణలు పార్లమెంటు వేదికపై జరగాలి, ఈ సభను మర్యాదతో, క్రమశిక్షణతో,గౌరవంతో నిర్వహిద్దాం'' అని కోరారు. మహాత్మాగాంధీ స్ఫూర్తిని ఆయన స్మరిస్తూ, సభ్యులు తమ ప్రవర్తన ద్వారా ప్రజాస్వామ్య విలువలను, సభా క్రమశిక్షణను కాపాడాలని కోరారు.

### వీధి కుక్కల కేసులో మునుపటి ఆదేశాల సవరణ పిటిషన్లపై...

# సుప్రీంకోర్టు 'తీర్పు రిజర్వ్'


### విచ్చలవిడి జంతువుల తొలగింపు ఆదేశాలను పాటించరా? అని అథారిటీపై సీరియస్



**న్యూఢిల్లీ :** వీధి కుక్కల కేసులో గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం సుప్రింకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. పంజాబ్, తమిళ్‌నాడు, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు తీసుకున్న చర్యలను సంగ్రహించిన అమికస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహ్‌తా, ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. 2027 నవంబర్ 7 నాటి ఆదేశాన్ని పాటించే విషయమై ఎన్‌హెచ్‌ఎఐ తరపు న్యాయవాది వాదనలను ధర్మాసనం విన్నది. జాతీయ రహదారి, ఫెన్సింగ్ రోడ్ల నుండి విచ్చలవిడిగా సంచరించే జంతువులను తొలగించాలని 2025 నవంబరు 7న ఇచ్చిన తన ఆదేశాన్ని అధికార యంత్రాంగం పాటించడానికి సంబంధించి నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) తరపున హాజరైన న్యాయవాది వాదనలను సుప్రింకోర్టు త్రిసభ్య ధర్మాసనం విన్నది. జంతు సంరక్షణ లేదా జంతు జనన నియంత్రణ సౌకర్యాలకు అనుమతిని కోరుతూ ఎన్‌జిఓలు దాఖలు చేసిన దరఖాస్తులను ప్రాసెస్ చేయాలని భారత జంతు సంక్షేమ బోర్డ్ (ఎడబ్ల్యుబిఐ)ని అత్యున్నత న్యాయస్థానం కోరింది. 'మీరు దరఖాస్తులను అంగీకరించవచ్చు, లేదా తిరస్కరించవచ్చు కానీ దానిని త్వరగా చేయండి' అని ఎడబ్ల్యుబిఐ తరపు న్యాయవాదికి ధర్మాసనం తెలిపింది. నవంబరు 7న కోర్టు ఉత్తర్వుల తర్వాత , వివిధ సంస్థల నుండి ఇటువంటి దరఖాస్తులు పెరిగాయని ఆయన ఎత్తిచూపారు. ఈ విషయంలో వీలైనంత త్వరగా పార్టీలు తమ లిఖిత పూర్వక వాదనలను దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం కోరింది. బుధవారం సుప్రింకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వీధి కుక్కల స్టెరిలైజేషన్ సామర్థ్యాన్ని పెంచుకోవాలనే ఆదేశాలు పాటించకపోవడంపై తన ఆందోళనను వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం 'వాళ్లందరూ గాలిలో కోటలు కడుతున్నారు' అని పేర్కొంది. సంస్థాగత ప్రాంతాలు, రోడ్ల నుండి విచ్చల విడి జంతువులను తొలగించాలని 2025 నవంబరు 7న ఇచ్చిన తన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన అనేక పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది. జనవరి 13న కుక్కకాటు సంఘటనలకు భారీ పరిహారం చెల్లించాలని, అలాంటి కేసులకు కుక్కలను పోషించే వారిని జవాబుదారీగా ఉంచాలని రాష్ట్రాలను కోరనున్నట్లు సుప్రింకోర్టు తెలిపింది. గత 5 సంవత్సరాలుగా విచ్చలవిడి జంతువులపై నిబంధనలు అమలు చేయకపోవడంపై అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పట్టుకున్న వీధి కుక్కలను వాటి అసలు ప్రదేశాలకు వదల కూడదని ధర్మాసనం సూచించింది. వీధికుక్కల కాటు వల్ల రేబిస్ వ్యాధి ముఖ్యంగా పిల్లలలో వస్తున్నదని మీడియాలో ప్రసారమైన ప్రత్యేక వార్తా కథనాలపై గత ఏడాది జులై 28న సుప్రింకోర్టు సుమోటో కేసు కింద పిటిషన్ల విచారణ చేపట్టిన విషయం తెలిసిందే.

## రాహుల్, ఖర్గేలతో భేటీ సక్సెస్

### 'మేమంతా ఒక్కటే' అంటూ క్లారిటీ ఇచ్చిన శశి థరూర్



**న్యూఢిల్లీ :** గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, ముఖ్యంగా అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై అసంతృప్తితో ఉన్నారనే వార్తల మధ్య సీనియర్ నేత, ఎంపి శశి థరూర్ ఎట్టకేలకు స్పందించారు. గురువారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో అత్యంత కీలకమైన సమావేశం నిర్వహించారు. భేటీ అనంతరం బయటకు వచ్చిన థరూర్ 'అంతా బాగుంది. పార్టీ నాయకత్వంతో నాకు ఎలాంటి విభేదాలు లేవు. మేమంతా ఒకే మాటపై ఉన్నాం. కలిసి ముందుకు సాగుతాం' అని ప్రకటించారు. ఈ కీలక సమావేశం పార్లమెంట్ భవన సముదాయంలోని మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో జరిగింది. సుమారు గంటకు పైగా ఈ భేటీ కొనసాగింది. ఇందులో రాహుల్, ఖర్గేలతో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. తమ మధ్య ఉన్న మనస్పర్థలు, కేరళ రాజకీయాలు, పార్టీ వ్యూహాలపై వారు కూలంకషంగా చర్చించారు. 'మా ఇద్దరు అగ్రనేతలతో (ఖర్గే, రాహుల్) చర్చలు జరిపాను. సమావేశం చాలా నిర్మాణాత్మకంగా, సానుకూలంగా జరిగింది' అని థరూర్ మీడియాకు వెల్లడించారు. త్వరలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై చర్చ జరిగిందా? అని విలేకరులు ప్రశ్నించగా, థరూర్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. 'ఆ విషయం అసలు చర్చకు రాలేదు. సిఎం రేసులో ఉండటానికి, అభ్యర్థిగా ఉండటానికి నాకు ఆసక్తి లేదు. ప్రస్తుతం నేను తిరువనంతపురం ఎంపిగా ఉన్నాను. అక్కడి ఓటర్ల విశ్వాసం నాపై ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను కాపాడటమే నా బాధ్యత. నా పని నేను చేసుకుంటాను' అని ఆయన క్లారిటీ ఇచ్చారు. అధిష్టానంతో జరిగిన భేటీ పట్ల తాను పూర్తి సంతృప్తితో ఉన్నట్లు తెలిపారు.

## సరిహద్దు అక్రమ రవాణా ప్రయత్నాలు

### అధునాతన పిస్టల్స్, 2 కిలోల హెరాయిన్ స్వాధీనం

**చండీగఢ్:** పంజాబ్ పోలీసులు, బిఎస్‌ఎఫ్‌తో సమన్వయంతో, ఫజిల్కా జిల్లాలోని సరిహద్దు అవుట్‌పోస్ట్ సమీపంలో ఒక పెద్ద సరిహద్దు అక్రమ రవాణా ప్రయత్నాన్ని భగ్నం చేసి, పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారని గురువారం ఒక ఉన్నత పోలీసు అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో 2.1 కిలోల హెరాయిన్, 21 అధునాతన పిస్టల్స్‌తో పాటు మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు డైరెక్టర్ జనరల్ (డిజిపి) గౌరవ్ యాదవ్ తెలిపారు. వీటిలో 11 గ్లోక్ పిస్టల్‌తో పాటు 22 మ్యాగజైన్లు, ఒక బారెట్టా పిస్టల్‌తో పాటు ఒక మ్యాగజైన్, ఐదు జిగానా పిస్టల్స్‌తో పాటు 10 మ్యాగజైన్లు, మూడు నోరింకో పిస్టల్స్‌తో పాటు ఐదు మ్యాగజైన్లు, ఒక గఫర్ సెక్యూరిటీ పిస్టల్ (ఎపి5 రకం), 310 లైవ్ కార్ట్రిడ్జ్‌లు (9ఎంఎం) ఉన్నాయని డిజిపి తెలిపారు. పాకిస్తాన్‌కు చెందిన స్మగ్లర్లు రాత్రి పరిస్థితులు, దట్టమైన పొగమంచును ఆసరాగా చేసుకుని భారత భూభాగంలోకి ఆయుధాలు, మాదకద్రవ్యాలను రవాణా చేయడానికి జీరో లైన్‌ను దాటినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అయితే, అప్రమత్తమైన సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) దళాలు ఉల్లంఘనను నిరోధించడానికి అనేక రౌండ్ల కాల్పులు జరిపాయి, తరువాత ఉమ్మడి శోధన ఆపరేషన్ నిర్వహించి స్వాధీనం చేసుకున్నాయని డిజిపి తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా, బిఎస్‌ఎఫ్ దళాలతో పాటు పోలీసు బృందాలు వ్యక్తిగత భద్రతా అధికారి ఇన్ కమాండ్ సుమిత్ కపూర్, పైలట్ సెకండ్ ఇన్ కమాండ్ శాంభవి పాఠక్ ఉన్నారు. అందరూ ప్రాణాలు కోల్పోయారు. ఫాజిల్కాలోని తేజా రుహేలా గ్రామంలో పాకిస్తాన్ స్మగ్లర్లు మాదకద్రవ్యాలు, ఆయుధాలను భారత భూభాగంలోకి రవాణా చేయడానికి చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టడానికి సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయని కౌంటర్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ గుర్సేవాక్ సింగ్ బ్రార్ తెలిపారు. మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించడానికి మరింత దర్యాప్తు జరుగుతోందని ఆయన చెప్పారు. ఫాజిల్కాలోని ఒక పోలీస్ స్టేషన్‌లో నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం, ఆయుధ చట్టంలోని సంబంధిత విభాగాల కింద కేసు నమోదు చేయబడింది.


## ప్రపంచానికి భారత్ ఆశాకిరణంగా ఎదుగుతోంది

### ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ :** ప్రపంచానికి భారత్ 'ఆశాకిరణం'గా ఎదుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ ప్రతిష్టాత్మక భారత్ కోసం ఒప్పందం కుదుర్చుకున్నామని, తయారీదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో మీడియాతో ప్రసంగించిన మోదీ, భారతదేశం రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో వేగంగా ముందుకు సాగుతోందని, సంస్కరణల ఆవిష్కరణకు తమ సానుకూల శక్తులను అందించినందుకు పార్లమెంటు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విమర్శకులు కూడా చివరి మైలు వరకు డెలివరీపై ప్రభుత్వం దృష్టి సారించడాన్ని గుర్తించారని, ఈ సంప్రదాయం తదుపరి తరం సంస్కరణలతో కొనసాగుతుందని మోదీ అన్నారు. భారత ప్రజాస్వామ్యం, జనాభా, ప్రపంచానికి గొప్ప ఆశను అందిస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రజాస్వామ్య దేవాలయంలో, భారతదేశం బలం, ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత, ప్రజాస్వామ్య ప్రక్రియల ద్వారా తీసుకున్న నిర్ణయాలకు గౌరవం అనే సందేశాన్ని పంపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత సమయం అంతరాయం కోసం కాదని, పరిష్కారాల కోసం, అడ్డంకుల కోసం కాదు, పరిష్కారం కోసం అని మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దపు తొలి త్రైమాసికం ముగింపు, తదుపరి త్రైమాసికం ప్రారంభానికి బడ్జెట్ సమావేశాలు నిదర్శనమని ప్రధాని అన్నారు. ఈ త్రైమాసికం ప్రారంభంలో భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) భారతదేశ యువత ఉజ్వల భవిష్యత్తును, రాబోయే ఆశాజనక దిశలను ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. 'ఈ ఒప్పందం ప్రతిష్టాత్మక భారతదేశానికి, ఆకాంక్షించే యువతకు, ఆత్మనిర్భర్ భారత్ (స్వావలంబన భారతదేశం) కోసం స్వేచ్ఛా వాణిజ్యం' అని ఆయన అన్నారు. భారత తయారీదారులు తమ సామర్థ్యాలను పెంచుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసించారు. అసంతృప్తి నుండి జాగ్రత్త వహించాలని, నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆయన పరిశ్రమ నాయకులు, తయారీదారులను కోరారు. ఉత్తమ నాణ్యత గల ఉత్పత్తులతో ఈ బహిరంగ మార్కెట్‌లోకి ప్రవేశించడం వల్ల 27 ఇయు దేశాలలోని కొనుగోలుదారుల నుండి లాభాలను ఆర్జించడమే కాకుండా, వారి హృదయాలను గెలుచుకుంటుందని, దశాబ్దాల పాటు దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టిస్తుందని ప్రధాన మంత్రి అన్నారు. దేశ బ్రాండ్‌తో అనుసంధానించబడిన కంపెనీల బ్రాండ్లు కొత్త ప్రతిష్టను ఏర్పరుస్తాయని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ మానవ కేంద్రీకృతంగా, దేశం సమగ్ర అభివృద్ధి కోసం దృష్టి సారించిందని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం సాంకేతికతతో పోటీ పడుతుందని, దానిని గ్రహిస్తుందని, దాని బలాలను అంగీకరిస్తుందని, ప్రభుత్వం మానవ కేంద్రీకృత వ్యవస్థలపై ఎప్పుడూ రాజీపడదని ఆయన అన్నారు.

## కోల్‌కతా అగ్నిప్రమాదం.. 21కి చేరిన మృతుల సంఖ్య



**కోల్‌కతా:** కోల్‌కతా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మోమో ఆహార పదార్థాల గోదాంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 21కి చేరుకుంది. మరో 28 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అక్కడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అలాగే రాజకీయ నాయకుల పర్యటన నేపథ్యంలో.. బుధవారం అర్ధరాత్రి నుంచి ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించామని పోలీసులు తెలిపారు. జనవరి 26(సోమవారం) గణతంత్ర దినోత్సవం వేళ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జరిగిన భారీ అగ్నిప్రమాదం ఘోర విషాదాన్ని మిగిల్చింది. సోమవారం ఉదయం 3 గంటలకు ఆనంద్‌పూర్ ప్రాంతంలోని రెండు ఆహార గోదాంలలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే గోదాం లోపల పొడి ఆహార పదార్థాలతో పాటూ మండే వస్తువులు అధికంగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. గంటల తరబడి ఫైర్ సిబ్బంది ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. చాలా సమయం తర్వాత అగ్నిమాపక సిబ్బంది అందులో చిక్కుకున్న వారి కోసం గాలింపులు చేపట్టగా తొలి రోజు 16 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. తాజాగా గురువారం మరో ఐదు మృతదేహాలను గుర్తించారు. దీంతో మృతుల సంఖ్య 21కి చేరింది. మిగతా వారి కోసం గాలింపు చేపడుతున్నారు. అయితే మృతదేహాలను గుర్తించడం కష్టంగా ఉన్నందున.. డీఎన్‌ఏ ఆధారంగా మృతదేహాల గుర్తింపు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇక ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు మోమో కంపెనీ రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. అంతేకాకుండా వారి కుటుంబాలకు ప్రతి నెలా ఆర్థిక సహాయం, వారి పిల్లల చదువు బాధ్యతలు భరిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

# అజిత్ పవార్ విమానం బ్లాక్ బాక్స్ లభ్యం

### వేగంగా దర్యాప్తు పూర్తి చేస్తాం కేంద్రం

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర డిప్యూటీ సిఎం అజిత్ పవార్ విమాన ప్రమాదంపై కేంద్ర పౌర విమానయాన శాఖ కీలక ప్రకటన చేసింది. బుధవారం ఉదయం బారామతిలో కూలిపోయిన లీయర్ జెట్45 మోడల్ విమానంలోని బ్లాక్ బాక్స్‌ను రికవర్ చేశామని వెల్లడించింది. ఈ దుర్ఘటనపై వేగంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపింది. ఈమేరకు ఎక్స్ వేదికగా పౌర విమానయాన శాఖ గురువారం ఒక ట్వీట్ చేసింది. సమగ్రంగా, పారదర్శకంగా, వేగంగా దర్యాప్తును పూర్తి చేసేందుకు టాప్ ప్రయారిటీని ఇస్తామని స్పష్టం చేసింది. ఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి)కు చెందిన ముగ్గురు అధికారుల టీమ్, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డిజిసిఎ) ముంబయి ప్రాంతీయ కార్యాలయానికి చెందిన మరో ముగ్గురు ఆఫీసర్ల టీమ్ జనవరి 28నే సంఘటనా స్థలాన్ని సందర్శించిందని వెల్లడించింది. లీయర్ జెట్45 విమానం బ్లాక్ బాక్స్‌ను ఆ నిపుణుల టీమ్ రికవర్ చేసిందని పేర్కొంది. 2025 ఏఏఐబీ మార్గదర్శకాల్లోని 5, 11 నిబంధనల ప్రకారం దర్యాప్తు చేస్తామని పౌర విమానయాన శాఖ తెలిపింది. విమాన ప్రమాదం వివరాలతో నిర్ణీత గడువులోగా సమగ్ర వివరాలతో దర్యాప్తు నివేదికను విడుదల చేస్తామని చెప్పింది.

**పైలట్ తప్పిదమే కారణం**

అజిత్ పవార్ విమాన ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు బందాలు శోధిస్తున్నాయి. ఈ క్రమంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బందం కీలక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. బుధవారం ప్రమాదం జరగగానే ఢిల్లీ నుంచి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని ఏఏఐబీ కీలక ఆధారాలు సేకరించింది. విమాన ప్రమాదానికి పైలట్ నిర్లక్ష్యమే కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. పైలట్ తప్పిదం కారణంగానే ఈ ఘోరం జరిగినట్లుగా అధికారులు అనుమానిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. పైలట్ రన్‌వేను తప్పుగా అంచనా వేయడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని తెలుస్తోంది. మొదటి ల్యాండింగ్‌కు కుదరనప్పుడు... రెండో ల్యాండింగ్‌కు సిద్ధపడుతున్న తరుణంలో పైలట్ పొరపాటు చేసినట్లుగా ప్రాథమిక పరిశోధనలో వెల్లడైనట్లుగా వర్గాలు చెబుతున్నాయి. ల్యాండింగ్ సమయంలో విజిబిలిటీ సరిగా లేదని, ఆ సమయంలో వెంటనే పూణెకు మళ్లించి ఉండవచ్చని దర్యాప్తు సంస్థ నివేదించింది. కానీ పైలట్ మాత్రం ఆ పని చేయనట్లుగా కనిపించింది. అయినా పైలట్ విమానాన్ని తిరిగి సమలేఖనం చేయడానికి ప్రయత్నించాడని, ఓ వైపు వేగం... ఇంకో వైపు ల్యాండింగ్‌కు ఆలస్యమైనట్లుగా కనిపించిందని ఆ వర్గాలు చెబుతున్నాయి. వీఐపీ విమానాలు, హెలికాప్టర్ కార్యకలాపాల్లో ఇది సర్వసాధారణంగా జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. సమయానికి ల్యాండ్ చేయడానికి ఒత్తిడి ఉన్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులు సూచిస్తున్నాయి. బుధవారం ఉదయం 8:10 గంటలకు ముంబై నుంచి బారామతికి విమానం బయల్దేరింది. బారామతి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కు సిద్ధపడుతున్న తరుణంలో కూలిపోయింది.

### అశ్రునయనాల మధ్య

## అజిత్ అంత్యక్రియలు



**బారామతి:** విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి . గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్‌కు అంతిమ సంస్కారాలు నిర్వహించారు కుటుంబసభ్యులు కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్ షిండే, తదితర రాజకీయ ప్రముఖులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. గురువారం ఉదయం అజిత్ పవార్ పార్థివదేహాన్ని బారామతిలోని అహల్యాదేవి ఆసుపత్రి నుంచి ఆయన స్వగ్రామం కాటేవాడికి తరలించారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో జెడి మాడ్గుల్కర్ ఆడిటోరియానికి అజిత్‌పవార్ భౌతికకాయాన్ని తరలించారు. అక్కడి నుంచి విద్యా ప్రతిష్ఠాన్ మైదానం వరకు అజిత్ పవార్ అంతిమ యాత్ర సాగింది. తమ అభిమాన నేత దాదాకు తుది వీడ్కోలు పలికేందుకు వేలాది మంది అంత్యక్రియలు జరిగే ప్రాంతానికి తరలివచ్చారు. మరఠ్వాడా నలుమూలల వచ్చిన ప్రజలతో విద్యా ప్రతిష్ఠాన్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.


**SHRIAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03EV 5447 | Raj Kumar Ambala | CHEVROLET TAVERA NEO-P | 2015 |
| 2 | TS03UD 4977 | Sumathi Namindla | TATA SIGNA 2830K BS6 FBT | 2023 |
| 3 | TS03UD 1394 | Narasimhulu Kadem | APE XTRA LDX + BS6 DIESEL | 2022 |
| 4 | TS32 T 3798 | Malothu Arun | AL 3718 FBT | 2019 |
| 5 | TS03UC 1553 | Saidhamma Thoutam | APE PICK UP XTRA LD | 2018 |
| 6 | TS03UD 0439 | Bixapathi Gorre | TATA SIGNA 2825 K BS6 FBT | 2022 |
| 7 | YC14B 1397 | Raja Rajeshwara Granites | KOBELCO SK380 XDLC | 2019 |
| 8 | TS36K 0142 | Ram Reddy Enugala | JOHN DEERE 5405 HARVESTER | 2021 |

**AUCTION DATE : 31-01-2026**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**

D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9666576664, 9959103322 & 9676049567

# 'స్పష్టత' లేని యుజిసి!

విశ్వవిద్యాలయాలు జ్ఞానార్జనకు మాత్రమే కాకుండా, సమానత్వం, న్యాయం, సహనశీలత వంటి ప్రజాస్వామ్య విలువలను ఆచరణలో నేర్పే ప్రదేశాలుగా భాసిల్లాలి. అందుకు భిన్నంగా ఉన్న నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. యుజిసి 2026 ఈక్విటీ రెగ్యులేషన్స్‌పై సుప్రీంకోర్టు స్టే విధించడం ప్రభుత్వానికిఒక హెచ్చరికగా నిలుస్తుంది. చట్టాలు, నిబంధనలు మంచి ఉద్దేశంతో రూపొందించినా, అవి స్పష్టంగా లేకపోతే లేదా విస్తృతంగా వర్తించకుండా పరిమిత వర్గాలకు మాత్రమే న్యాయం చేయాలని ప్రయత్నిస్తే, సమాజాన్ని మరింతగా విభజించే ప్రమాదం ఉందని కోర్టు చేసిన వ్యాఖ్య పాలకులకు ఒక గుణపాఠం. యుజిసి తీసుకొచ్చిన కొత్త నిబంధనలు క్యాంపస్‌లలో కుల వివక్షను నివారించాలనే ఉద్దేశంతో రూపొందించినవే. అయితే, ఆ నిబంధనల్లో కుల ఆధారిత వివక్షను కేవలం ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు మాత్రమే పరిమితం చేయడం అనుమానాలకు తావిస్తున్నది. సుప్రీం కోర్టు ముందు దాఖలైన పిటిషన్లు ఇదే అంశాన్ని కేంద్రంగా చేసుకున్నాయి.

కుల వివక్ష అనేది భారత సమాజంలో ఒకే దిశలో మాత్రమే జరగదని, కొన్ని సందర్భాల్లో సాధారణ వర్గాలకు చెందినవారు కూడా తమ కుల గుర్తింపుల ఆధారంగా వేధింపులకు గురవుతారన్నది పిటిషనర్ల వాదన. యుజిసి నిబంధనల్లో ఉపయోగించిన భాష నాసిరకంగా ఉందని, విషయంపై స్పష్టత లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం, లోపం ఎక్కడ ఉందో చెప్పకనే చెప్తున్నది. స్పష్టత లేని చట్టాలు.. నిబంధనలు దుర్వినియోగానికి ఆస్కారం ఉంది. 'ఒక పదం' లేదా 'నిర్వచనం' ఒక్కోసారి తీవ్రమైన సామాజిక ప్రభావాన్ని చూపుతుంది. ఒక వర్గానికి మాత్రమే రక్షణ కల్పించే విధంగా నిబంధనలు ఉంటే, మిగతా వర్గాల విద్యార్థులు తమ సమస్యలను ఎక్కడ, ఎలా చెప్పుకోవాలి? సుప్రీంకోర్టు జోక్యంతో ఇప్పుడు ఈ ప్రశ్నలు అధికారికంగా చర్చకు వచ్చాయి. కుల వివక్ష వంటి సున్నితమైన అంశాలను చట్టబద్ధంగా పరిష్కరించేటప్పుడు సమతుల్యత అవసరం. ఒక వర్గానికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని గుర్తించడం అవసరమే కానీ, ఆ పేరుతో కొత్తరకమైన అసమానతలు సృష్టించకూడదు. దీనివల్ల సమాజ విభజన జరిగే ప్రమాదం ఉంది. క్యాంపస్‌లు రాజకీయ, సామాజిక ఉద్రిక్తతలకు కేంద్రాలుగా మారితే, విద్యా నాణ్యత దెబ్బతింటుంది. యుజిసి 2012 నిబంధనల్లో సలహాలకు అత్యధిక ప్రాధాన్యం ఉండగా, తాజా నిబంధనలు, సలహాలను తప్పనిసరి చేస్తున్నాయి. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో ఈక్విటీ కమిటీల ఏర్పాటు, అందులో వివిధ వర్గాల ప్రాతినిధ్యం ఉండాలనే ఆదేశాలు మొదటి చూపులో ప్రగతిశీలంగా కనిపిస్తాయి. కానీ, వాటి అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలను గమనించాలి. నిబంధనలలో వాడిన భాషలో స్పష్టత లేకపోతే, చిన్న చిన్న విభేదాలు కూడా కుల వివక్షగా ముద్ర వేయబడే ప్రమాదం ఉంది. అప్పుడు నిజమైన వివక్ష కేసులు, సాధారణ వ్యక్తిగత సంఘర్షణల మధ్య తేడా గుర్తించడం కష్టం. దీనివల్ల క్యాంపస్‌లలో అనవసర భయం, అనుమానం, విభజన పెరిగే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో యుజిసి 2026 నిబంధనలు యథాతథంగా అమలైతే, విశ్వవిద్యాలయాలు అనేక సమస్యలను ఎదుర్కొంటాయి. పరిపాలనా భారం పెరుగుతుంది. ఇప్పటికే అనేక కమిటీలతో సతమతమవుతున్న విద్యాసంస్థలు, మరో కొత్త వ్యవస్థను నిర్వహించాల్సి వస్తుంది. ఇది బోధన, పరిశోధనలపై దృష్టి తగ్గించే ప్రమాదం ఉంది. కాగా, ప్రతి ఫిర్యాదును కుల కోణంలోనే చూడాలనే ఒత్తిడి పెరిగితే, అధ్యాపకులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలకు ఆటంకం కలుగుతుంది. తమ మాటలు, నిర్ణయాలు విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకుంటారేమో అనే భయంతో ఉపాధ్యాయులు అనేకానేక రకాలుగా వెనుకడుగు వేయవచ్చు. ఇది విద్యా స్వేచ్ఛపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

వాస్తవానికి, విమర్శనాత్మక దృష్టితో చూస్తే, సమానత్వం అనేది కేవలం కమిటీల ద్వారా, నిబంధనల ద్వారా మాత్రమే సాధ్యం కాదు. అది క్యాంపస్ సంస్కృతిలో, తరగతి గదుల్లో, హాస్టళ్లలో, సహపాఠుల మధ్య సంబంధాల్లో ప్రతిఫలించాలి. సుప్రీంకోర్టు ఈ నిబంధనలను న్యాయవాదుల కమిటీ ద్వారా పునఃపరిశీలించాలన్న సూచన, చట్టసృష్టిలో నిపుణుల పాత్ర ప్రాముఖ్యతను తెలియజేసింది. ఇది విద్యార్థులకు ప్రజా విధానాల రూపకల్పనపై అవగాహన కలిగించే మరో అంశం. ఈ కేసు ద్వారా విద్యార్థులు న్యాయవ్యవస్థ పాత్రను ప్రత్యక్షంగా గమనించగలగడం సుప్రీం కోర్టు నిర్ణయంతో సాధ్యమవుతున్నది. ఒక ప్రభుత్వ సంస్థ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు సమీక్షించడం, అవసరమైతే స్టే విధించడం ప్రజాస్వామ్యంలో ఎంత కీలకమో స్పష్టమవుతుంది. ఇది విద్యార్థులకు కూడా ఒక సజీవ పాఠం. అధికార నిర్ణయాలు ప్రశ్నించదగినవని, అవి రాజ్యాంగ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సిందేనని వారికి తెలుస్తుంది. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వు తాత్కాలికమేకావచ్చు.. కానీ, దాని ప్రభావం దీర్ఘకాలికంగా ఉండే అవకాశముంది. మార్చి 19న కేసు తిరిగి విచారణకు వచ్చేలోగా, కేంద్రం, యుజిసి తమ నిబంధనలను పునఃపరిశీలించక తప్పదు. ఈ ప్రక్రియలో విద్యార్థుల నుంచి మేధావుల వరకూ, ఉపాధ్యాయుల నుంచి విద్యా నిపుణుల వరకూ... పలువురి అభిప్రాయాలు, అనుభవాలు కూడా పరిగణనలోకి రావాల్సిన అవసరం ఉంది. **(క్యాంపస్‌లలో నిజంగా ఏమి జరుగుతున్నదో, వివక్ష ఎలా వ్యక్తమవుతున్నదో విద్యార్థులకే బాగా తెలుసు. వారి స్వరం వినిపించకుండా రూపొందించే ఏ నిబంధనైనా అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.)** యుజిసి కొత్త నిబంధనలను స్థూలంగా చూస్తే, వివక్షకు గురైన వర్గాలవారికి న్యాయం కలిగించేవిగా కనిపిస్తాయి. కానీ, సూక్ష్మంగా చూస్తే, ఒక వర్గానికి మాత్రమే కొమ్ముకాస్తూ, మిగతా వర్గాలను అభద్రతా భావంలోకి నెట్టివేసే ప్రమాదం ఆవిష్కృతమవుతుంది. మంచి పేరుతో చెడును వండి వడ్డించడం విశ్వవిద్యాలయాల విశిష్ట వాతావరణాన్ని కలుషితం చేస్తుంది. విద్యార్థుల మధ్య కుల, మత అడ్డుగోడలు కడుతుంది. వైషమ్యాలు పెంచుతుంది. ప్రజాస్వామిక దేశంలో, పౌరులందరికీ సమానమైన హక్కులను కల్పించిన రాజ్యాంగాన్ని పరోక్షంగా దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను అడ్డుకోక తప్పదు. న్యాయం అనేది ఏ ఒక వర్గానికో మాత్రమే పరిమితం కాకూడదు. సమానత్వం పేరుతో కొత్త అసమానతలు సృష్టించకూడదు.

చట్టాలు సమాజాన్ని ఏకం చేయాలే తప్ప, విభజించకూడదు. అప్పుడు మాత్రమే యుజిసి నిర్ణయం నిజం గా విద్యార్థులకు ఉపయోగపడుతుంది. అంతేకాకుండా విద్యావ్యవస్థను మరింత న్యాయపరమైన దిశలో.. అభివృద్ధి పథంలో నడిపిస్తుంది.



## యుజిసి రోల్‌బ్యాక్ అనేది తిరోగమన భావన

యుజిసి తీసుకువచ్చిన ఉన్నత విద్యా సంస్థలలో 'సమానత్వ ప్రోత్సాహం నిబంధనలు–2026' ఆలస్యమైనప్పటికీ, స్వాగతించదగిన చర్య. లోతైన వివక్ష, సంస్థాగత ఉదాసీనతతో నిండిన ఉన్నత విద్యా వ్యవస్థను సంస్కరించడంలో ఇదొక అడుగు. కేంద్ర స్థాయిలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతీయ ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలు, ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. దక్షిణ భారతదేశం, కశ్మీర్, మైనారిటీ వర్గాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని పదేపదే దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయి. కాబట్టి సమానత్వ రక్షణలు అనేది ఎంపిక కాదు, అనివార్యమైన అవసరం. మండల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్ల అమలు సమయంలో చూసినట్లుగా, ప్రస్తుత యుజిసి రోల్‌బ్యాక్ ఆందోళన అదే తిరోగమన మనస్తత్వంతో నడపబడుతుంది. ఈ నిబంధనలను లేదా వాటి ప్రధాన లక్ష్యాలను నీరుగార్చడానికి కేంద్ర ప్రభుత్వం అటువంటి ఒత్తిడిని అనుమతించకూడదు.

తమిళనాడు సిఎం ఎం.కె.స్టాలిన్



## మహాత్ముని సూక్తులు... నేటి అవసరాలు

20వ శతాబ్దపు ప్రపంచ మేటి ఘనుల్లో ప్రముఖమైన మహాశక్తిగా నేటికీ నిలుస్తున్నారు మన మహాత్మాగాంధీ. భారతీయులకే కాకుండా నెల్సన్ మండేలా, లూథర్ కింగ్ జూనియర్ లాంటి అనేక విశ్వ విఖ్యాత నాయకులకు సహితం ప్రేరణగా నిలిచిన మోహన్‌దాస్ కమర్‌చంద్ గాంధీ జీవితం నేటికీ మానవాళికి దారిదీపంగా నిలుస్తున్నది. భారతీయ లాయర్, రాజకీయ నాయకులు, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్త, సాహితీవేత్త, అతి సాధారణ జీవనశైలిని పరిచయం చేసిన మహా నేత అయిన గాంధీ అహింస అనే పదునైన ఆయుధాన్ని ప్రయోగించి బ్రిటీష్ పాలకుల గుండెల్లో దడ పుట్టించి భరతమాతకు స్వేచ్ఛను ప్రదానం చేశారు. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిందనే సంతోషంతో పాటు దేశ విభజన గాయాలనతో బాధ పడుతున్న వేళ 30 జనవరి 1948న హిందుత్వవాది నాథూరామ్ వినాయక్ గాడ్సె తూటాలకు తుది శ్వాస విడిచారు. ఆయన సూక్తులు...నడచిన మార్గాలు నేటి సమాజ అవసరాలుగా మారాయి. హింస పెరుగుతున్న కాలంలో మహాత్ముని ఆశయాలను సింహావలోకనం చేసుకోవాలి.

మహాత్మాగాంధీ వర్ధంతి 30 జనవరి రోజున దేశవ్యాప్తంగా అమర వీరుల దినం (మార్టైర్స్ డే) లేదా గాంధీ పుణ్య తిథి లేదా షహీది దివస్‌గా పాటించడం ఆనవాయితీగా మారింది. గాంధీ పట్ల అభిమానంతో రవీంద్రనాథ్ ఠాగూర్ తొలిసారి మహాత్మా అని పిలవడంతో వారి పేరు మహాత్మాగాంధీ అని, జాతి పిత అని, ప్రేమతో బాపు అని నోరారా పిలుచుకునే గాంధీ జీవితం భరతమాత సేవకు అర్పించారు.

అహింస, ఏకత, మానవీయత లాంటి సమోన్నత విలువలను మానవాళికి పరిచయం చేసిన అసమాన మానవతీమూర్తి మన బాపు. గుజరాత్ రాష్ట్ర పోర్బందర్ పట్టణంలో 02 అక్టోబర్ 1869న జన్మించిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ లండన్‌లో బారిస్టర్ పట్టాను పొంది. 21 ఏండ్ల పాటు దక్షిణ ఆఫ్రికాలో గడిపారు. అక్కడ నెలకొన్న అసమానతలను చూసి చలించారు.

దక్షిణ ఆఫ్రికా నుంచి 1915లో భారత్‌కు తిరిగి వచ్చి భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ ఆ ఉద్యమ స్వరూపాన్ని ఆసాంతం మార్చివేసి బ్రిటీష్ తెల్ల దొరల గుండెల్లో దడ పుట్టించారు. అహింస అనే అత్యంత పదునైన ఆయుధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని కొనసాగిస్తూనే, వలస పాలకులతో చర్చలు జరుపుతూ, చివరకు బ్రిటీష్ పాలనకు అంతం చూపగలిగారు. సత్యం, అహింస, క్షమాగుణం, నిస్వార్థ సేవ, సానుకూల భావనలు, మానసిక దృఢత్వం, త్యాగం, సత్యాగ్రహాలను పునాదులుగా చేసుకొని ఉద్యమాగ్నికి ఆజ్యం పోశారు. తన జీవిత చరిత్రను 'మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్' అనే ఆత్మకథను రాసి భవిష్యత్ తరాలకు సన్మార్గం చూపుతున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, ఖాళీ ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా, దండి మార్చ్ లాంటి అనేక రకాలైన ఉద్యమాలను నడిపి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టారు.

క్రమశిక్షణ, శాంతి, సమానత్వం, నైతికత, మానవీయ విలువలను శాశ్వత ఆభరణాలుగా ధరించి జీవితాన్ని కొనసాగించిన గాంధీ మనకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నారు. వారి ఆదర్శాల తరంగాలు భారత్‌లో మాత్రమే కాకుండా ప్రపంచమంతటా వ్యాపించడం వాస్తవం, అనుసరణీయం. మానవీయ విలువ నిలువెత్తు రూపం మహాత్మాగాంధీ. చొక్కా తొడగడం వదిలి విలువల వస్త్రాలను ధరించి సాదాసీదా జీవితాన్ని మహోన్నతంగా గడిపిన గాంధీ ఐన్‌స్టీన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త చేత మహోన్నతుడిగా కొనియాడబడడం హర్షదాయకం, ఆశ్చర్యకరం. గాంధీ చూపిన బాటలో నడుస్తూ, సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని నిలుపుకుంటూ, విలువలు పాటించి వ్యక్తిగతంగా ఎదుగుతూ, దేశాభివృద్ధికిసహకరిద్దాం, 'భారతమాతా కీ జై' అంటూ నినదిద్దాం.

*(30 జనవరి అమర వీరుల దినోత్సవం సందర్భంగా)*

**బి.మధుసూదన్‌రెడ్డి**

# బొగ్గు గనుల మసిని ప్రభుత్వానికి పూస్తున్న ప్రతిపక్షం



**ఎస్.బాబు,** అధ్యక్షులు
టిజిఎస్‌ఆర్టీసి
ఎంప్లాయీస్ యూనియన్

అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ కాదేదీ కవిత కనర్హం అన్నారు శ్రీశ్రీ. అలాగే బిజెపి ప్రభుత్వం ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వారికి ధారాదత్తం చేసింది. ఇంకా చేస్తూనే ఉంది. దానిలో భాగంగానే ఈ బొగ్గుగనుల వేలం. కేంద్ర ప్రభుత్వం బొగ్గుగనుల శాఖ ఒరిస్సాలోని 16 గనులు, మధ్యప్రదేశ్‌లో 15 గనులు, ఛత్తీస్‌గఢ్ 6, ఝార్ఖండ్ 6, బెంగాల్, బీహార్ 3గనులు, మహారాష్ట్ర, తెలంగాణల్లో ఒక్కో బొగ్గు గనికి వేలం నిర్వహించింది. డిఫెన్స్, సెక్యూరిటీ, రైల్వేలను ప్రైవేటీకరించే వారికి, నవరత్న కంపెనీలలో ప్రభుత్వ వాటాలను ఉపసంహరించేవారికి బొగ్గు గనులు వేలం వేయటం పల్లీ బటానీలు తిన్నంత సులభం. రామ కార్యాన్ని చేయటానికి హనుమ ఎంత భక్తి శ్రద్ధలు చూపిస్తాడో, అంతకంటే ఎక్కువ శ్రద్ధను ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడంలో బిజెపి ప్రభుత్వం ముందంజ వేస్తోంది. సింగరేణిని మింగడానికి కేంద్ర ప్రభుత్వం అనకొండలా చూస్తోంది. ఎర్ర తివాచీలు పరచి కార్పొరేట్ కంపెనీలను ఆహ్వానిస్తోంది.

ఒడిషాలోని నైనీ బ్లాక్ బొగ్గు గని సింగరేణి సంస్థకు చెందినది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంధన, ఆర్థిక శాఖలు చూస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆ రాష్ట్రానికి వెళ్ళి అక్కడ ప్రభుత్వంతో చర్చించి 2,400 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా ఎం.ఓ.యు చేసుకున్నారు. నైనీ బ్లాక్ లో బొగ్గు ఉత్పత్తి చేయడం కోసం సింగరేణి సంస్థ టెండర్లను పిలిచింది. సాధారణంగా టెండర్ ప్రక్రియలో నిబంధనలు రూపొందించే బాధ్యత సింగరేణి సంస్థ చేస్తుంది తప్ప, ప్రభుత్వ జోక్యం ఉండదు. ఈ టెండర్లు దక్కించుకునేవారు ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా జత చేయాలని సింగరేణి కంపెనీ టెండర్ నిబంధనల్లో పొందుపరిచింది. రూ.1600 కోట్ల విలువైన ఈ కాంట్రాక్ట్ ను దక్కించుకోవడం కోసం 16 సంస్థలు వేలంలో పాల్గొన్నాయి. సింగరేణి సంస్థ పెట్టిన ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువు అయింది. దీనిపై బిఆర్‌ఎస్ విమర్శ మొదలు పెట్టింది. గతంలో తమ ప్రభుత్వం టెండర్లలో ఈ నిబంధన పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టింది కనుక, తమకు నచ్చినవారికే ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ ఇచ్చి టెండర్ వారికి దక్కేలా కుట్ర చేస్తోందని బట్ట కాల్చి మీద వేశారు. ఈ కుట్రలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రధాన సూత్రధారులని, వారే చక్రం తిప్పుతున్నారని కట్టుకథలు, పిట్టకథలు అల్లి అనుమానాల వలపన్ని బొగ్గు మసి బొడ్డుకు రాసుకుని కూర్చున్నారు ప్రతిపక్ష నాయకులు. దీనితో ఆగకుండా ముఖ్యమంత్రి బంధువులను కూడా ఈ కుంభకోణంలో ఇరికించి టెండర్లపై విచారణ జరిపించాలని సిబిఐకు లేఖలు రాశారు. అంతేకాకుండా ఈ వ్యవహారంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సంబంధం ఉందని, అందుకే ఆయన స్పందించడం లేదని తారక రాముని ఆరోపణలు. 'ఆలూ లేదు..చూలు లేదు..కొడుకు పేరు సోమలింగం' అన్నట్లుగా టెండర్లలో ఏమీ జరగకుండానే దానికి బొగ్గు కుంభకోణం అని నామకరణం చేసి బిఆర్‌ఎస్ పార్టీ మరియు మీడియా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది. గతంలో సింగరేణిని బిఆర్‌ఎస్ పార్టీ దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శిస్తున్నారు. మరి అప్పుడు బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండి బిఆర్‌ఎస్ దోపిడీని ఎందుకు అరికట్టలేకపోయింది?

ఇక్కడ బిఆర్‌ఎస్ పార్టీ వ్యూహం చాలా స్పష్టంగా అర్థమవుతోంది. ఒక్క దెబ్బకి రెండు పిట్టలు అంటే ఇదే. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావులపై విచారణలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ దూకుడుకి అడ్డుకట్ట వేయడం ఒక ఎత్తైతే, రెండవది కిషన్ రెడ్డిని ఇరికించి బిజెపి ప్రభుత్వాన్ని కాళేశ్వరంతో పాటు ఇతర కేసుల్లో ముందుకు రాకుండా చేయడం కోసం బిఆర్‌ఎస్ చేస్తున్న ఎదురు దాడి. ఒకవైపు విపక్షం ఎదురు దాడి, మరోవైపు మీడియా ఈ వ్యవహారంపై కథనాలను బాగా మసాలా దట్టించి వండి వార్చాయి. ఓ ప్రముఖ మీడియా సంస్థకు చెందినవారు ఈ టెండర్లలో భాగస్వాములని, మీడియా వర్సెస్ మీడియా నడిచింది. మీడియా ఫైట్ కాస్తా కాంగ్రెస్ బిఆర్‌ఎస్ తన్నులాటగా మారింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్న బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఈ సమస్యని రణక్షేత్రం చేసి బొగ్గు మసి కాంగ్రెస్ కి పూసింది. వెంటనే నైనీ బ్లాక్ టెండర్లను రద్దు చేసింది. ఇక్కడ బిఆర్‌ఎస్ పైచేయి సాధించింది. కాంగ్రెస్ తప్పు చేసింది కనుక టెండర్లు రద్దు చేసిందని సన్నాయి నొక్కులు నొక్కుతూ మొసలి పట్టు పట్టింది. టెండర్లను రద్దు చేసినా రాజకీయ రగడ మాత్రం రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. కెటిఆర్ ఇంతటితో ఆగకుండా 9 సింగరేణి టెండర్లను ముఖ్యమంత్రి బావమరిది నియంత్రిస్తున్నారని, ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ కోసం వచ్చిన వారిని ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపణ చేస్తూ సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేయడం విచిత్ర వ్యవహారం. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి బావమరిది అయిన సుజన్ రెడ్డికి ఈ కాంట్రాక్ట్ అప్పగించే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్న బిఆర్‌ఎస్ నేతలు, వారు అధికారంలో ఉన్నప్పుడు సుజన్ రెడ్డికి ఎలా టెండర్ కాంట్రాక్ట్ ఇచ్చారో చెబితే ప్రజలకు అర్థం అవుతుంది.

సింగరేణిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనం 49 : 51 శాతంగా ఉంది. టెండర్లతో సంబంధం లేకుండా సింగరేణి నైనీ గనులతో పాటు శ్రావణపల్లి, సత్తుపల్లి బ్లాక్ 3, కొయ్యగూడెం ఓపెన్ కాస్ట్ సింగరేణి సంస్థే వెలికి తీసుకునే విధంగా అనుమతించాలని అక్కడ ట్రేడ్ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. సింగరేణిలో 40 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, 30వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. దేశంలో ఉన్న నవరత్న కంపెనీల్లో ఇది కూడా ఒకటి. దీన్ని ఎలాగైనా కాపాడుకోవాలి. ఎందుకంటే రాబోయే రోజుల్లో థర్మల్ విద్యుత్ తగ్గిపోతుంది. అప్పుడు సహజంగానే సింగరేణి బొగ్గు తగ్గుతుంది. కోల్ ఇండియా గనులు ఓపెన్ చెయ్యాలంటే 2 క్యూబిక్ మీటర్ల మట్టితీస్తే బొగ్గు బయట పడుతుంది. అదే సింగరేణిలో అయితే 6 నుండి 7 క్యూబిక్ మీటర్ల మట్టి ఎత్తి పోస్తే గాని గని బయట పడదు. దీనివల్ల ఖర్చు పెరుగుతుంది. అప్పుడు సహజంగానే సింగరేణి బొగ్గుకు రేటు ఎక్కువవుతుంది. కోల్ ఇండియా బొగ్గు తక్కువ రేటుకి అందుబాటులో ఉంటుంది కనుక కొనుగోలు దారుడు సహజంగానే కోల్ ఇండియా బొగ్గు వైపు మొగ్గు చూపిస్తాడు. కర్ణాటక గవర్నమెంట్ సింగరేణితో పిపిఎ అగ్రిమెంట్ బొగ్గు సరఫరా కోసం చేసుకుంది. కాని వారు బొగ్గు కొనడానికి రావడం లేదు. ఎందుకంటే సింగరేణి బొగ్గు ఖర్చు ఎక్కువవుతుంది కనుక. అందుకే సంస్థ మనుగడ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి గనులకు టెండర్లు పిలవకుండానే ఆ సంస్థనే అనుమతించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర బొగ్గు గనుల శాఖకు లేఖలు కూడా వ్రాసింది. అయినా బిజెపి ప్రభుత్వం వినిపించుకునే స్థితిలో లేదు. కేంద్ర ప్రభుత్వమే 10 శాతం ఇంపోర్టెడ్ కోల్ వాడాలని కోల్ ఇండియాకు ఆదేశాలు ఇచ్చింది. మన దగ్గరే బొగ్గు పుష్కలంగా దొరుకుతున్నప్పుడు, ఇంపోర్టెడ్ కోల్ ఎందుకు వాడాలి? ఇందులో వస్తున్న అవినీతి సొమ్ము ఎవరి జేబులోకి పోతోంది? ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించాలన్న బిఆర్‌ఎస్ నేతలు దీని గురించి ఎందుకు అడగలేకపోతున్నారు?



భారతదేశంలో 75 శాతం థర్మల్ పవర్ ఉత్పత్తి అవుతోంది. ఆదానీ కంపెనీ ఇండోనేషియా నుండి నాసిరకం బొగ్గును 28 డాలర్లకు కొని తమిళనాడుకు హై క్వాలిటీ బొగ్గు పేరుతో 86 డాలర్లకు అమ్ముతోంది. అందువల్ల ఆ కంపెనీకి ఒక టన్నుకు 48 రూపాయలు లాభం రావడం వల్ల 7వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగింది. ఈ కుంభకోణం గురించి బిజెపికి, బిఆర్‌ఎస్ కి పట్టదా?

బొగ్గు గని కోసం టెండర్లు వేసిన తరువాత వాటిని సింగరేణి సంస్థ పరిశీలించి ప్రీ బిడ్ మీటింగ్ బిడ్డర్స్‌తో జరుపుతారు. టెండర్ కమిటీలోని అధికారులు కొన్ని మార్పులు చేర్పులు చేసి కొరిజెండం ప్రతిపాదిస్తారు. ఈ సవరణలు అంగీకరించటానికి సుమారు నెల సమయం పడుతుంది. ఇది జరిగిన తరువాత ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ సింగరేణి సంస్థ ఇస్తుంది. ఇది జరపకుండా ముందుగానే సర్టిఫికెట్ ఇవ్వరు. ఈ ప్రొసీజర్ పై అవగాహన లేనట్లుగా బిఆర్‌ఎస్ నాయకులు, మీడియా వారు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పు చేసిందని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కుట్రలు చేస్తున్నారని, బురద చల్లుతోంది. ఈ వాక్యం ఎందుకు రాశానంటే, ఈ ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం టెండర్ ఫారంలో పెట్టలేదు అని వారే అన్నారు కనుక దాని ప్రొసీజర్ గురించి వారికి తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్తవ్యస్త పరుస్తూ అధికారం కోసం బిఆర్‌ఎస్ నాయకు లు తహతహ లాడుతున్నట్లుగా కనిపిస్తోంది. కొరిజెండం జరిగిన తరువాత కూడా ఫీల్డ్ విజిట్ సర్టిఫికెట్ సింగరేణి అధికారులు ఇవ్వకపోతే అది అధికారుల తప్పిదం అవుతుందే తప్ప, ప్రభుత్వానిది కాదు. ఈ విషయంపై కంప్లైంట్ చేస్తే సుప్రీంకోర్టుకు వారిపై చర్య తీసుకునే అధికారం కూడా ఉంటుంది. బిఆర్‌ఎస్ పార్టీ నాయకద్వయం సంస్థ అధికారులను వదిలిపెట్టి, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ రచ్చ చేస్తోంది. ఇది నార్సిస్టిక్ డిజార్డర్ అనే మానసిక వ్యాధి లక్షణంగా గోచరిస్తోంది.

కాంగ్రెస్ పార్టీలో ఎదుగుతున్నవారిని కాళ్ళు పట్టి కిందికి లాగటం, నాయకుల మధ్య అంతర్గత పోరు, గత 140 సంవత్సరాలుగా కాంగ్రెస్‌కి అంటువ్యాధిలా సోకి ఇప్పటికీ తగ్గలేదు. అందువలన మంత్రుల మధ్య, ఎమ్మెల్యేలు, ఐఎఎస్, ఐపిఎస్ ఆఫీసర్లతో వివాదాలు ఏర్పడుతున్నాయి. ఇవి బిఆర్‌ఎస్‌కు విమర్శనా అస్త్రాలుగా దొరుకుతున్నాయి. ఎక్కడో పుట్టిన బొగ్గు వివాదం సుడిగాలిలా రేగి ఉపముఖ్యమంత్రి మెడకు చుట్టుకుంది. దశాబ్దకాలంగా తప్పుల మీద తప్పులు చేస్తూ వచ్చిన వారు తప్పించుకు తిరుగుతూ మంత్రులను, ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతున్నారు. 'నిజం నిలకడ మీద తెలుస్తుంది అనుకునే సరికి అబద్ధం ఆమడ దూరం ప్రయాణం' చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఆత్మ పరిశీలన చేసుకుని విపక్షానికి చెక్ పెట్టకపోతే, గడ్డుకాలాన్ని ఎదుర్కోవలసిన దుస్థితి ఏర్పడుతుంది.

లేఖ

# 'విబి జి రామ్ జి' తో భారత్ వికసించేనా?

ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. ఐతే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తికాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య...తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరు ప్రతిష్టలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృధా అవుతుంది.

2005లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేకమార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతనే MGNAREGA చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ)నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి(పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించదానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది.

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2025లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్(వీబీ జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ 2005 చట్టం తు.చ. తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ 'విబి జి రామ్ జి' 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంతవరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది.

నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి–2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10శాతం వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100 శాతం, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90 శాతం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాటా 10 శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి..ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయరంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజులపాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బతింటుంది, ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది.

ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైన విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తు ల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంతమేరకైన సఫలీకృతమై సామాజిక , ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్, ఉగ్రవాదం,అవినీతి...లను ప్రధాన శత్రువులుగా భావించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది.

**డా. రాజు,** వరంగల్

## మైనర్ బాలికపై అత్యాచారయత్నం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని కాపుగల్లు గ్రామంలో చోటు చేసుకున్న మైనర్ బాలిక అత్యాచారయత్నం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరు సంవత్సరాల మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 20 సంవత్సరాల యువకుడు అత్యాచారానికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే కాపుగల్లు గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఒంటరిగా చూసిన నింధితుడు ఆమెపై దాడికి ప్రయత్నించినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తీవ్రంగా భయభ్రాంతులకు గురికావడంతో కుటుంబ సభ్యులు తొలుత విషయం బయటకు చెప్పలేకపోయారని సమాచారం. అనంతరం బాలిక ఆరోగ్యం, మానసిక పరిస్థితి మరింత క్షీణించడంతో ఘటన వెలుగులోకి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు కౌన్సిలింగ్ కూడా అందిస్తున్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సర్పంచ్‌లు, అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలకు జవాబుదారీగా ఉండాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మిర్యాలగూడ మండలం లావూడితండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. ఎన్నికల హామీలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావూడి శ్రీహరి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, ఎంపీడీవో శేషగిరిరావు, మాజీ ఎంపీపీ ఎస్‌కె.జిందా, కార్యదర్శి బంటు వాని, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాడిని నియమించాలి

ఎంఇఒను నిర్బంధించిన ఎఐఎస్ఎఫ్ నాయకులు



**ప్రజాపక్షం/మునుగోడు**: మండలంలోని పలివెల ప్రభుత్వ హై స్కూల్‌లో గత మూడు నెలలుగా తెలుగు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్రంగా విద్యాపరంగా నష్టపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం మండల విద్యాధికారి మల్లేశంను అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) బీసీ సంఘం నాయకులు గదిలో తాళం వేసి నిర్బంధించారు.అనంతరం విద్యార్థులతో కలిసి పలివెల చౌరస్తాలో తెలుగు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు గోపగోని ఉదయ్ మాట్లాడుతూ విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నప్పటికీ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలుగు ఉపాధ్యాయిని నియమించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృ తం చేస్తామని హెచ్చరించారు.బీసీ సంఘం నాయకులు ఆనగంటి కృష్ణ ధర్నా కు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షులు గోసుకొండ మల్లేష్,చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెరుకు సైదులు,సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఆనగంటి నరసింహ,వరికుప్పల రాజు,కొండూరు మల్లికార్జున్, దాడి జితేందర్ రెడ్డి,మాధగోని మల్లయ్య గోసుకొండ రవి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలేరులో 25 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/ఆలేరు** : మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా నామినేషన్ కార్యక్రమం రెండో రోజు గురువారం ఆలేరు మున్సిపాలిటీకి 25 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. మొత్తం రెండు రోజుల్లో 35 నామినేషన్‌లు దాఖలయ్యాయని పార్టీల వారీగా బిజెపి పార్టీ తరఫున ఆరుగురు, బిఆర్ఎస్ పార్టీ తరఫున పది మంది, కాంగ్రెస్ పార్టీ తరఫున ఆరుగురు, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో రేపు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, నియమ నిబంధనలు పాటించడం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని చుట్టుపక్కల వారిని చైతన్యవంతం చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా సూర్యాపేట పట్టణానికి చెందిన ఎమ్మెస్సార్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టడం చాలా మంచి ఉద్దేశమని వారిని అభినందించారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, అతివేగాన్ని నివారించడం వంటి పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఫోక్సో చట్టం గురించి తెలియజేశారు. ప్రమాదరహిత జిల్లాగా సూర్యాపేటను చూపించడం అందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆదిత్య, సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, ఎమ్మెస్సార్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ఉన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు పట్టణ ముఖ్య కూడళ్లలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలంటూ వాహనాలకు స్టిక్కర్లను అంటిపెడుతూ అవగాహన కల్పించారు.



# ఆరు మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యం!

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధీమా



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా కాంగ్రెస్ ఎన్నికల బరిలోకి దిగుతోందని స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట (12 వార్డులు), ఆలేరు (12 వార్డులు) మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సీపీఐ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగి, ప్రతిపక్షాలకు తావులేకుండా క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని, పట్టణాల అభివృద్ధి వేగంగా జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అనివార్యం అన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా బూత్ స్థాయి నుంచి పనిచేయాలని అయిలయ్య సూచించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటే విజయం మనదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, బబ్బూరి శ్రీధర్, పేరబోయిన బంగారి, గోరేటి రాములు, పేరబోయిన పెంటయ్య, కాంగ్రెస్, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బందారపు బిక్షపతి, ముక్కెర్ల మల్లేష్, గుండ్లపల్లి భరత్, సీపీఐ కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఊపందుకున్న నామినేషన్లు

సూర్యాపేట జిల్లా ఐదు మున్సిపాలిటీల్లో
2వ రోజు 432 నామినేషన్ల దాఖలు
సూర్యాపేటలో 230, హుజూర్‌నగర్‌లో 67,
తిరుమలగిరిలో 49, కోదాడలో 49, నేరేడుచర్లలో 37



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల్లో గురువారం నామినేషన్ దాఖలాలు రెండవ రోజు ఊపందుకుంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో మొదటి రోజు మొత్తం 24 నామినేషన్లు దాఖలు కాగా, రెండవ రోజు 432 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో సూర్యాపేటలో 230, హుజూర్‌నగర్‌లో 67, కోదాడలో 49, తిరుమలగిరిలో 49, నేరేడుచర్లలో 37 దాఖలు అయినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులకు గాను 230 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 94, బిఆర్ఎస్ నుండి 62, బిజెపి నుండి 28, బిఎస్‌పి నుండి 3, సిపిఎం 2, ఏఐఎంఐఎం నుండి 2, స్వతంత్ర అభ్యర్థులు 37 నామినేషన్లు దాఖలు చేశారు. కాగా మొత్తం నేటి వరకు 243 నామినేషన్లు దాఖలయ్యాయి. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులకు గాను 67 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 19, బిఆర్ఎస్ నుండి 27, బిజెపి నుండి 11, సిపిఎం నుండి 3, ఇతర పార్టీలు 3, స్వతంత్ర అభ్యర్థులు 4 నామినేషన్లు దాఖలు చేశారు. కోదాడ మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులకు గాను 49 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 11, బిఆర్ఎస్ నుండి 18, టిడిపి నుండి 6, బిజెపి నుండి 5, స్వతంత్ర అభ్యర్థులు 10 నామినేషన్లు దాఖలు చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులకు గాను 49 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 25, బిఆర్ఎస్ నుండి 17, బిజెపి నుండి 9, సిపిఎం 2, స్వతంత్ర అభ్యర్థులు 5 నామినేషన్లు దాఖలు చేశారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులకు గాను 37 నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 17, బిఆర్ఎస్ నుండి 12, బిజెపి నుండి 5, టిడిపి నుండి 1, స్వతంత్ర అభ్యర్థులు 2 నామినేషన్లు దాఖలు చేశారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన అత్యంత అవసరం అని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎన్‌జి కాలేజ్ నుండి రామగిరి,క్లాక్ టవర్ వరకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్‌లు జండా ఊపి ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని,ఇది అత్యంత ఆందోళనకరమని అన్నారు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడమే జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు.ఒక్క క్షణ నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపంగా మారుతుందని హెచ్చరించారు.ట్రాఫిక్ పోలీసుల సూచనలను గౌరవిస్తూ, రహదారిపై శాసనబద్ధంగా ప్రయాణించడమే సురక్షిత జీవనానికి మార్గమని పేర్కొన్నారు. ఈబైక్ ర్యాలీలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.వాణి, డిటిఓ లావణ్య,డిఎస్‌పి శివరాం రెడ్డి,ఎంవిఐ కొండయ్య,మల్లికార్జున్ రెడ్డి,స్వప్న,యువకులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపల్ ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై గురువారం ఆయన తన ఛాంబర్లో మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 28 నుండి 30 వరకు నామినేషన్ల స్వీకరణ, 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 11న పోలింగ్, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. పార్టీల ఆధారంగా నిర్వహించే ఈ ఎన్నికల్లో అభ్యర్థులు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ఖర్చుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో వివరించడం జరిగిందన్నారు. అలాగే రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు పాటించాల్సిన నియమ, నిబంధనలపై వారికి వివరించినట్లు తెలిపారు. బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించే మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నోడల్ టీములను ఏర్పాటు చేయడమే కాకుండా, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి ఏర్పాటు చేశామని, ఈ బృందాలు అన్నిటికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. జిల్లాలో 2,26,586 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల, సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటిలలో 141 వార్డులలో, 372 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేశామని, ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల సామాగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సూర్యాపేటలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పెయిడ్ న్యూస్, ప్రకటనలు, సోషల్‌మీడియా, న్యూస్ తదితర న్యూస్‌పై జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటిని ఏర్పాటు చేయడం జరిగిందని, పోటీలో ఉన్న అభ్యర్థులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల సందర్భంగా పాటించాల్సిన నియమ, నిబంధనలు తదితర వివరాలను వెల్లడించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి యు వెంకటేశ్వర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## 12 వార్డులకు 53 నామినేషన్లు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి జరగనున్న ఎన్నికల కోసం 12 వార్డులకు గాను రెండవ రోజు గురువారం వరకు 53 మంది నామినేషన్లను దాఖలు చేశారు. అత్యధికంగా బిఆర్ఎస్ పార్టీ నుండి 19 మంది, కాంగ్రెస్ పార్టీ నుండి 17, బిజెపి నుండి 5, బిఎస్‌పి నుండి 4, ఇండిపెండెట్లు 3, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుండి 5 మంది నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. రేపు నామినేషన్లకు చివరి తేది కావడంతో మరిన్ని నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తప్పలకు తావులేకుండా నామినేషన్లు

**ప్రజాపక్షం/ హాలియా:** హాలియా మున్సిపల్ నామినేషన్ల కేంద్రాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ పరిశీలించారు. గురువారం హాలియాలోని నామినేషన్ కేంద్రంలో ఏర్పాట్లను, సౌక ర్యాలను పర్యవేక్షించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎటువంటి తప్పులకు తావు లేకుండా నామినేషన్ల కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## చండూరు మున్సిపాలిటీలో బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న
డిసిసిబి మాజీ డైరెక్టర్ కోడి సుష్మ
సన్‌షైన్ విద్యా సంస్థల చైర్మన్, మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న
మరో 30మంది ముఖ్య నాయకుల చేరిక



**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చండూరు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. చండూరు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీకి అన్ని తానై నడిపిస్తున్న సన్‌షైన్ విద్యా సంస్థల చైర్మన్, మున్సిపాలిటీ 1వ వార్డు మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న తో పాటు ఆయన సతీమణి నల్లగొండ డిసిసిబి మాజీ డైరెక్టర్ చండూరు రైతుసేవా సహకార సంఘం మాజీ చైర్మన్ కోడి సుష్మా బిఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేశారు. గురువారం చండూరులోని తన నివాసంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోడి వెంకన్న దంపతులకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో చండూరులో 15 సంవత్సరాలుగా ముగ్గురు కోడి బ్రదర్స్ మధ్యలో ఉన్న సమస్యలను పరిష్కరించి ముగ్గురు కోడి బ్రదర్స్‌ను ఏకతాటిపైకి తెచ్చి కోడి బ్రదర్స్ కుటుంబాలను కలిపిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. వీరితో పాటుగా మరో 30మంది బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం జరుగుతున్న చండూరు మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం అని పలువురు కాంగ్రెస్ నాయకులు ధీమ వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్, గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ , ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు , కాంగ్రెస్ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం పాల్గొన్నారు.

## రెండో రోజు 176 నామినేషన్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వివిధ పార్టీ అభ్యర్థులు గురువారం నామినేషన్లు వేశారు. మిర్యాలగూడ మున్సి పాలిటీలో మొత్తం 48 వార్డులు ఉండగా మొదటి రోజు కేవలం నాలుగు నామి నేషన్లు మాత్రమే రాగా రెండవ రోజు గురువారం ఏకంగా 176 నామినేషన్లు రావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ నుంచి 79 మంది, బిఆర్ఎస్ పార్టీ నుంచి 67, సీపీఎం పార్టీ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి 13 మంది, ఇండిపెండెంట్ అభ్యర్థులు 12 మందితో కలిపి మొత్తం 176 నామినేషన్లు వచ్చినట్లు మున్సిపల్ కమీషనర్ గనవేని శ్రీనివాస్ తెలిపారు. నామినేషన్లు వేయడానికి శుక్రవారం ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో మూడవ రోజు నామినేషన్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. రెండో రోజు మార్గశిర శుద్ధ భీష్మ ఏకాదశి కావడం శుభదినంగా భావించి భారీగా నామినేషన్లు వేశారని తెలుస్తుంది.

## చండూరులో 29 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/చండూరు :** ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. మొదటిరోజు 4 నామినేషన్లు దాఖలు కాగ, రెండవరోజు 29 నామినేషన్లు దాఖలు కావడం జరిగింది. మొదటి రెండవరోజు కలిపి 27మంది వివిధ పార్టీల నుండి,5మంది స్వతంత్ర అభ్యర్థులతో మొత్తం 33 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల సహాయ జిల్లా అధికారి ,మున్సిపల్ కమిషనర్ మల్లేశం తెలిపారు. అందులో కాంగ్రెస్ నుండి 15మంది, బిఆర్ఎస్ నుండి 4, బిజెపి నుండి 1, బిఎస్‌పి 6, సిపిఐ 1, జనసేన 1, స్వతంత్రులు 5 నామినేషన్లు దాఖాలు కావడం జరిగింది.

## సవ్యంగా నామినేషన్ల ప్రక్రియ




**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని,మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సవ్యంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ మున్సిపల్ ఎన్నికల పరిశీలకులకు వివరించారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులుగా రాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ జి.రమేష్ ను నియమించింది.అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకట్ ఆదిత్యను మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమించింది.ఈమేరకు సాధారణ పరిశీలకులు రమేష్,వ్యయ పరిశీలకులు వెంకటాదిత్యాలు గురువారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలిసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.అనంతరం సాధారణ పరిశీలకులు జి. రమేష్,నల్లగొండ మున్సిపాలిటీతో పాటు,చండూరు,చిట్యాలలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,మున్సిపల్ ఎన్నికల పరిశీలకుల నోడల్ ఆఫీసర్,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ ఉన్నారు.

## రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు శాఖ నిఘా

నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు సస్పెక్ట్ షీటర్లకు నల్లగొండ డిఎస్‌పి కార్యాలయంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి శివరాం రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి,రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని,రౌడీ షీటర్లు ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని నేరచరిత్ర కలిగిన ప్రతి ఒక్కరిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి,వారి నుండి మంచి ప్రవర్తన కలిగి ఉంటామని బాండ్ రాయించుకోవడం జరుగుతుందని బాండ్ నిబంధనలు ఉల్లంఘిస్తే,బాండ్ మొత్తాన్ని జప్తు చేయడంతో పాటు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని వీరు ఏరాజకీయ పార్టీకి కొమ్ముకాయకూడదని ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయకూడదని ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు,అవసరమైతే జిల్లా బహిష్కరణ వేటు వేయబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐలు రాఘవ రావు,రాజ శేఖర్ రెడ్డి ఎస్ఐలు సైదులు,సతీష్,గోపాల్ రావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హాలియాలో 40 నామినేషన్లు




**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రెండవ రోజు నామినేషన్లు వేసేందుకు ఆసక్తి చూపారు. నామినేషన్ల రెండో రోజు గురువారం అన్ని పార్టీలు కలిపి 40 నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.పార్టీల వారీగా ఇండిపెండెంట్ లు5, కాంగ్రెస్ పార్టీ నుంచి19,బీఆర్ఎస్ నుంచి 13,బిఎస్‌పి నుంచి 1,బీజేపీ నుంచి 2 నామినేషన్లు వచ్చినట్లు చెప్పారు. నామినేషన్లకు చివరి గడువు నేటితో ముగియ నుండడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థులు నేడు నామినేషన్లు వేయనున్నట్లు తెలిసింది.



# ఎమ్మెల్యేతో కలిసి నామినేషన్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటిపరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బృంగిరత్నమాల ఆనంద్‌కుమార్ ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డితో కలిసి నామినేషన్ వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి ఠాగూర్‌బాలాజిసింగ్, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు రాములు, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

**2వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రియాంక :** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విస్లావత్ ప్రియాంక పేరును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమ్ముల శ్రీకాంత్‌తోకలిసి గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించిన నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా జిల్లా కలెక్టరేట్ సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9154283913 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటదివెంట పరిశీలిస్తూ, పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.



# ఎంపిఒగా బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/వెల్దండ :** ఐకెపి ఎపిఎంగా జంగయ్య గురువారం నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎపిఎంగా పనిచేసిన శ్రీదేవి వంగూరు మండలానికి ఎపిఎంగా బదలీచేయగా, బల్మూరు మండలంలో ఎపిఎంగా పనిచేసిన జంగయ్య బదిలీపై వెల్దండ మండలకేంద్రానికి వచ్చారు. దీంతో ఎపిఎంగా బాధ్యతలు చేపట్టిన జంగయ్య ఆయాగ్రామాల వివోఎలు లక్ష్మ ణ్, ఈశ్వర్, రాజు, నంధ్య, వనిత, శ్రీనిధి, మేనేజర్ చందు శాలువాలతో సన్మానించారు.

# మార్చాల గ్రామానికి రెండోవిడతలో 70 ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో రెండోవిడతలో 70 ఇందిరమ్మ ఇండ్లురావడం జరిగిందని ఇందిరమ్మ కమిటిసభ్యురాలు భారతమ్మ తెలిపారు. మొదటివిడతలో మార్చాల గ్రామానికి 30 ఇందిరమ్మ ఇండ్లను మంజూరుచేశారు. అందులో 25 ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, మార్చాల గ్రామానికి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి పెద్దపీటవేసి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణరాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నిరుపేదలకు ఉచితంగా సొంతిల్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారని తెలంగాణరాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని అన్నారు.



# మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్ల పరిశీలన

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలి
## నిబంధనల ఉల్లంఘున పై కఠిన చర్యలు : ఎస్పీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి , మద్దూర్ మున్సిపాలిటీలలో నామినేషన్ కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మక్తల్ 16 మున్సిపాలిటీ వార్డులకు సంబంధించి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం రెండవ రోజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మక్తల్ మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా శాంతియుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఎన్నికల సమయంలో అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా, సరఫరా చేయరాదని, ఒకవేళ చేస్తే వాటిని ఎన్నికల నిబంధనల మేరకు సీజ్ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద సెక్షన్ 163 BNSS (144 Crpc) అమలులో ఉన్నదని, అలాగే నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో వాహనాలు ఉండాలని, 100 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదు అని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల్లో ప్రవేశించే వ్యక్తుల సంఖ్య ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థికి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉండాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా, ఎఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రజలు , ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారి పై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో గత గ్రామపంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఈ మున్సిపాలిటీ ఎన్నికల కూడా ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ పరిశీలనలో స్థానిక అధికారులు మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సీ ఎస్సై నరేష్, ఎస్సైలు భాగ్య లక్ష్మి రెడ్డి, ఎస్ ఎం నవీద్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌ను ముఖ్యమంత్రికి కానుకగా ఇస్తాం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, 60 డివిజన్లలో 50కి పైగా స్థానాలు గెలుచుకొని కార్పొరేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కానుకగా ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రమే కాదని, మహబూబ్‌నగర్ భవిష్యత్తును నిర్దేశించే ఎన్నికలుగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందని, అందుకే రాబోయే మూడు సంవత్సరాలతో పాటు మరో ఐదు సంవత్సరాలు కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను రూ.603 కోట్ల రూపాయలతో నిర్మించేందుకు ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి శంకుస్థాపన చేయడం చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. అలాగే విజన్ 2047 ను లక్ష్యంగా పెట్టుకొని రూ.220 కోట్ల రూపాయలతో శాశ్వతంగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు కూడా ముఖ్యమంత్రి స్వయంగా శంకుస్థాపన చేయడం మహబూబ్‌నగర్ ప్రజల అదృష్టమని అన్నారు. విద్య, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి మహబూబ్‌నగర్‌కు ఐఐఐటీ కళాశాల కేటాయించడం ద్వారా ఈ ప్రాంతాన్ని విద్యా హబ్‌గా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, 600 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఈ కళాశాల కోసం తొలి దశలోనే రూ.200 కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించడం కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. నగరంలో 150కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, షెడ్లు, పార్కులు, వీధి లైటింగ్ వంటి అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, అడిగిన ప్రతిదీ మహబూబ్‌నగర్ ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం మాదని ఆయన అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎవరి జోక్యం ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ఈ ఎన్నికల్లో తప్పకుండా గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, ఎన్‌పి వెంకటేష్, సిరాజ్ ఖాద్రి, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, అమరేందర్ రాజు, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కలెక్టర్ పరిశీలన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దేవరకద్ర మున్సిపాలిటీలో జరుగుతున్న రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సాధారణ పరిశీలకులు కాత్యాయని దేవి, కలెక్టర్ విజయేందిర బోయి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రతా చర్యలు, నామినేషన్ల స్వీకరణ విధానాన్ని వారు నేరుగా పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలు చేయుటలో అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ద్వారా సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. నామినేషన్ దాఖాలుకు కావలసిన డాక్యుమెంట్‌లు చెక్ లిస్ట్‌ను ప్రదర్శించారు. అభ్యర్థులకు చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించి నామినేషన్ లు దాఖలు చేయాలని అన్నారు. నామినేషన్ స్వీకరణకు జనవరి 30వ తేదీ చివరి రోజు కావడంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో రద్దీ అధీకంగా ఉండే అవకాశం ఉంటే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎన్నికల సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రిటర్మింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్వయం ఉపాధిలో రాణించాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని జగన్ దర్బార్‌స్వీట్స్, కెఫ్‌ను గురువారం కల్వకుర్తి వ్యవసాయమార్కెట్‌కమిటి చైర్మన్ ఉమమనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, జియాగూడ యాదవసంఘం అధ్యక్షులు జక్కుల చిన్నజంగయ్యయాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో యువత స్వయం ఉపాధి నెలకొల్పుకొని రాణించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు చేయూతనందించడంతోపాటు ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. నిర్వాహకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిలోనిబావితండా సర్పంచ్ లక్ష్మి పతి, జక్కులరామయ్య, హరికృష్ణ ఉన్నారు.

# జాతీయరహదారి భూసేకరణ, నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలో 167జాతీయ రహదారి అవసరమైన చివరిదశలో ఉన్న కొల్లాపూర్ , నాగర్‌కర్నూల్‌పరిధిలో ఉన్న భూసేకరణకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో పురోగతిని, పరిహార చెల్లింపులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జాతీయరహదారి అధికారులు, రెవెన్యూ శాఖల అధికారులతో భూసేకరణ, నిర్మాణ పురోగతి పనులపై అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గపరిధిలో ఉన్న చివరిదశ భూసేకరణలో జాప్యం చేయకుండా మానవీయకోణంలో రైతులకు లాభాలు వివరించి, త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ప్రాంతాలవారిలో అవసరమైన భూసేకరణలో సమస్యల వివరాలను ఆర్‌డిఓలను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్‌డిఓలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. రెవెన్యూ జాతీయ రహదారి నిర్మాణ పనుల అధికారులు సమన్వయంతో పని చేసి రైతులతో మాట్లాడివారి ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భూసేకరణ నోటిఫికేషన్లు, పరిహారం, అవార్డుల ఖరారువంటి అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈసమావేశంలో ఆదిత్యధర్ త్రివేది, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ఆర్‌డిఓలు సురేష్, భన్సీలాల్, కలెక్టరేట్‌సెక్షన్ సూపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిసిలకు 56శాతం సీట్లివ్వాలి



## పార్టీలకు చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో జనాభాదామాషా ప్రకారం బిసిలకు 56శాతం స్థానాలు కేటాయించాలని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ వివిధ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల ద్రోహి పార్టీలుగా చిత్రీకరిస్తామని హెచ్చరించారు. ఆ పార్టీలకు బిసిలు ఓట్లు వేయొద్దని కూడా ప్రచారం చేస్తామని తెలిపారు. బిసిలు 56శాతం ఉన్నారని లెక్కలు చెప్పడం, 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీనివ్వడం తర్వాత ఇష్టానుసారంగా రిజర్వేషన్లు తగ్గించుకొంటూ బిసి సంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ కన్వీనర్ ఎస్.దుర్గయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల తరహాలో మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టిలను కలుపుకొని బిసిలు ముందుకెళ్లి, బహుజనవాదాన్ని గెలిపించాలని కోరారు. ప్రభుత్వం 21 బిసి కార్పొరేషన్లకు ఏడాదికి రూ. 2,800కోట్లు చొప్పున కేటాయించి, ఒక్క రూపాయి కూడా మంజూరు లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిసి నిధులు ఇరిగేషన్ ప్రాజెక్టుకు మళ్లించారని మండిపడ్డారు. బిసిల రిజ్వేషను పెంచేందుకు బిజెపి తీవ్ర నిర్లక్ష్యం చూపుతుందని విమర్శించారు. ఈ మూడు పార్టీలను మున్సిపల్ ఎన్నికల్లో బిసిలు బొందపెట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్లు బైరు శేఖర్, యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణ గౌడ్, శ్రీకాంత్, లింగేశ్ యాదవ్, దోమల రాజు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ద్వారా ఎరువులను కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/అమరచింత :** వ్యవసాయ శాఖ ఉత్తర్వుల మేరకు రైతులందరూ యూరియా యాప్ బుకింగ్ ద్వారా ఎరువులను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి అరవింద్ కోరారు. గురువాం అమరచింత మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంలో అధికారులు సందర్శించి దుకాణదారులకు యూరియాబ బుకింగ్ ద్వారానే రైతులకు ఎరువలను విక్రయించాలని సూచించారు. రైతులందరూ యూరియా ను డైరెక్ట్ గా యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని తమ కావలసిన ఎరువులను కొనుగోలు చేయాలని కోరారు. యాప్ ద్వారా ఎరువుల దుకాణాలలో ఉన్న ఎరువుల వివరాలను పూర్తిగా తెలుసుకోవచ్చని అధికారి తెలియజేశారు. రైతులందరూ పట్టా పాసు బుక్కు, మొబైల్ నెంబర్ సహాయంతో ఎరువులను బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

## గాజా సమస్య పరిష్కారంపై అమెరికాకు
# ఐక్యరాజ్యసమితిలో భారత్ ప్రశంస

**న్యూయార్క్ :** దీర్ఘకాలంగా పశ్చిమ ఆసియాలో హింసకు నిలయంగా మారిన గాజాలో యుద్ధం నివారించి శాంతి సాధనకు అమెరికా చేస్తున్న కృషిని ఐక్యరాజ్యసమితిలో భారతదేశం ప్రశంసించింది. ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి, దౌత్యవేత్త పర్వతనేని హరీశ్ బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. దీర్ఘకాలంగా జరుగుతున్న యుద్ధ పరిష్కారానికి భద్రతామండలి ఈ సమస్యపై చేసిన తీర్మానానికి అనుగుణంగా ఇటీవల కొనసాగుతున్న పురోగతి, అమలు చర్యలను ఆయన ప్రశంసించారు. ౨‘‘గాజాలో యుద్ధం ముగించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి చేసిన 2803 తీర్మానం ప్రకారం ఇటీవల కొనసాగుతున్న అమలు చర్యల పురోగతిని భారతదేశం పరిగణనలోకి తీసుకుంది, దీర్ఘకాలంగా ఉన్న ఈ అపరిష్కృత సమస్యను పరిష్కరించేందుకు అమెరికా చర్యను ప్రశంసించడానికి దీనిని అవకాశంగా భారత్ భావించింది’’ అని హరీశ్ పేర్కొన్నారు. పశ్చిమ ఆసియాపై భద్రతామండలిలో జరిగిన చర్చ సందర్భంగా హరీశ్ బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. 2025 నవంబరులో గాజా సమస్యపై భద్రతామండల 2803 తీర్మానం చేసింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గాజా సమస్య పరిష్కారానికి ప్రవేశపెట్టిన సమగ్ర ప్రణాళికను భద్రతామండలి ఆమోదించింది. గత ఏడాది సెప్టెంబరు 29వ తేదీన డోనాల్డ్ ట్రంప్ ఈ ప్రణాళికను ప్రతిపాదించారు. గాజాను ఉగ్రవాదుల నుండి విముక్తి చేయాలని ఆయన ప్రతిపాదించారు. పొరుగుదేశానికి గాజాలోని ఉగ్రవాదులవల్ల తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హరీశ్ భద్రతామండలిలో మాట్లాడుతూ, గాజాలో పునర్నిర్మాణం, ఆహార సరఫరా, మానవజీవన సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ అతిపెద్ద సవాలు అన్నారు. దీనికోసం ఎంతో గణనీయమైన మద్దతు ఉండాలని, అంతర్జాతీయ ప్రపంచం చిత్తశుద్ధితో సహాయం చేయాలన్నారు. అదేసమయంలో ఉగ్రవాదానికి కూడా గాజాలో ఎలాంటి స్థానం లేకుండా చూడాలని కోరారు.పౌర సమాజంలో ఉగ్రవాదం ఉండకూడదన్నారు.

## బంగారం రేట్లు పెరగడంతో..
# చైన్‌స్నాచింగ్‌లు, మర్డర్లు పుకార్లను నమ్మవద్దు : సిపి సజ్జనార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బంగారంతో బీ కేర్‌ఫుల్.. తులం లక్షన్నర దాటడంతో చైన్ స్నాచింగ్లు, హత్యలు జరుగుతున్నాయి.. అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. బంగారం రేట్లు పెరగడంతో చైన్ స్నాచింగ్లు విపరీతంగా పెరిగిపోయాయని, అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్లో మకాం వేశాయని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేశారు. దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ధృవీకరించని వార్తలను, భయపెట్టే పోస్టులను ఫార్వర్డ్ చేయకండని విజ్ఞప్తి చేశారు.

**సజ్జనార్ హెచ్చరిక..** భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితం.. శాంతి భద్రతల పరిరక్షణలో మాకు సహకరించండని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. నిశ్చింతగా ఉండండి. మీ భద్రతే మా బాధ్యత అని ట్వీట్లో పేర్కొన్నారు.

# మేడారం జాతర రవాణా ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడారం తరలివెళ్లుతున్న భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండ పటిష్ట ఏర్పాట్లను చేయాలని ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి అధికారులను అదేశించారు. మహా జాతర కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన ఆర్‌టసి ప్రయాణికులకు అందిస్తున్న సేవలను ఎండి గురువారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పల్ నుంచి మేడారం వెళ్లే దారిలో పలు ప్రధాన పాయింట్లను పర్యవేక్షించారు. మేడారం మహా జాతరకు వెళ్లే భక్తుల పిల్లల భద్రత కోసం ఉప్పల్ బస్టాప్, హన్మకొండ బస్టాండులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సురక్షిత కేంద్రాలలో పిల్లలకు గుర్తింపు ట్యాగ్లు వేస్తున్న విధానాన్ని పరిశీలించి ఎండి స్వయంగా పిల్లలకు ట్యాగ్లు వేశారు. ఈ సందర్భంగా మేడారం వెళ్లే సమయంలో పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ఈ సురక్షిత చర్యలు ఎంతగానో ఉపయోగపడగలవన్నారు. హన్మకొండ బస్టాండులో క్యూలైన్లను పరిశీలించి అక్కడ ప్రయాణికులతో మాట్లాడుతూ రవాణా సేవలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యవంతమైన రవాణా సేవలకై ఆర్‌టిసి తీసుకుంటున్న చర్యల పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డితో పాటు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయ భాను తదితర స అధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌పై
# యూరోపియన్ యూనియన్ ‘ఉగ్రముద్ర’

**స్ట్రాస్‌బర్గ్ :** ఇరాన్ సైనికదళం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జిసి)ను ఉగ్రవాద సంస్థగా నిర్ణయించేందుకు యూరోపియన్ యూనియన్ విదేశీ మంత్రులు అంగీకరించారు. యూరోపియన్ యూనియన్ కూటమి విదేశీ వ్యవహారాల మంత్రి కాజా కల్లాస్ గురువారం పొద్దుపోయాక ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. ఉగ్రవాదాన్నే రివల్యూషనరీ గార్డ్స్ తన విధానంగా ఎంచుకుందని ఆమె ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 15 మంది వ్యక్తులు, ఆరు సంస్థలు కూడా మానవ హక్కులను ఉల్లంఘించాయని పేర్కొంటూ వాటి మీద కూడా ఈ కూటమి ఆంక్షలు విధిస్తూ తీర్మానం చేసింది. గత ఏడాది డిసెంబరు 28 నుండి ఇప్పటివరకూ ఇరాన్‌లో జరుగుతున్న అల్లర్లను అణచివేయడంలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కీలకపాత్ర వహించారన్నది ప్రధాన అభియోగం. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ రాజ్యాన్ని స్థాపించి 1979నుండి 1989 వరకూ ఇరాన్ సర్వాధినేతగా కొనసాగిన రాజకీయ మత సిద్ధాంతవేత్త, మత గురువు రొహల్లా ఖమేనీ ఈ ఐఆర్‌జిసిని స్థాపించారు. ఈ ఇరానియన్ సైన్యమే ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ సమగ్రతను సంరక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. పాశ్చాత్య అనుకూల మానవ హక్కుల సంస్థలన్నీ ఇరాన్‌లో 36,000 మంది నిరసన ప్రదర్శకులను ఈ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఊచకోత కోశారని ఆరోపిస్తున్నాయి. ఇరాన్ ప్రభుత్వం మాత్రం అధికారికంగా దాదాపు నాలుగువేలమంది మరణించారని ప్రకటించింది. వీరిలో వందలమంది ప్రభుత్వ దళాలు, పోలీసులు కూడా ఉన్నారని తెలిపింది.

## టి–20 ప్రపంచకప్‌ను బాయ్‌కాట్ చేసేంత ధైర్యం పాకిస్థాన్‌కు లేదు..

**భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహనే**

టి–20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్ వైదొలగగా.. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కొత్త నాటకానికి తెరతీసింది. మా ప్రభుత్వం అనుమతిస్తేనే వరల్డ్‌కప్ ఆడతామంటూ పిసిబి చీఫ్ మొహ్సిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. అయితే.. పాక్ బోర్డు బాయ్‌కాట్ వార్తలను భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహనే ఖండించాడు. పాక్ బోర్డు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోందని, వరల్డ్‌కప్ బాయ్‌కాట్ చేసేంత దమ్ము, ధైర్యం ఆ దేశానికి లేదని రహనే అన్నాడు. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ పిసిబి బెదిరింపులను టీమిండియా మాజీ ఆటగాడు అజింక్యా రహనే కొట్టిపారేశాడు. గురువారం క్రిక్‌బజ్‌తో మాట్లాడిన అతడు 'పాకిస్తాన్ జట్టు వరల్డ్‌కప్ బాయ్‌కాట్ చేస్తుందని నేను అనుకోవడం లేదు. మెగా టోర్నీ నుంచి వైదొలిగేంత దమ్ము, ధైర్యం ఆ దేశ బోర్డుకు లేవు. ఇప్పటికే షెడ్యూల్ ఖరారు వ్వడంతో పాటు ఒప్పందం ప్రకారం ఆ జట్టు మ్యాచులన్నీ శ్రీలంకలోనే ఉన్నాయి. సో.. బాయ్‌కాట్‌కు సిద్ధపడుతుందని నేను భావించను. అన్ని జట్లలానే పాక్ కూడా వరల్డ్‌కప్ కోసం వస్తుంది' అని పేర్కొన్నాడు. ఒకప్పుడు టీమిండియాలో కీలక ఆటగాడైన రహనే ప్రస్తుతం దేశవాళీ క్రికెట్, ఐపిఎల్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు.







## జింఖానాలో చెలరేగిన సిరాజ్..

**ఓపెనర్ల జోరుతో పటిష్ఠ స్థితిలో హైదరాబాద్ !**

టీమిండియా పేసర్ సిరాజ్ దేశవాళీ క్రికెట్‌లో చెలరేగిపోయాడు. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ డి మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ బ్యాటర్లను వణికిస్తూ వికెట్ల వేటతో హైదరాబాద్‌కు బ్రేకిచ్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు(456) తీసి ప్రత్యర్థిని ఆలౌట్ చేయడంలో కీలకపాత్ర పోషించాడు మియా భాయ్. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ వికెట్ పడకుండా 56 పరుగులు చేసింది. రంజీ ట్రోఫీలో భాగంగా ఎలైట్ డీలోని ఛత్తీస్‌గఢ్ జరిగిన మ్యాచ్‌లో సిరాజ్ రెచ్చిపోయాడు. జింఖానా మైదానంలో తన తడాఖా చూపిస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించాడు సిరాజ్. ఓపెనర్ అనుజ్ తివారీ(4)ను ఔట్‌చేసి బ్రేకిచ్చిన సిరాజ్.. ఆ తర్వాత సంజీత్ దేశాయ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ప్రతీక్ యాదవ్(106)తో కలిసి జట్టును ఆదుకున్న వికల్ప్ తివారీ(94)ని సైతం వెనక్కి పంపిన అతడు.. టెయిలెండర్ ఆదిత్య సర్వాతే(4)ను సైతం నాలుగో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. సిటిఎల్ రక్షణ్(22–8) రెండు వికెట్లతో రాణించ గా ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 283 కే ఆలౌటయ్యింది. ప్రతీక్ సెంచరీ, వికల్ప్ అర్ధ శతకంతో భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లిన ఛత్తీస్‌గఢ్ మూడొందలలోపే కట్టడి చేసిన బౌలర్ల కృషిని బ్యాటర్లు వృథా కానివ్వలేదు. ఓపెనర్లు అమన్‌రావు పెరాల(32 నాటౌట్), అభిరత్‌రెడ్డి(23 నాటౌట్)లు అదిరే ఆరంభమిచ్చారు. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 56 రన్స్ చేసింది.

## డబ్ల్యుపిఎల్ ఫైనల్‌లో ఆర్‌సిబి

**చితకొట్టిన హ్యారీస్, మంధాన**




మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్‌సిబి రెండు ఓటముల నుంచి తేరుకొని యుపి వారియర్స్‌పై పంజా విసిరింది. 149 పరుగుల ఛేదనలో ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(75) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. స్మృతి మంధాన(54నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌లో అదరగొట్టింది. దాంతో, 8 వికెట్ల తేడాతో గెలుపొందిన బెంగళూరు 12 పాయింట్లతో నాలుగో సీజన్ ఫైనల్లో అడుగుపెట్టింది. డబ్ల్యుపిఎల్ మూడో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. నాలుగో సీజన్‌లో వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్‌సిబి .. లీగ్ దశ చివరి పోరులోనూ చెలరేగింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొడుతూ యుపి వారియర్స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 149 పరగుల మోస్తరు ఛేదనలో గ్రేస్ హ్యారిస్(75), స్మృతి మంధాన(54 నాటౌట్)ల విధ్వంసంతో యుపి బౌలర్లు నీరుగారిపోయారు. హ్యారిస్ ఔటయ్యాక మరింత జోరు పెంచిన మంధాన.. శోభన ఓవర్లో భారీ సిక్సర్ బాదిన మంధాన.. సింగిల్ తీసి 26 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకుంది. విజయానికి 9 పరుగుల దూరంలో జార్జియా వోల్(16) బంతిని అంచనా వేయలేక సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత వచ్చిన రీచా ఘోష్(0 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేసింది కెప్టెన్. 13.1 ఓవర్లోనే ఛేదించి యుపికి దిమ్మతిరిగే షాకిచ్చిన బెంగళురు 12 పాయింట్లతో ఫైనల్ బెర్తు పట్టేసింది.

**డీ క్లెర్క్ దెబ్బకొట్టింది**

ప్లే ఆఫ్స్ చేరాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో యుపి వారియర్స్ ఓపెనర్లు శుభారంభమిచ్చారు. పవర్ ప్లేలోనే వికెట్లు తీసి ఒత్తిడి పెంచే లారెన్ బెల్‌ను దీటుగా ఎదుర్కొన్న మేగ్ లానింగ్(41), దీప్తి శర్మ(55)లు ధనాధన్ ఆడారు. తొలి వికెట్కు 74 రన్స్ జోడించి భారీ స్కోర్కు బాటలు వేసిన ఈ ద్వయాన్ని నడినే డీ క్లెర్క్ (4 22) విడదీసిది. డేంజరస్ లానింగ్‌ను పెవిలియన్ పంపిన తను.. అమీ జోన్స్(1)ను ఔట్ చేసి మరో బ్రేకిచ్చింది. ఆ తర్వాత వచ్చినవాళ్లే వరూ క్రీజులో నిలువలేదు. అర్ధ శతకంతో యూపీ స్కోర్ 130 దాటించిన దీప్తిని శ్రేయాంక పాటిల్ వెనక్కి పంపింది. ఆ తర్వాత పరుగుల చేసేవారు కరువవ్వడంతో యూపీ నిర్ణీత ఓవర్లలో 148కే పరిమితమైంది.

# ఎముకల క్షీణత సాధారణం..






వయసుతోపాటు పెరిగే ఆరోగ్య సమస్యలు..వయసు పెరిగేకొద్దీ ఎన్నో ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. అప్పటి వరకూ 'ఆరోగ్యానికి పర్యాయపదం నేనే' అనుకుంటూ తిరిగిన వారు కూడా క్రమంగా ఏదో ఒక రుగ్మత బారిన పడడం మొదలవుతుంది. కొందరిని 40 లేదా 45 ఏళ్ల లోనే అనారోగ్యం పలకరిస్తుంది. మరికొందరు 50 లేదా 60 ఏళ్లు దాటిన తర్వాత ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవచ్చు. వయసు తేడా తప్ప, పెరిగే వయసులో శరీరం శిథిలం కావడం ప్రారంభమవుతుందనేది చేది నిజం. అలాంటి రుగ్మతల్లో మొదటగా ప్రస్తావించాల్సిన అంశం ఎముకల క్షీణత. యవ్వనంలో తెలియకుండా తిరిగేస్తాంగానీ ఒక వయసుకు వచ్చేసరికి ఎముక క్షీణత ఎక్కువగా ఉంటుంది. 4550 ఏళ్లు దాటిన వారిలో ఎముకలు ఎండుపుల్లల్లా పెళుసుగా, బోలుగా తయారవ్వటమన్నది చాలా ఎక్కువ. ఈ ముప్పు స్త్రీలలో మరీ ఎక్కువ. దీనివల్ల చీటికీమాటికీ పడిపోవటం, ఏ చిన్న దెబ్బ తగిలినా ఎముకలు విరిగిపోవటం చాలా తరచుగా చూస్తుంటాం. పైగా ఒకసారి విరిగితే వీరిలో అంత త్వరగా అతకవు కూడా. దీంతో మొత్తానికి కదలికలు తగ్గిపోవటం, తన పని తాను చేసుకునే పరిస్థితి కూడా లేకపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఎముక సాంద్రత తగ్గటం వల్ల వెన్నుపూసలు విరిగిపోవటం కూడా వీరిలో ఎక్కువే. అసలీ ఎముక బోలు సమస్య (ఆస్టియోపొరోసిస్) వృద్ధాప్యంలో చాలా సహజమని అంతా నమ్ముతుంటారుగానీ ఇది నిజం కాదు. ముందు నుంచీ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీని బారిన పడాల్సిన అసరమే లేదు. పొగ తాగకుండా ఉండటం, క్యాల్షియం అధికంగా ఉండే పదార్థాలు ఎక్కువగా తీసుకోవటంఅవసరం. మన జీవక్రియలకు తగినంత క్యాల్షియం అవసరం. మన ఆహారంలో క్యాల్షియం తగినంత లేకపోతే మన శరీరం దాన్ని ఎముకల నుంచి వెనక్కి తెచ్చుకుంటుంది. దీంతో ఎముకలు బలహీనపడతాయి. అలాగే కడుపులో బిడ్డ ఎదిగేటప్పుడు, బిడ్డకు పాలిచ్చే తల్లుల శరీరం నుంచి చాలా క్యాల్షియం బిడ్డకు వెళ్లిపోతుంది. దీంతో స్త్రీలు ఆస్టియోపొరోసిస్ బారినపడే అవకాశాలు చాలా ఎక్కువ. కాబట్టి క్యాల్షియం ఎక్కువగా ఉండే పాల పదార్థాలు, ఆకుకూరలు, సోయా, గోబీ, చేపల వంటివి తీసుకోవాలి. ఈ తీసుకున్న క్యాల్షియం ఎముకలకు పట్టేందుకు వ్యాయామం చెయ్యటం కూడా అవసరం. అలాగే కాస్త ఎండలో తిరిగితే విటమిన్‌డి దక్కుతుంది, ఎముక బలానికి ఇదీ ముఖ్యమే. ఒక వయసు రాగానే అందరూ వైద్యులను సంప్రదించి ఎముక సాంద్రత పరీక్ష చేయించుకుని, ఆస్టియోపొరోసిస్ ఉంటే తగు జాగ్రత్తలు, చికిత్స తీసుకోవటం అవసరం. అలాగే బాత్రూముల్లో పడిపోకుండా నేల నునుపుగా జారిపోయేలా లేకుండా చూసుకోవటం, ఇంట్లో నడిచేటప్పుడు పరిస్థితిని బట్టి నాలుగుకోళ్ల కర్ర సాయం తీసుకోవటం, తల తిప్పు, తూలు రావటం వంటి లక్షణాలు కనబడుతుంటే తక్షణం వైద్యులకు చూపించుకుని, చికిత్స తీసుకోవటం కూడా చాలా అవసరం.

# ఆటిజంలోనూ ప్రేమ, సంరక్షణ..






ఆటిజం ఉన్న వ్యక్తులు తల్లిదండ్రులు కాలేరనే అపోహ ఇప్పటికీ చాలా సమాజాల్లో ఉంది. కానీ వాస్తవం ఏమిటంటే, ప్రేమ, సంరక్షణ, బాధ్యత అనే గుణాలు ఎలాంటి నాడీ భేదాలకూ పరిమితమవ్వవు. ఈ సత్యాన్ని నిశ్శబ్దంగా కానీ బలంగా నిరూపించే అనేక కుటుంబాల్లో ఒకటి, ఇటీవల తమ జీవితంలో కొత్త వెలుగును ఆహ్వానించిన ఒక ఆటిజం ఉన్న దంపతుల కుటుంబం. తమ బిడ్డను తొలిసారి చేతుల్లోకి తీసుకున్న ఆ క్షణంలో, ఆ తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం ఇతర తల్లిదండ్రుల ఆనందంతో ఏ మాత్రం భిన్నంగా లేదు. భయం, బాధ్యత, ఆశ, కలలు వంటి అనుభూతులన్నీ ఒకే సమయంలో వారి మనసుల్లో మెదిలాయి. మన బిడ్డ ఆరోగ్యంగా ఉంది అన్న సంతోషమే వారికి అన్నిటికంటే గొప్పది. సమాజం ఏ ముద్ర వేసినా, తాము తమ బిడ్డకు సంపూర్ణమైన ప్రేమ ఇవ్వగలమనే నమ్మకం వారికి బలంగా ఉంది. ఆటిజం ఉన్న తల్లిదండ్రులు జీవితాన్ని కొంచెం భిన్నంగా చూస్తారు. వారు వివరాలపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు, బాధ్యతను లోతుగా అర్థం చేసుకుంటారు, నిర్ణయాలను ఆలోచించి తీసుకుంటారు. ఈ లక్షణాలే వారిని మంచి తల్లిదండ్రులుగా మార్చుతాయి. పిల్లల పెంపకం అనేది పరిపూర్ణత కాదు, నిరంతర శ్రద్ధ, నేర్చుకోవడం, అంగీకారం వంటి అంశాలే ముఖ్యమని వారు నమ్ముతారు. తమ బిడ్డ భవిష్యత్తు గురించి అడిగినప్పుడు, 'మా బిడ్డ ఎలా ఎదిగినా, ఏ మార్గాన్ని ఎంచుకున్నా, మా ప్రేమ ఎప్పటికీ మారదు' అని ఆ తల్లిదండ్రులు ఒకే మాట చెప్పారు. ఈ మాటల్లో ఒక గొప్ప జీవన తత్వం దాగుంది. పిల్లలను తమ అంచనాలకు సరిపోల్చడం కాదు, వారు తమ స్వంత వ్యక్తిత్వంతో ఎదగడానికి అవకాశం ఇవ్వడమే నిజమైన తల్లిదండ్రత్వం. ఆటిజం గురించి సమాజంలో ఉన్న అపోహలు ఇంకా చాలానే ఉన్నాయి. కానీ ఈ కుటుంబంలాంటి ఉదాహరణలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. ఆటిజం అనేది లోపం కాదు, అది ఒక భిన్నమైన నాడీ నిర్మాణం మాత్రమే. అది మానవత్వాన్ని తగ్గించదు, ప్రేమించగల శక్తిని హరించదు, బాధ్యత తీసుకునే సామర్థ్యాన్ని నశింపజేయదు. ఈ కథ మనకు ఒక ప్రేరణను ఇస్తుంది. మనం వ్యక్తులను వారి వైద్య పదాలతో కాదు, వారి మానవ గుణాలతో కొలవాలని. తల్లిదండ్రత్వం అనేది సాధారణం అనే నిర్వచనానికి లోబడి ఉండాల్సిన అవసరం లేదని. ప్రేమ ఉన్న చోట, శ్రద్ధ ఉన్న చోట, అంగీకారం ఉన్న చోట కుటుంబం వికసిస్తుందని అర్థం చేసుకోవాలని ఈ ఘటన మనకు పాఠం చెప్తుంది.

## విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు : ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థిలోకం పోరాటాలు చేయాలని ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి వరక అజిత్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్ అధ్యక్షతన జరిగిన ఎఐఎస్ఎఫ్ పట్టణ మహాసభ విజయవంతమైంది. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ నానాటికీ విద్యావ్యాపారం పెరిగిపోతోందని, ప్రభుత్వంలోని పెద్దలే విద్యా వ్యాపారానికి పునాదులు వేస్తున్నారని, వారే కార్పొరేట్ విద్యాలయాలకు అధిపతులుగా, ప్రైవేటు యూనివర్సిటీలకు యజమానులుగా ఉన్నారని మండిపడ్డారు. దీంతో పేద విద్యార్థులకు శాస్త్రీయమైన చదువు అందని ద్రాక్షలా మారిందని, చదువులు కొనలేక అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పి బతుకు తెరువు కోసం పనిబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఏకం కావాలని, ప్రభుత్వాలు అవలంభిస్తున్న ధ్వంద విధానాలను నిలదీయాలని కోరారు. విద్యారంగ, కళాశాల సమస్యల పరిష్కారం కోసం ఎఐఎస్ఎఫ్ ముందుండి పోరాడుతుందని, అందుకు అంతా చేయి కలపాలన్నారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వీసంపల్లి హేమంత్, సాధనపల్లి మనోజ్‌తో పాటు 13 మందితో నూతన కమిటీ ఎంపికైంది. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి దుర్గం వరుణ్ ఉపాధ్యక్షులు గుర్రం అనిష్, మండల సమితి సభ్యులు సాధనపల్లి అవినాష్, సాధనపల్లి చరణ్, గుగ్గిళ్ల సంజయ్, కర్ర శివ కేశవ, నవీన్ మహేష్, కళ్యాణ్, వంశీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమిస్తాం : లక్ష్మణ్




**ప్రజాపక్షం/చింతకాని :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గురువారం చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తిసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. యూనివర్శిటీలను మూడు నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ చేస్తుందన్నారు. యూనివర్శిటీల్లో ఆరెఎస్ఎస్ భావాలు ఉన్నవారినే నియమిస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను సాయుధ పోరాట వాస్తవాలను బిజెపి వక్రీకరిస్తుందన్నారు. అనంతరం 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, నవీన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులకు ఎఐటియుసి అండ

**పల్లా దేవేందర్‌రెడ్డి**




**ప్రజాపక్షం/దేవరకొండ :** కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. గురువారం ఎఐటియుసి–2026 నూతన డైరీని దేవరకొండలో ఆవిష్కరించి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏర్పడ్డ మొట్ట మొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అన్నారు. నాటి నుండి నేటి వరకు కార్మికుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతుందన్నారు. కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చివేసి పెట్టుబడి దారులకు కొమ్ము కాసే విధంగా లేబర్ కోడ్‌లను తీసుకొని రావడం విచారకరమన్నారు. కొత్త లేబర్ చట్టాలతో సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, కనీస వేతనాల కోసం పోరాడే హక్కులను హరించివేశారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు మరింత తీవ్రతరం చేయాలని ఆయన కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు సమూలంగా మార్చివేస్తూ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ల చేతుల్లో పెడుతుందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం కార్మిక లోకం పోరాటాలు మరింత తీవ్రతరం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బిజెపి పాలనలో కార్మికులు ఉపాధి కోల్పోయి దేశంలో నిరుద్యోగం మరింత పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ కోశాధికారి వెంకటరాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లయ్య, వెంకటయ్య, నాయకులు మైనోద్దిన్, హరి, సైదులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదు

**ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్**

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గురువారం సంఘం జిల్లా అధ్యక్షురాలు వనమాల అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసచారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 4 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకే పంపేలా ప్రభుత్వం జిఒ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలోజిల్లా ఉపాధ్యక్షుడు బుక్కా రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయంతిమాల, అనిత పాల్గొన్నారు.



# సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు





**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మునిసిపాలిటీలో కాంగ్రెస్, సిపిఎం పార్టీలు బలపర్చిన 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా సిపిఐ అభ్యర్థి తిరునాటి సంజయ్ గురువారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సయ్యద్ సలీం ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సలీం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కార్మికులు, కర్షకులు పేద మధ్య తరగతి ప్రజల కోసం సిపిఐ నిరంతరం శ్రమించి పోరాడిందన్నారు. పట్టణంలోని ఇళ్ళ స్థలాలు లేని వేలాది మంది ప్రజలకు ఇంటి జాగా కల్పించిన పార్టీ సిపిఐ అన్నారు. పట్టణంలో పెద్దఎత్తున ప్రజల మద్దతు కూడగట్టి పొత్తుల్లో ఉన్న పార్టీల విజయం కోసం సిపిఐ కృషి చేస్తుందన్నారు. 19వ వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసిన సిపిఐ అభ్యర్థి విజయానికి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షులు పఠాన్‌జలాల్, పార్టీ శ్రేణులు, విజయ్‌కాంత్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**చౌటుప్పల్ :** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్‌లో పలు వార్డులకు గురువారం సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 20వ వార్డు అభ్యర్థిగా ఉడుత రామలింగం, 4వ వార్డు అభ్యర్థిగా దాసరి కృష్ణ, 16వ వార్డు అభ్యర్థిగా బద్దుల సుధాకర్ నామినేషన్‌లు దాఖలు చేశారు. సిపిఐ అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారుల ఎదుట నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగుతున్నామని నామినేషన్ల సందర్భంగా సిపిఐ నేతలు తెలిపారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత, పేద ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీకి రెండవ వార్డు నుండి సిపిఐ అభ్యర్థిగా పెరిక మల్లమ్మ గురువారం పార్టీ నాయకులతో కలిసి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ వార్డు కౌన్సిలర్ సిపిఐ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సహకారంతో వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మండల కార్యవర్గ సభ్యుడు దోటి వెంకన్న, సిపిఐ చండూరు పట్టణ కార్యదర్శి దోటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 11వవార్డు సిపిఐ అభ్యర్థిగా దారదాసు సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జీ పులిజాల పరుషరాంతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి గురువారం నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దారదాసు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న సిపిఐకి వార్డుప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగుతున్నామని నామినేషన్ల సందర్భంగా సిపిఐ నేతలు తెలిపారు.







# పూర్తయిన పనులు ప్రారంభించండి

## గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గురువారం మేయర్ అధ్యక్షతన స్థాయీసంఘం సమావేశం జరిగింది. ఈసమావేశంలో 44అంశాలకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. మొత్తం 44 ఎజెండా అంశాలు (21ప్రధాన ఎజెండా, 23 సప్లిమెంటరీ) చర్చకు రాగా, వాటన్నింటికీ ఆమోదం లభించింది. వీటితో పాటు 8 ఐటమ్స్‌ను ప్రవేశపెట్టగా, అందులో 6 అంశాలకు కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో రెండు కీలక అంశాలను తుది నిర్ణయం కోసం కౌన్సిల్ ఆమోదానికి సిఫార్సు చేసింది. ఈ సందర్భంగా మేయర్ అధికారులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా ఆహ్వానించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్త ప్రాజెక్టులకు సంబంధించి పాలనాపరమైన అనుమతులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్, స్థాయీసంఘం సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### స్థాయీసంఘంలో ఆమోదం పొందిన ప్రతిపాదనలు..

- సనత్ నగర్, ఫతేనగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ నెట్‌వర్క్ పనులు, మౌలాలి ఆర్‌ఓబి పునరుద్ధరణ, ఉస్మాన్ గంజ్‌కిషన్ గంజ్ నాలా రీమోడలింగ్ పనులకు అనుమతి.
- సిఆర్ఎంపి ఫేజ్2 పనులు, బైరమల్‌గూడఒవైసీ జంక్షన్ 6 లేన్‌ల ఫ్లైఓవర్, ఎన్‌ఎఫ్‌సిఎల్ జంక్షన్ వద్ద వన్‌వే ఫ్లైఓవర్, టివి9 జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు లభించాయి.
- నగరవ్యాప్తంగా ఎటిఎస్‌సి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ నిర్వహణ పొడిగింపు, కొత్త హెచ్ఆర్ఎం (పేరోల్, పెన్షన్) అప్లికేషన్ అభివృద్ధి, సిబ్బందికి ఫేస్ రికగ్నిషన్ బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయనున్నారు.
- సిఎస్ఆర్ ద్వారా పార్కుల నిర్వహణ, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్‌తో ఒప్పందాల పొడిగింపునకు ఆమోదం తెలిపారు.
- ఉద్యోగులకు ఊరటనిస్తూ డియర్నెస్ అలవెన్స్ (డిఎ)ను 30.03 శాతం నుండి 33.67 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.
- సమావేశంలో కొన్ని ఆసక్తికర ప్రతిపాదనలు కౌన్సిల్‌కు సిఫార్సు..
- బర్కత్‌పురా జంక్షన్‌లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయి విగ్రహ ఏర్పాటు.
- బతుకమ్మకుంట పార్కుకు 'వి. హనుమంతరావు బతుకమ్మ కుంట'గా పేరు మార్పు.
- బైరమల్‌గూడ ఫ్లైఓవర్ సమీప రోడ్డుకు వంగా మధుసూదన్‌రెడ్డి పేరు.

# అంతర్జాతీయ ఆధిపత్య కేంద్రం

## ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు, ఎండి జుర్గెన్ వెస్టర్మీర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 2035 నాటికి భారత విమానాల సముదాయం 2,250కి చేరుకుంటుందని.. ఎంఆర్‌ఓ మార్కెట్ 9.5 బిలియన్ యూఎస్ డాలర్లకు చేరుతుందని... ఇది రాబోయేకాలంలో అంతర్జాతీయ రవాణా ఆధిపత్య కేంద్రంగా మారుస్తుందని ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు, ఎండీ జుర్గెన్ వెస్టర్మీర్ అన్నారు. విమానాల విస్తరణ ద్వారా ప్రయాణీకుల రద్దీ ఏటా 8.9 శాతం పెరుగుతుందని.. 2035 నాటికి భారతదేశానికి 35,000 పైలట్లు, 34,000 సాంకేతిక నిపుణు అవసరం ఉంటుందన్నారు. ఈ మేరకు బేగంపేట్‌లో వింగ్స్ ఇండియా ఎయిర్ షో సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భారతదేశం 2035 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద పౌర విమానయాన మార్కెట్‌గా ఎదుతున్నందున.. రాబోయే దశాబ్దంలో భారతదేశ వాణిజ్య విమానాల సముదాయం మూడు రెట్లు పెరుగుతుందని... ఈ పెరుగుదల ప్రపంచ విమానయాన చరిత్రలో అత్యంత దూకుడు విస్తరణలలో ఒకటిగా గుర్తించడం జరిగిందంటూ వివరించారు.

జి–20 దేశాలలో అత్యంత వేగవంతమైన ఆర్థిక వృద్ధి, మౌలిక సదుపాయాలపై లోతైన ప్రభుత్వ ఖర్చు, తలసరితో భారతీయ వినియోగదారుల్లో ప్రాథమిక మార్పు ద్వారా విమానాల అవసరం పెరుగుతుందన్నారు. భారతదేశ విమానాల విస్తరణ దేశీయ మార్కెట్‌ను పెంచడమే కాకుండా దేశాన్ని అంతర్జాతీయ రవాణాకు ఆధిపత్య కేంద్రంగా ఉంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా వింగ్స్ ఇండియా 2026లో భాగంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఢిల్లీ, బెంగళూర్, లఖ్‌నవ్ ఎయిర్‌పోర్ట్‌లకు అవార్డులను అందజేశారు. కార్గో సర్వీసుల్లో ఉత్తమ అవార్డులను ఎయిరిండియా సొంతం చేసుకుంది. కాగా సందర్శకుల కోసం ఈనెల 30,31 తేదీలలో రెండు రోజుల పాటు అవకాశం కల్పిస్తున్నారు.

# నన్ను సస్పెండ్ చేయలేదు

## ఎమ్మెల్యే దానం నాగేందర్

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** బిఆర్ఎస్ నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు.. బిఆర్ఎస్ స్పందన ప్రకారమే నా ప్రతిస్పందన ఉంటుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. అనర్హత వ్యవహారంలో స్పీకర్ నోటీసులపై దానం నాగేందర్ స్పందిస్తూ... నోటీసులకు వివరణ ఇస్తూ తమ అడ్వకేట్ లేఖ రాశారని.. అడ్వకేట్ ఢిల్లీలో ఉన్నారని.. ఆయన ఏమి సమాధానం ఇచ్చారో తెలియదన్నారు. అయితే స్పీకర్ నుంచి తిరిగి జవాబు రాలేదన్నారు. ఈ మేరకు ఆయన బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ.. స్పీకర్‌ను కలవాల్సి ఉన్నందున.. సబ్ జుడీషియర్ అవుతున్నందున తాను ఏమీ చెప్పలేకపోతున్నట్లు తెలిపారు. మీరు ఏ పార్టీ ఎమ్మెల్యే? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తే ఆయన నవ్వుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే అంటూ స్పందించారు. అనర్హత వేటు పడుతున్నందుకే మీరు తప్పించుకునేలా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయని ప్రశ్నిస్తే.. ఆయన స్పందిస్తూ.. ఎన్నికలంటే నేనేమీ భయపడనన్నారు.

# నిబంధనలకు లోబడి ఎన్నికల ప్రక్రియ

## అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎన్నికల నిబంధనలకు లోబడి ఎన్నికల నియమావళి ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రంతోపాటు హెల్ప్ డెస్క్‌లను పరిశీలించి ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. నామినేషన్ పత్రాలు తీసుకువెళ్ళి వారి వివరాలను రికార్డుల్లో నమోదు చేయడంతోపాటు అభ్యర్థులకు ఎన్నికల నిబ్బంధనలను వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా కృషి చేయాల్సిన బాధ్యత స్థానిక ఎన్నికల అధికారిపై ఉంటుందని వివరించారు. నామినేషన్ల నుండి మొదలుకొని నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ ఎన్నికలు అధికారులు అన్ని విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు వేసే నామినేషన్ పత్రాలను క్లుప్తంగా పరిశీలించి తీసుకోవాలని, అభ్యర్థులకు మద్దతు ఇచ్చే వారి ఓటర్ జాబితాను పరిశీలించి తీసుకోవాలని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ అధికారులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల అథారిటి అధికారి సునీతారెడ్డి, ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ తోపాటు ఎన్నికల అధికారులు ఉన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు చర్యలు

## రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయడం జరిగినదని, ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, ఈ కంట్రోల్ రూంలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, పిర్యాదులను రికార్డ్ చేస్తూ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు మున్సిపల్ ఎన్నికలు 2026కు సంబంధించి ఫిర్యాదులకై ఈ టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి తన ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంద ఆమన్ గల్ కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 9032305567 అదేవిధంగా చేవెళ్ళ కంట్రోల్ రూం నెంబర్ 94933 21468 ఇబ్రహీంపట్నం కంట్రోల్ రూమ్ నెంబర్ అదేవిధంగా 9032123653,మొయినాబాద్ కంట్రోల్ రూమ్ నెంబర్ 7661097839 షాద్ నగర్ కంట్రోల్ రూమ్ నెంబర్ :9182403236 శంకర్ పల్లి కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ ప్రతి ఒక్కరు సద్విని చూసుకోవాల్సిందిగా కలెక్టర్ సి నారాయణరెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు.

# పడిపూజలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హస్తినాపురం డివిజన్‌లోని దేవినగర్‌లో గురువారం శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమంలో అందోజు సత్యంచారితో కలిసి ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాములు పన్నెండు మెట్ల పూజ నిర్వహించి భజనలు చేశారు. అనంతరం పన్నెండు మెట్లపై పన్నెండు కర్పూరాలు పెట్టి పడి కాల్చారు. పలు ప్రాంతాల నుంచి శివస్వాములు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో స్వాములు గోపి, మధు అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీలో భూములు ఇవ్వని రైతుల సమస్యలు పరిష్కరిస్తా

## ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. గురువారం ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతులు ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకులతో కలిసి తోర్రూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలిసి తమ బాధలను వివరించారు. ప్రభుత్వం ఫార్మాసిటీ విషయంలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరిస్తుందని రైతులు తెలిపారు. భూ సేకరణకు సంబంధించిన అవార్డులను కూడా కోర్టు రద్దు చేసిందన్నారు.హైకోర్టు ఉత్తర్వులన్ని రైతులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసి బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే సహిచేది లేదని హెచ్చరించారు. కోర్టు ఇచ్చిన అర్డర్ కాఫీలను ఎమ్మెల్యేకు అందజేశారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం జిల్లా కలెక్టర్, అర్డిఒతోలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫార్మా ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి,కానమోని గణేశ్, అనసూయ, వినోద్ తోబాటు నాలుగు గ్రామాల రైతులు పాల్గోన్నారు.

**తుర్కయంజాల్:** ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిబట్ల సర్కిల్ తుర్కయంజాల్ పరిధి రాగన్నగూడాలో మహారుద్ర సహస్ర చండీ యాగం శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం మెళ్ళూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన యాగశాలలో మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డితో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

# పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

## నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఇంటిని విక్రయించిన ఘనుడు

## పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు, పంచాయతీ కార్యదర్శి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేయడంతోపాటు నకిలీ డాక్యుమెంట్‌ను సృష్టించి ఓ ఇల్లును విక్రయించిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. షాద్‌నగర్ పట్టణానికి చెందిన మండ్ల సుధాకర్ అనే వ్యక్తి హాజీపల్లి శివారు గండ్లకుంట ఓ ఇల్లును కొనుగోలు చేసేందుకు హాజిపల్లి గ్రామానికి చెందిన కుర్మయ్య వద్ద రూ.42లక్షలకు ధర కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.5లక్షలు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. సదరు నగదు చెల్లించేందుకు ఆ ఇంటికి సంబంధించిన పత్రాల కోసం ఫరూఖ్‌నగర్ సబ్‌రిజిస్ట్రేషన్‌కు వెళ్ళి తీసుకున్నట్లు తెలిపారు. ఆ పత్రాలను లోను తీసుకునేందుకు బ్యాంక్ వద్దకు వెళ్ళి ఈ ఇంటికి సంబంధించిన పత్రాలు నకిలీ సంతకాలతో కూడి ఉన్నాయని తేల్చి లోను నిలిపి వేసినట్లు బాధితుడు తెలిపారు. ఇంటి కొనుగోలు కోసం అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.5లక్షలు తిరిగి ఇవ్వాలని ఇంటి యాజమాని కుర్మయ్యను కోరగా ఇదిగో ఇస్తాం..అదిగో ఇస్తాం అంటూ కాలయాపన చేస్తూ వచ్చినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు. అందలోనే ఇంటి యాజమాని ఇంటి వ్యాల్యూవేషన్ సర్టిఫికెట్ తీసుకునే క్రమంలో గ్రామ కారోబార్‌తో కుమ్మక్కై పంచాయతీ కార్యదర్శి సంతకం పోర్జరీ చేయడంతోపాటు నకిలీ స్టాంప్‌లను దృష్టించి సర్టిఫికెట్ తీసుకున్నట్లు తెలిపారు. దాంతో ఫరూఖ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ పత్రాలను పరిశీలించకుండానే ఏకంగా ఇంటిని వడ్ల మాధవి భర్త రాఘవేందర్‌కు యాజమాని కుర్మయ్య రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితువు సుధాకర్ వివరించారు. తనకు అన్యాయం చేయడమే కాకుండా పోర్జరీ సంతకాలు సృష్టించి మోసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు.

### బాధితుడి ఫిర్యాదుపై విచారణ చేస్తున్నాం

### షాద్‌నగక్ ఎస్ఐ శ్రీకాంత్

ఇంటిని కొనుగోలు చేయడంతో మోసం జరిగిందంటూ బాధితుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని, త్వరలోనే నింధితులను పట్టుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంతకాలను పోర్జరీ చేయడం చట్టరీత్య నేరమని, ఇందుకు పాల్పడిన వ్యక్తులను పట్టుకుంటామని వివరించారు. ఇందులో ఎవరేవరి ప్రమేయం ఎంతమేరకు ఉందనే విషయాలపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


### అధికారుల సంతకాలు ఫోర్జరీ సరికాదు

### ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ బన్సీలాల్

ప్రభుత్వ ఉద్యోగుల సంతాలను ఫోర్జరీ చేయడం సరైన పద్ధతి కాదని, పోలీసుల విచారణలో అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ బన్సీలాల్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంతకం పోర్జరీ చేశారనే విషయం తన దృష్టికి వచ్చిందని, గతంలో పని చేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల తోపాటు కారోబార్‌ను సైతం విచారించి నిజాలను బయటకు తీయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

## ఫోర్జరీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### పంచాయతీ కార్యదర్శి హన్మంత్‌రెడ్డి



హాజిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంటి వ్యాల్యూవేషన్ సర్టిఫికెట్ జారీ చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి భీరం హన్మంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే తాను షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, త్వరలోనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని వివరించారు.

# డివిజన్ అభివృద్ధికి ప్రాధాన్యం

## కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం సహకారంతో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ పేర్కొన్నారు. డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీలో నిర్మిస్తున్న 50 ఫీట్ల బిటి రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమైన సమస్యలు పరిష్కారం చేయడంతో పాటు కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి జితేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాము నేత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు



**ప్రజాపక్షం/యాచారం :** సిఎం కప్ 2025 మండల స్థాయి టోర్నమెంటును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ అనిత శరణం అన్నారు. గురువారం యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిత మాట్లాడుతూ యువతీ యువకుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో, వార్డు మెంబర్లు ఎంఇఒ కె.పాండురంగారెడ్డి, ఎస్ఐ ప్రియాంక మండలంలోని అన్ని పాఠశాలల పిఈటిలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రవాణా సౌకర్యంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి



**ప్రజాపక్షం/కేశంపేట:** రవాణా సౌకర్యంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బీస కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కాకునూరు నుండి తొమ్మిదిరేకుల వరకు నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి, బొదునంపల్లి సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, మంగళిగూడ సర్పంచ్ కొట్టం నరేందర్‌రెడ్డి, నాయకులు తైద పర్వతాలు, విజయరెడ్డి, ఐలాపురం హరీశ్వర్‌రెడ్డి, కోడూరు శ్రీశైలం పాల్గొన్నారు.

# రెండోరోజు పట్నం మున్సిపాలిటీలో 74 నామినేషన్లు దాఖలు




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్లో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24వార్డులకు గాను రెండవ రోజు 74 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు పేర్కొన్నారు. 24 వార్డులకు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, జనసెన, స్వతంత్ర్య అభ్యర్థులతో పాటు వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఖానాపూర్ గ్రామం పదవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థిగా దొంతరమోని భార్గవిరాజు ఎన్నికల కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా సిఐ మహేందర్‌రెడ్డి గట్టి పోలీస్ బంధొబస్తు నిర్వహించారు.

# షాద్‌నగర్‌లో 64 నామినేషన్లు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా రెండవ రోజు 64 నామినేషన్లు వచ్చినట్లు కమిషనర్ సునీతారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, బిఎస్‌పి పార్టీల నుండి 64మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 28వార్డుల నుండి రెండవ రోజు 64నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుండి 17నామినేషన్లు, ప్రతిపక్ష బిఆర్ఎస్ నుండి 26నామినేషన్లు, బిజెపి నుండి 17, బిఎస్‌పి నుండి ఒకటి చొప్పున వచ్చినట్లు వివరించారు.

# ప్రజాశ్రేయస్సుకు పాటుపడే 'పొన్నం'




**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** శుక్రవారం జరుగనున్న తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలలో పేదల పక్షపాతి, ప్రజా శ్రేయస్సుకు పాటుపడే పొన్నం అశోక్‌గౌడ్‌ను గెలిపించాలని రంగారెడ్డి జిల్లా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భిక్షపతి గౌడ్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో తోటి న్యాయ్య వాదులతో కలిసి ప్రచారం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొడ్డు భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ సీరియల్ నెంబర్ 15 మీద మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయ్యవాదులు జగదీష్ గౌడ్, రమేష్ రెడ్డి, సుధాకర్, రాజి రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.




## 'సిఎం కప్' క్రీడా పోటీల సమావేశం

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ మండలంలో సిఎం కప్ క్రీడా పోటీల సమావేశం ఏర్పాట్లపై గురువారం ఉప్పల్ మండలం విద్యాశాఖాధికారి రామారావు, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, జోనల్ కార్యదర్శి జి.పద్మావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాట్మెంటున్, చెస్ తదితర క్రీడలు ఫిబ్రవరి 3 నుండి 5 వరకు జరిగే సిఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొనే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తదుపరి వారి ధ్రువీకరణ కొరకు పదవ తరగతి మెమో, ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు సంబంధిత అధికారులకు సమర్పించాలి. మరిన్ని వివరాలకు 9290093852, 9989129241 ఫోన్ నంబర్ లను సంప్రదించాలన్నారు.

## స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణకు చర్యలు

**ప్రజాపక్షం/నాగారం:** డోర్ టు డోర్ స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరణను తప్పనిసరిగా చేయాలని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం ప్రాథమిక డంపింగ్ యార్డ్‌ల కేంద్రాలను సందర్శించి ప్రాథమిక సేకరణ(సెకండరీ పాయింట్లు)అంశంపై విస్తృతంగా చర్చించారు. ఎక్కడ కూడా జివిపి పాయింట్లు ఉండకుండా పూర్తిగా తొలగించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.అదే విధంగా నాగారం యానిమల్ బర్త్ సెంటర్(ఏబిసి)కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న వనరులను పనర్వినియోగం చేసే విధంగా సమర్ధవంతమైన చర్యలు చేపట్టాలని, స్వచ్ఛత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ డిసి వాణి, అధికారులు పాల్గొన్నారు.

## పేరుకుపోతున్న చెత్తా, చెదారాన్ని నిరంతరం సేకరించాలి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** రోజురోజుకి పేరుకుపోతున్న చెత్తా, చెదారాన్ని నిరంతరం సేకరించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ వాకాలపూడి రవికిరణ్ అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సాబెర్ అలీని కలిసిన రవికిరణ్, 273 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్ తాళ్లూరికు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ లోని నాలుగు డివిజన్‌లలో చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించడం లేదని, దీంతో బస్తీలు, కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం పేరుకుపోయిందని అన్నారు. తక్షణమే చెత్త సేకరణను చేపట్టి నిరంతరం సేకరణను నిర్వహించాలని కోరారు. కాలనీలు, బస్తీలలో దోమల నివారణ చర్యలు అసలు జరగడం లేదని, ప్రతిరోజు ఫాగింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పలు బస్తీలు, కాలనీలలో వీధి దీపాలు వెలగడం లేవని, రాత్రివేళల్లో ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. అదేవిధంగా వీధి కుక్కలు ఎక్కువవుతున్నాయని, దారినపోయే వారిపై కుక్కలు ఎగబడుతున్నాయని, తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న కనీస సమస్యలను పరిష్కరించకపోతే సర్కిల్ అధికారులు, సిబ్బంది ఉండి ఎందుకని ప్రశ్నించారు. తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## అపరిశుభ్రంగా కాప్రా సర్కిల్ కార్యాలయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా సర్కిల్ కార్యాలయంలో టాయిలెట్లు కంపుకొడుతున్నాయని, ఏ మూలన చూసిన గుట్కా పాన్ పరాక్ ప్యాకెట్లు దర్శనం ఇస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టాయిలెట్లలో మద్యం సేవించి పడేసిన బాటిళ్లు, తిని పడేసిన అన్నం, చెత్త కుప్పలు ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు. వాష్ రూమ్‌లకు వెళ్లే వారు ముక్కు మూసుకుని వెళ్తు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే అధికారులు దృష్టిసారించి శుభ్రంగా ఉండేటట్లు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## రెండవ రోజు స్పీడందుకున్న నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్‌లో రెండవ రోజు నామినేషన్‌ల పర్వం కొనసాగింది. మొదటి రోజు స్వల్ప సంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. కాగా గురువారం నామినేషన్ల పర్వం జోరందుకుంది. రెండు మున్సిపాలిటిల్లో పలు రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు, ఇతర రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. ఎన్నికల అధికారులు సూచించిన అంశాల మేరకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను పూర్తిచేసి బలపరిచిన, ప్రతిపాదించిన అభ్యర్థులతో తమ నామినేషన్‌లను దాఖలు చేస్తున్నారు. మూడుచింతలపల్లిలో బిజెపి 6, కాంగ్రెస్ 15, బిఆర్ఎస్ 19, స్వతంత్ర అభ్యర్థులు 2 మొత్తం 42 మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారులకు దాఖలు చేశారని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. అలాగే అలియాబాద్ మున్సిపల్‌లో బిఎస్‌పి 1, బిజెపి 16, కాంగ్రెస్ 19, బిఆర్ఎస్ 19, ఇతరులు 10. స్వతంత్ర అభ్యర్థులు 3 మొత్తం 68 నామినేషన్‌లు రెండవ రోజు దాఖలు అయ్యాయని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు.





## ఘనంగా ఏకాదశ వార్షిక బ్రహోత్సవాలు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ఆకాంక్షించారు. గురువారం 131 కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్ నగర్‌లోని అమృతాలయం నందు గత మూడు రోజులుగా వైభవోపేతంగా నిర్వహిస్తున్న ఏకాదశ వార్షిక బ్రహోత్సవాల కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి బాపు, దుర్గారావు, మురళీ, నర్సింహారెడ్డి, భాస్కర్, నర్సింహారావు, గణేష్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షులు వనం శ్రీనివాస్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేల అభివృద్ధికి వ్యవస్థాగత సంస్కరణలు కీలకం

### దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవస్థాగత సంస్కరణలు, ఉద్యోగుల నైపుణ్యాల పెంపుదల ద్వారానే భారత రైల్వేలు మరింత అభివృద్ధి సాధిస్తాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ న్యూ భోయిగూడలోని రైల్ కళా రంగ్‌లో గురువారం ఘనంగా నిర్వహించిన 70వ రైల్వే వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోన్‌లోని వివిధ డివిజన్లు, విభాగాలకు 35 జోనల్ స్థాయి ఎఫిషియెన్సీ షీల్డ్, అలాగే ఉత్తమ సేవలందించిన 86 మంది అధికారులు, సిబ్బందికి విశిష్ట రైల్ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. జోనల్ స్థాయిలో ఓవర్ ఆల్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ షీల్డ్ హైదరాబాద్, గుంతకల్లు డివిజన్‌లు సంయుక్తంగా సాధించాయి. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందించిన జిఎం, సంస్థ యొక్క నిజమైన బలం ఉద్యోగులేనని పేర్కొన్నారు. రైలు వినియోగదారుల సేవలు, నిర్వహణ, ఉత్పత్తి వంటి అన్ని రంగాల్లో కాలపరిమితితో కూడిన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సూచించారు. నూతన ఆలోచనలను స్వాగతిస్తూ, వాటిని మూల్యాంకనం చేసి అమలు చేయాలని అధికారులను కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. డిజిటల్ మాధ్యమాల్లో అందుబాటులో ఉన్న విస్తృత జ్ఞానాన్ని వినియోగించి సమర్థవంతమైన శ్రామికశక్తిని నిర్మించాలని పిలుపునిచ్చారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ భారత రైల్వేలు ఆధునికీకరణ దిశగా ముందుకు సాగుతున్నాయని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆశిష్ మెహ్రోత్రా, డిప్యూటీ జనరల్ మేనేజర్(జి) ఉదయనాథ్ కోట్లా, వివిధ శాఖల ప్రధానాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదనపు జిఎం సత్య ప్రకాష్ స్వాగత ప్రసంగంలో ఎఫిషియెన్సీ షీల్డ్ పొందిన డివిజన్లను, వ్యక్తిగత అవార్డు గ్రహీతలను అభినందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే సాధించిన కీలక విజయాలను వివరించారు. అనంతరం రైల్వే సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.

## యువ ఇంజనీర్లకు ప్రోత్సాహం... అనుభవాధారిత విద్యకు బలం

### శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస రాజు






**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** యువ ఇంజనీర్లను ప్రోత్సహిస్తూ, అనుభవాధారిత ఇంజనీరింగ్ విద్యకు మరింత బలం చేకూర్చే దిశగా ఈ బాజాతో ఒప్పందం ఉపయోగపడుతుందని శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ పి. శ్రీనివాస రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లోని బివిఆర్ఐటి కళాశాలలో బాజా సిఇండియా (బిఎజెఎ ఎస్ఎఈఐఎన్‌డిఐఎ) మరియు శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీల మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది. ఒప్పంద పత్రాలను ఇరు సంస్థల ప్రతినిధులు అందుకున్నారు. అనంతరం ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రాజు, ఎంబాజా 2026 కన్వీనర్ అలీ సయ్యద్‌లు మాట్లాడుతూ సిద్ధాంత జ్ఞానాన్ని వాస్తవ సమస్యలకు అన్వయించుకునే అవకాశం ఎంబాజా సిఇండియా ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ పోటీ విద్యార్థుల్లో డిజైన్ ఆప్టిమైజేషన్, టీమ్ వర్క్, ప్రాజెక్ట్ మేనేజర్ మరియు ఒత్తిడిలో నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందిస్తుందని అన్నారు. బాజాలో ఉన్న వైవిధ్యభరితమైన, సమగ్ర సంస్కృతిని వివరించారు. హెచ్‌ఆర్ మీట్ ద్వారా విద్యార్థులు పరిశ్రమ ప్రతినిధులతో నేరుగా పరస్పరం మిళితమై, ఇంటర్న్ షిప్‌లు, ఉద్యోగ అవకాశాలకు దారితీసే అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఇరు సంస్థల ఒప్పందం ప్రతిష్ఠాత్మకమని, ఫిబ్రవరి 25వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు నర్సాపూర్‌లోని బివి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ పోటీ జరుగుతుందని తెలిపారు. బాజా స్టూడెంట్ సిరీస్‌లో అత్యంత పురాతనమైన, ప్రాముఖ్యత కలిగిన పోటీగా గుర్తింపు పొందిన ఈ ఎంబాజా దేశంలో విద్యార్థుల కోసం నిర్వహించబడే ఆఫ్‌రోడ్ ఇంజనీరింగ్ పోటీలలో అగ్రస్థానంలో నిలుస్తోందని వివరించారు. ఈ సహకారం ద్వారా నవోత్తమ ఆవిష్కరణలు, ప్రాయోగిక విద్య, స్థిరత్వం, వైవిధ్యం, పరిశ్రమ విద్యా సంస్థల మధ్య బలమైన అనుసంధానాన్ని పెంపొందించి, పరిశ్రమకు సిద్ధమైన ఇంజనీర్లను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఇరుసంస్థలు ముందుకు సాగుతాయని తెలిపారు. అనంతరం శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, బివిఆర్ ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎన్ సునీత మాట్లాడుతూ జాతీయ స్థాయి బాజా ఈవెంట్లను నిర్వహించడం సంస్థకు గర్వకారణమని తెలిపారు.

హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్, ఆవిష్కరణల ఆధారిత విద్య మరియు పరిశ్రమలతో సహకారమే తమ సంస్థ విద్యాతత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాజా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాల రాజ్ సుబ్రహ్మణ్యం, బివిఆర్ ఐటి నర్సాపూర్ ప్రిన్సిపల్ సంజయ్ దూబే, విద్యార్థులు పాల్గొన్నారు.

## నామినేషన్ పక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/తాండూరు:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. గురువారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియలో ఏలాంటి లోటు పాట్లు లేకుండా సమర్థవంతం గా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏయే ధృవీకరమ పత్రాలు జత చేయాలో స్పష్టం గా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నా రు. 1నుండి 36వార్డులకు గాను 12కౌంటర్లు, 12మంది ఆర్ ఒలు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ల ధాఖాలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని, ఏమైన సందేహాలు ఉంటే సొంత నిర్ణయం తీసుకోకుండా పై అధికారులను సంప్రదించాలని సిబ్బందికి సూచించారు. నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్‌తో పాటు పోలీసు బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో 100 వార్డులకు గాను 261పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు 54సమస్యాత్మక లోకేషన్‌లను గుర్తుంచి పూర్తి స్థాయిలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్ ఒలు, ఓఆర్ఒలు 20శాతం అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు.కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమీషనర్ మధుసూధన్‌రెడ్డి, సిఐ శివ శంకర్, అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### ఎస్‌పి స్నేహమెహ్రా

**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ ఎన్నికలపై పోలీస్‌ల ప్రత్యేక దృష్టి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అన్నారు. వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటిలో ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలన్నారు. స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవవాలని కోరారు. డబ్బు మద్యం , బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వకంగా అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు,సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని, మైక్ సేట్లు లేదా శబ్దం కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని అన్నారు. 50వేల నగదు కంటే ఎక్కువ తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని,సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు రెచ్చగొట్టే సందేశాలు, వ్యాఖ్యలు ప్రచారంచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రెండవ రోజు భారీగా నామినేషన్ల దాఖలు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు భారీగా నామినేషన్ దాఖలు చేశారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలకు గురువారం రెండవ రోజు అభ్యర్థులు భారీగా తరలి వచ్చారు. రెండవ రోజు తాండూరు మున్సిపల్‌లో 97 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని మున్సిపల్ కమీషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నామినేషన్ పక్రియ ప్రశాంతంగా సాగుతుందని తెలిపారు.

## పిహెచ్‌డి అందుకున్న డాక్టర్ స్వప్న



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంకల్పం, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే డాక్టర్.స్వప్న నూనె అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ సీనియర్ ప్రొఫెసర్ వెంకటయ్య పర్యవేక్షణలో గ్రామీణ మహిళల సాధికారతపై మైక్రో ఫైనాన్స్ ప్రభావం అనే అంశంపై పరిశోధన పూర్తి చేసిన స్వప్న ఉస్మానియా యూనివర్సిటీ నుండి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రపంచమంతా ఆర్థికంగా అభివృద్ధిలో దూసుకుపోతుంటే నేటికీ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడంలో వెనుకంజలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలు,మైక్రో ఫైనాన్స్ బ్యాంకులో రుణాల సౌకర్యం ఉన్నప్పటికీ చాలా వరకు గ్రామీణ ప్రాంతాల మహిళలు అవగాహన లేకపోవడంతో వెనుకబడి పోతున్నరన్నారు. రుణాల ద్వారా మహిళలు ఏ విధంగా అభివృద్ధి చెందుతారు అనేది నా పరిశోధన ద్వారా తెలియజేయడం జరిగిందని వివరించారు. నా పరిశోధనకు సహకరించిన తన అమ్మ నాన్నలకు మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు.



## కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తోందని కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, సిఐటియు మండల కార్యదర్శి చింతల యాదయ్య, సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్‌లు పిలుపునిచ్చారు. గురువారం సిఐటియుసి కార్యాలయంలో జరిగిన సిపిఐ, సిపిఎం, సిఐటియుసి, ఎఐటియుసి నాయకులు కలిసి నోటిసును రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, మాట్లాడుతూ కార్మికులు ప్రాణాలు పణంగాపెట్టి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అదానీ అంబానీ లాంటి బడా కార్పోరేట్ కంపెనీలకు అనుకూలంగా ప్రధాని నరేంద్రమోదీ వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని దేశంలో 50కోట్ల మంది కార్మికులకు మేలుచేసే చట్టాలను తాకట్టుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు యూనియన్ పెట్టుకునే అవకాశం ఉండేది. 29న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాల ని కార్మికులకు, కర్షకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కొయ్యడ చంద్ర మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం రామచందర్, తదితరులు పాల్గొన్నారు.



## 17వ వార్డునుండి స్పీకర్ కుమార్తె నామినేషన్

**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ లోని 17వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుమార్తె గడ్డం అనన్య నామినేషన్ వేశారు. వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ అభ్యర్థి కావడంతో ఆమె గెలుపుకోసం అందరూ కృషిచేయాలన్నారు. మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి , శశాంక్‌రెడ్డి, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## లాభసాటి పంటలపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/వికారాబాద్:** అధిక దిగుబడితోపాటు లాభసాటి పంటలను పండించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ రాజేశ్వరి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని అధిక సాంద్రత పంటల సాగు నానో యునియా, డిఎపి వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రాజేశ్వరి పాల్గొని మాట్లాడుతూ రైతులకు అధిక లాభాలు వచ్చే విధంగా పంటలు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలను రైతులకు తెలియజేయాలని అన్నారు. సన్నరకం పండించిన రైతులకు క్వింటల్‌కు 500రూపాయులు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వరిని పండించడంతోపాటు అధిక దిగుబడి వచ్చే విధంగా రైతులకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసంభంధాల శాఖ జిల్లా మేనేజర్ మోహన్‌కృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేశ్వరిరెడ్డి , రాజా, మధు, రాథోడ్ సందీప్ శంకర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.






## ఇక గ్రామంలోనే ఆసరా ఫించన్‌ల పంపిణీ

### బస్వాపూర్ గ్రామ సర్పంచ్ స్రవంతి శివరాజ్

**ప్రజాపక్షం/బంట్వారం :** బస్వపూర్ గ్రామంలో ఆసరా ఫించన్ లు గత పాలకుల పాలనాలో వృద్ధులు, వికాలాంగులు, ఒంటరి మహిళలు ఫించన్ కోసం 5 కిలోమీటర్లు నడుచుకుంటు, సపరేట్‌గా ఆటో కిరాయికి మాట్లాడుకొని తోర్ మామిడి గ్రామానికి వెళ్లి పింఛన్ పొందేవారని, ఇటీవల జరిగిన సాధారణ పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా గెలుపొందిన వెంటనే సర్పంచ్ ఎం. స్రవంతి శివారాజ్ తోర్‌మామిడి గ్రామానికి వెళ్ళకుండా మన స్వగ్రామంలోనే పింఛన్ ఇచ్చేందుకు కృషి చేస్తానని ..... ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా ఫించన్ బస్వపూర్ గ్రామంలో స్థానికంగా ఇవ్వడంకోసం తపాల శాఖతో మాట్లాడి గ్రామంలోనే ఆసరా పింఛన్‌లు ఇప్పించడం జరిగింది. పోస్టుమాన్ ముస్తాక్ గ్రామానికి వచ్చి పింఛన్ అందించిన శుభ సందర్భంలో ఆయనకు సర్పంచ్ ఎం. స్రవంతి శివరాజ్‌ను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు ప్రభాకర్, వార్డు సభ్యులు, పింఛన్ దారులు, తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

### ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం /పరిగి :** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అశీర్వదించి, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. పరిగి మున్సిపల్ ల్లో ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి నామినేషన్ పత్రాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటిలో ఎగరవేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అశ్వీర్వదించి , పరిగి మున్సిపాలిటిలో 18స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దా పార్థసారథి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
30-01-2026
www.prajapaksham.in

'మనశంకర వరప్రసాద్ గారు' సినిమా ఇప్పటి వరకూ రూ.358 కోట్లు వసూళ్లు చేసి భారీ కలెక్షన్లు సాధించిన ప్రాంతీయ చిత్రంగా రికార్డును సృష్టించింది. ఈ సినిమాలో ఓ కీలక సన్నివేశంలో వచ్చే 'పెద్దిరెడ్డి..' పాట ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. తాజాగా ఈ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు.

# రీల్



## దసరాకు 'ఫౌజీ' సిద్ధం

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఫౌజీ'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో టిసిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ఫస్ట్‌లుక్‌కి ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ యేడాది దసరా పండుగ సందర్భంగా 'ఫౌజీ' చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి విరామం లేకుండా కంటిన్యూ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రభాస్ సరసన హీరోయిన్‌గా ఇమాన్వీ నటిస్తోంది. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సుదీప్ చటర్జీ నిర్వహిస్తుండగా, సంగీతాన్ని విశాల్ చంద్రశేఖర్ అందిస్తున్నారు. అనిల్ విలాస్ జాధవ్ ప్రొడక్షన్ డిజైనర్, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ భాషల్లో విడుదల కానుంది.

## 'గ్యాంగ్‌స్టర్స్'గా బాలయ్య, చిరంజీవి!



టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్స్ చిరంజీవి, బాలకృష్ణ ఇద్దరూ ఒకే తరహా మూవీస్ లో నటించబోతున్నారట. ఆ రెండు సినిమాలు కూడా ఒకే సీజన్ లో జనాన్ని పలకరిస్తాయనీ వినిపిస్తోంది.టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక సంవత్సరాలు ఢీ అంటే ఢీ అంటూ సాగిన స్టార్ హీరోస్ ఎవరంటే మెగాస్టార్ చిరంజీవి , నటసింహ బాలకృష్ణ అనే చెప్పాలి. వీరిద్దరి సినిమాలు పోటీ పడితే చూడాలని సినీ ఫ్యాన్స్ కూడా ఆశిస్తూ ఉంటారు. ఒకసారి చిరుది పైచేయిగా సాగితే, మరోమారు బాలయ్యది అప్పర్ హ్యాండ్‌గా ఉన్న సందర్భాలున్నాయి. అందువల్లే పోటీ అంటే వీరిద్దరి మధ్యే అన్నది తెలుగు సినీ ఫ్యాన్స్ అభిప్రాయం. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు ఇద్దరూ ఒకే తరహా కథల్లో నటిస్తున్నారని టాక్. పైగా ఆ రెండు చిత్రాలు వచ్చే 2027 సంక్రాంతికి రిలీజ్ అవుతాయనీ వినిపిస్తోంది.చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం లో రూపొందుతోన్న చిత్రం గ్యాంగ్ స్టర్ నేపథ్యంలో తెరకెక్కబోతోందట. ఈ సినిమాను రాబోయే సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలని ఆశిస్తున్నారు. ఇక మరోవైపు బాలకృష్ణ కథానాయకునిగా గోపీచంద్ మలినేని తెరకెక్కించబోయే మూవీ కూడా గ్యాంగ్ స్టర్ కథతోనే సాగనుందట. అందువల్ల సినీ ఫ్యాన్స్ లో అమితాసక్తి నెలకొంది. పైగా 2023లో కూడా ఓ వైపు బాలకృష్ణ గోపీచంద్ మలినేని తమ 'వీరసింహారెడ్డి'తో బరిలోకి దూకారు. ఆ సినిమా వచ్చిన మరుసటి రోజునే చిరంజీవి బాబీ కాంబోలో 'వాల్తేరు వీరయ్య' వెలుగు చూసింది. రెండు సినిమాలను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించగా, ఈ చిత్రాలు విజయాన్ని చవిచూశాయి. రెండు సినిమాలనూ అభిమానులు పోటాపోటీగా గోల్డెన్ జూబ్లీ ఆడించడం విశేషం. అందువల్ల చిరుబాలయ్య బాక్సాఫీస్ వార్ మళ్ళీ సంక్రాంతిలోనే సాగితే రంజుగా ఉంటుందని సినీజనం భావిస్తున్నారు.గతంలోనూ చిరంజీవి, బాలకృష్ణ కొన్ని చిత్రాల్లో గ్యాంగ్ స్టర్స్‌గా నటించి అలరించారు. అయితే అప్పట్లో చిరంజీవి గ్యాంగ్ స్టర్ గా 'లంకేశ్వరుడు', 'గూండా' వంటి చిత్రాల్లో నటించారు. ఆ చిత్రాల్లో 'గూండా' అలరించింది. ఇక బాలయ్య విషయానికి వస్తే ఆయన 'యువరత్న రాణా', 'అశోక చక్రవర్తి' మూవీస్ లో గ్యాంగ్ స్టర్‌గా కనిపించారు.. 'యువరత్న రాణా' ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో బాలకృష్ణ, చిరంజీవి ఇద్దరూ గ్యాంగ్ స్టర్స్ గా నటించే కొత్త సినిమాలపై సినీ ఫ్యాన్స్ లో ఆసక్తి నెలకొంది. నవతరం ప్రేక్షకులను ఈ సీనియర్ స్టార్స్ గ్యాంగ్ స్టర్స్ గా ఏ రీతిన మెప్పిస్తారో చూడాలన్న ఇంట్రెస్ట్ కూడా కలుగుతోంది. మరి చిరంజీవిని బాబీ, బాలయ్యను గోపీచంద్ ఏ తీరున తెరపై చూపిస్తారో చూడాలి.



## కీలక పాత్రలో శృతి హాసన్

వరుస బ్లాక్‌బాస్టర్‌లు, పాన్‌ఇండియా స్టార్ దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్, ఇప్పుడు 'ఆకాశంలో ఒక తార'తో అలరించబోతున్నారు. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఈ మధ్య కాలంలో చాలా సెలక్టివ్‌గా సినిమాలు చేస్తున్న శృతి హాసన్, ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఆమె కళ్ళకు అద్దాలు పెట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం ఆకట్టుకుంది. పెదవులపై ఉన్న సిగరెట్, దాని నుంచి ఎగసే పొగ ఆమె పాత్రకు రఫ్, టచ్ ను జోడిస్తోంది. కథలో శ్రుతి హాసన్ పాత్ర కీలక మలుపుగా నిలవనుంది. ఆమె ప్రజెన్స్ పవర్ ఫుల్‌గా ఉండబోతోంది. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఉండబోతుంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీని, శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ చివరి దశలో ఉన్న 'ఆకాశంలో ఒక తార' చిత్రం 2026 వేసవిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. రచయిత: గంగరాజు గున్నం, సంగీతం: జి.వి. ప్రకాష్ సినిమాటోగ్రాఫర్: సుజిత్ సారంగ్.

## శ్రీ చిదంబరం ట్రైలర్ విడుదల



చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేశారు. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి ఆలపించిన 'వెళ్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఫిబ్రవరి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్‌ను గమనిస్తే.. శ్రీచిదంబరం ఓ ఫీల్‌గుడ్ ఎమోషనల్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. ఈ కథలో కమర్షియల్ మేసేజ్‌తో పాటు ఓ బ్యూటిఫుల్ మేసేజ్ కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రతి సన్నివేశం ఎంతో నేచురాలగా ఉంది. తప్పకుండా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు చక్కని అనుభూతిని పంచేవిధంగా ఉంది. నిర్మాత వినిషా మాట్లాడుతూ '' అంతా కొత్తవాళ్లతో తీసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. చాలా మెచ్యూర్డ్ అండ్ ఇన్స్పిరేషన్ స్టోరీతో రాబోతున్న సినిమా ఇది. నేటి సమాజానికి ఎంతో అవసరమైన కథ ఇది. చాలా మంది యువత చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌కి సూసైడ్ వరకు వెళ్లిపోతున్నారు. అలాంటి వారందరికి ఎంతో ఇన్స్పియిర్ అయ్యే కథ ఇది. మీలో లోపం మీకు బలం అవ్వాలి అనే చెప్పే కథ ఇది. తప్పకుండా ఈ సినిమా అందరిని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట, గోపీనాథ్, శివకుమార్ మట్ట, కల్పలత గార్లపాటి, అరుణ్ కుమార్, తులసి, నాయుడు మోరం, శంకర్ రావు తదితరులు డిఓపి అక్షయ్ రామ్ పొడిశెట్టి, ఎడిటర్ అన్వర్ అలీ, సంగీత దర్శకుడు చందు రవి.



## జూ.ఎన్టీఆర్ హక్కులకు రక్షణ కల్పించిన ఢిల్లీ హైకోర్టు

జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిగత , ప్రచార హక్కులను రక్షణ కల్పించేలా ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.వివిధ మాధ్యమాల్లో తన పేరు, ఫోటోలు, గుర్తింపును అనుమతి లేకుండా వాణిజ్య పరమైన ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ కోర్టును ఆశ్రయిస్తూ పిటిషన్ వేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఆయన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పిస్తూ ఆదేశాలను జారీ చేసింది. ఆదేశాల మేరకు ఎన్టీఆర్ పేరు గానీ, ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్, తారక్ లాంమాసెస్ వంటి పేర్లు గానీ, అలాగే ఆయన ఫోటోలు, ఇమేజ్‌ను అనుమతి లేకుండా వాణిజ్య పరంగా వాడితే చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. ఎక్కడైనా ఇలా అనధికారంగా వాడినట్టు తెలిస్తే..చట్టం ప్రకారం వెంటనే తీసేయాలని ఆదేశాలను కోర్టు జారీ చేసింది. ఒక వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి వ్యక్తిత్వ హక్కులనే విజీవించే హక్కు, స్వేచ్ఛతోనే కలిసి ఉంటాయని చెప్పిన ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని, అలాగే కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్మార్క్ చట్టం 1999 ద్వారా అమలు చేయవచ్చని స్పష్టం చేసింది.

## 'సీతా పయనం'లో పయనమే... పాట



శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్‌నెషనల్ బ్యాన్ప మల్టీ టాలెంటెడ్ నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతోన్న కొత్త చిత్రం 'సీతా పయనం'. ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్ని పోషించారు. యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటించారు. అతని మేనల్లుడు యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషించారు. ఈ మూవీని ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో 'పయనమే' పాటను చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. ఈ పాటను కాసర్ల శ్యాం రచించారు. అనూప్ రూబెన్స్ అందించిన బాణీ ఎం తో క్యాచీగా ఉంది. ఈ మెలోడియస్, రొమాంటిక్ పాటను అనూప్ రూబెన్స్, సత్య ప్రకాష్ కలిసి ఆలపించారు. ఇక ఈ పాటలో అర్జున్, అనూప్ రూబెన్స్ కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేశారు. హీరో, హీరోయిన్ల కెమిస్ట్రీని కూడా ఈ లిరికల్ వీడియోలో చక్కగా చూపించారు.ప్రస్తుతం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని పూర్తి చేశారు. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి జి బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ అందించారు. నిరంజన్, ఐశ్వర్య అర్జున్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ, యాక్షన్ కింగ్ అర్జున్, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డైలాగ్స్ సాయి మాధవ్ బుర్ర, మ్యూజిక్: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: బాల మురుగన్, ఎడిటర్: అయూబ్ ఖాన్, ఆర్ట్ డైరెక్టర్స్: మోహన్ బి కేరీ, శివ కామేష్ డి, కృష్ణ, ఫైట్స్ : కిక్ యాస్ కాళీ

## చైనా ముప్పు కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఆ భావాలు తొణకిసలాడాయని పిటిఐ వార్తాసంస్థ పేర్కొ ంది. ట్రంప్ పేరు చెప్పకుండా జీ జిన్‌పింగ్ నేరుగా మాట్లాడుతూ, అన్నిదేశాలూ కట్టుబడి ఉన్నప్పుడే అన్నిదేశాలూ అంతర్జాతీయ చట్టాలు వాస్తవరూపంలో అమలులో ఉం టాయన్నారు. ముఖ్యంగా ఈ విషయంలో అగ్ర రాజ్యాలు నాయకత్వస్థానంలో ఉండి నడిపించాలని, లేకపోతే ఆరాచక పాలనవైపు ప్రపంచం వెళ్ళిపోతుందన్నారు.ఈ పర్యటనలో స్టార్‌మర్ అనేక వ్యాపార ఒప్పందాలపై సంతకాలు చేశారు. బ్రిటన్ నుండి చైనాకు 30 రోజులపాటు వీసా లే కుండా ఉచితంగా ప్రయాణాలు చేసే సదుపాయాన్ని క ల్పించేందుకు జిన్‌పింగ్ అంగీకరించారు.సమావేశానంత రం కీర్ స్టార్‌మర్ మాట్లాడుతూ, జిన్‌పింగ్‌తో సమావేశం ఎంతో ప్రయోజనాత్మకంగా ముగిసిందని అన్నారు. బ్రిటన్ ప్రజలకు ప్రయోజనం కలిగించే బ్రహ్మాండమైన అవకాశాల గురించి తాము చర్చించామన్నారు. రెండు దేశాలమధ్యా మంచి సంబంధాలు ఉన్నాయని, సంబంధాలు బ లంగా ఉన్నాయని చెప్పారు. బ్రిటన్ విస్కీపై టారిఫ్‌లు స హా, చైనాకు బ్రిటన్ నుండి వీసాలేని ఉచిత రాకపోకల విషయంపై కూడా చర్చల్లో పురోగతి సాధించామన్నారు. వీసాలపై ఒప్పందం గురించి ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ంలో అత్యంత శక్తిమంతమైన ఆర్థికకేంద్రంగా ఉన్న చై నాలో తమ స్థానాన్ని పదిలపరచుకునే మార్గాలను అన్వేషి ంచేందుకు అనేక వ్యాపారసంస్థలు తహ తహలాడుతున్నాయన్నారు. వీసా నియమ నిబంధనలను సడలించడంద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు తాము కూ డా చర్యలు తీసుకుంటామన్నారు. వైరుధ్యాలున్న విషయాలపై కూడా రెండు దేశాలూ నిర్మొహమాటంగా బాహాట ంగా పరస్పర అభిప్రాయాలను పంచుకున్నాయన్నారు. కా గా బ్రిటన్ ప్రధానమంత్రి వెంట 60 బ్రిటన్ కంపెనీలు ,వాణిజ్య సంస్థలకు చెందిన సిఇఓలు చైనా పర్యటనకు వ చ్చారు. వీరిలో బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న ఆస్ట్రా జెనికా ఫార్మాస్యూటికల్ సంస్థ 15 బిలియన్ డాలర్లు చైనాలో పె ట్టుబడులుగా సమకూరుస్తున్నట్లు ప్రకటించింది. స్టార్‌మర్ పర్యటన ద్వారా చైనా-బ్రిటన్ మధ్య ఉన్న దౌత్యపరమైన సంబంధాలు పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపజేసుకోవడాని కి అవకాశం లేనప్పటికీ దౌత్యపరమైన అపోహలు కొన్ని క రిగిపోవడానికి దోహదం చేస్తాయని స్టార్‌మర్ వెంట వెళ్ళిన జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు.

**మన రెండు దేశాలూ ఎరుపే:జిన్‌పింగ్**

కార్మిక ప్రభుత్వాలను మేం ప్రేమిస్తాంజిన్‌పింగ్-స్టార్‌మర్ మధ్య జరిగిన సమావేశంలో చైనా అ ధ్యక్షుడు కొన్ని ఛలోక్తులు కూడా విసిరారు. మనిద్దరం ఎ రుపే (ఉయ్ ఆర్ బోత్ రెడ్స్), మీదీ కార్మిక పార్టీయే (లేబర్‌పార్టీ), మేం కార్మిక ప్రభుత్వాలను ప్రేమిస్తాం'' అని జిన్‌పింగ్ అన్నారు. గురువారం ఉదయం ఈ నాయకులిద్దరిమధ్యా 80 నిమిషాలు సమావేశం జరిగిందని పిటిఐ వా ర్తాసంస్థ పేర్కొనగా రెండు గంటలపాటు సమావేశం జరిగినట్లు బ్రిటన్ పత్రికలు పేర్కొన్నాయి. గడచిన సంవత్సరాలలో రెండు దేశాలమధ్యా సంబంధాలు వెనకబడ్డాయని చ ర్చల సందర్భంగా స్టార్‌మర్‌తో జిన్‌పింగ్ అన్నారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో రెండు దేశాలమధ్యా సంబంధాలు పటిష్టం కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 2018లో థెరిసా మే పర్యటన తర్వాత గడచిన ఏడేళ్ళలో ఇప్పటివరకూ చైనాను బ్రిటన్ ప్రధానమంత్రి సందర్శించలేదు. కానీ ఈసారి పర్యటన ఎంతో కృతనిశ్చయంతో చేస్తున్నామని స్టార్‌మర్ ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత 2024 జులైలో స్టార్‌మర్ బ్రిటన్ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. బ్రిటన్‌లో సమస్యలు పరిష్కరిస్తానని 18 నెలలక్రితం తాను ప్రజలకు వాగ్దానం చేశానని ఆయ న అన్నారు. ఈ సమస్యల పరిష్కారంలో భాగంగా చైనా ఒక శక్తిమంతమైన మార్కెట్‌గా ఉండబోతోందని ఆయన అన్నారు.

## ఎన్నికల్లో ఫిర్యాదుల కోసం టీ - పోల్ యాప్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం టీ పోల్ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. tsec.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చునని ఎస్ఈసి తెలిపింది.



## గద్దెపైకి సమ్మక్క

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ అధికారులు, కింది స్థాయి సిబ్బంది వైఫల్యం కనిపించింది. కాగా మేడారం మహాజాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన తల్లీ సమ్మక్క గురువారం రాత్రి సమయంలో మేడారం గద్దెపైకి చేరుకున్నది. సారలమ్మ, సమ్మక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువై ఉండటంతో భక్తులు మొక్కులు అప్పజెప్పనున్నారు. సామాన్య భక్తజనంతో శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లోని వీఐపీలు వనదేవతలను దర్శించుకుంటున్నారు. గురువారం కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి,గిరిజన శాఖా మంత్రి జువల్ ఓరం అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు అప్పగించారు. అలాగే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,పిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ దంపతులతో పాటు పలువురు రాజకీయ, వివిధ రంగాలకు చెందిన వీఐపీలు వనదేవతలను దర్శించుకున్నారు. వీరి వెంట రాష్ట్ర రెవెన్యూ,సమాచార.గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ( సీతక్క),గిరిజన శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్,జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు ఉన్నారు.

**మహా నగరాన్ని తలపిస్తున్న మేడారం**

భక్తుల గుడారాలు, తాత్కాలిక దుకాణాలతో ఇప్పుడు మేడారం మహానగరాన్ని తలపిస్తోంది. విడిదిచేసిన తావునే సమ్మక్క, సారక్కల నెలవుగా భావిస్తున్న భక్తులు అక్కడే మట్టితో గద్దెలను తయారుచేసుకొని పసుపు కుంకుమలు, కంకవనంతో పూజలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు వినూత్నంగా తమ సంప్రదాయ ప్రకారం తమ గుడారంలోనే ఎత్తుబంగారానికి పూజలుచేసి మద్యం బాటిళ్లతో నైవేద్యం సమర్పిస్తున్నారు. ఆత ర్వాత బెల్లం, కానుకలను దేవతల గద్దెలవద్ద సమర్పిస్తున్నారు. దీంతో చెట్టూ, పుట్టా, వాగూవంకా, గుడిసె, డేరా.. ఎక్కడా చూసినా సమ్మక్క, సారక్క పూజలే దర్శనమిస్తున్నారు. ఛత్తీస్గఢ్, ఒడిశా, మహారాష్ట్రనుంచి వచ్చిన భక్తులు జంపన్నవాగు పొడవునా విడిదిచేశారు. వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్న త ర్వాత కోళ్లు, మేకలను బలిచ్చి కుటుంబసభ్యులు, బం ధుమిత్రులతో విందూవినోదాల్లో మునిగితేలుతున్నారు.

## సమప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

సరికొత్త మార్గాన్ని అందించింది.అన్ని వర్గాల సంక్షేమమే కేంద్రంగా కేరళ రాష్ట్ర ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ గురువారం బడ్జెట్ 2026-27ను శాసనసభలో ప్రవేశపెట్టారు. కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.గోపాలన్ రూ.1.82 లక్షల కోట్ల రూపాయల రెవెన్యూ రాబడి సహా, రూ.2.4 లక్షల కోట్ల వ్యయాన్ని అంచనా వేస్తూ 2026-27 బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. సామాజిక భద్రతా పెన్షన్లు నిలిచిపోవనే హామీయే ఈ బడ్జెట్ ప్రధానాంశం. సంక్షేమ పెన్షన్ల కోసం రూ.14,500 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రజారోగ్య రంగంలో కూడా ఇదే తరహాలో ప్రకటించారు. మహిళా భద్రతా పెన్షన్ల కోసం రూ. 3,820 కోట్లు కేటాయించారు. ఉపాధి హామీ పథకాన్ని ఆటంకం లేకుండా కొనసాగించేందుకు అదనంగా 1,000 కోట్ల రూపాయలను కేటాయించారు. అంగన్‌వాడీ వర్కర్లకు 1000 రూపాయలు, అంగన్వాడీ హెల్పర్లకు 500 రూపాయలు పెంచారు. ఆశా వర్కర్లు, ప్రీప్రైమరీ టీచర్లు, సాక్షరతా ప్రేరక్‌లకు 1000 రూపాయల చొప్పున పెంచారు. స్కూల్ వంట కార్మికుల రోజువారీ వేతనాన్ని 25 రూపాయలు పెంచారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఇతర సామాజిక సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులు కాని 35 నుండి 60 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు (ట్రాన్స్ ఉమెన్ సహా) నెలకు రూ.1000 ఆర్థిక సాయం అందించడం ఈ బడ్జెట్ ప్రత్యేకత. దీనివల్ల 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

**అసంఘటిత కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ :** అసంఘటిత రంగ కార్మికుల కోసం విస్తృతమైన గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రకటించారు. హరితకర్మ సేన సభ్యులు, ఆటోటాక్సీ కార్మికులు, లాటరీ కార్మికులకు ప్రమాద బీమా కల్పిస్తారు. ప్రభుత్వ రంగసహకార సంస్థల ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారి కోసం మెడిసెప్ మాదిరిగా ఇన్సూరెన్స్ అమలు చేస్తారు.

ఉద్యోగులకు పిఆర్‌సి, చివరి వేతనంలో 50 శాతం పెన్షన్ : బడ్జెట్ సందర్భంగా 12వ వేతన సవరణ కమిషన్‌ను ప్రకటించారు. కమిషన్ సభ్యులు మూడు నెలల్లోగా నివేదిక సమర్పిస్తారు. బకాయి ఉన్న అన్ని డిఎ, డిఆర్ గడువులోగా చెల్లిస్తారు. ఒక విడత ఫిబ్రవరి జీతంతో పాటు, మిగిలినవి మార్చి నెలలో అందజేస్తారు. బకాయిలను దశలవారీగా చెల్లించేందుకు నిధులు కేటాయించారు. **అష్యూర్డ్ పెన్షన్ :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ (ఎన్‌పిఎస్)కు బదులుగా పెన్షన్ మొత్తానికి హామీ ఇచ్చే 'అష్యూర్డ్ పెన్షన్' పథకాన్ని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు చివరి జీతంలో 50 శాతం పెన్షన్‌గా హామీ ఇచ్చే ఈ పథకం ఏప్రిల్ 1 నుండి అమలులోకి వస్తుంది. ఇందులోకి మారడానికి ఉద్యోగులకు అవకాశం కల్పిస్తారు. రూ.17వేలు కోత విధించిన కేంద్రం :రాష్ట్రాన్ని ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేస్తూ, కేరళను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ కేరళ ఆర్థిక మంత్రి గోపాలన్ బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. కేరళ వాటాను తగ్గించడం, రెవెన్యూ గ్రాంట్‌ను కుదించడం, అప్పుల పరిమితిని తగ్గించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కేరళను ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. కేంద్రం కేవలం ఓట్లను దొంగిలించడమే కాదు, నోట్లను కూడా దొంగిలించిందని విమర్శించారు. ఈ ఏడాది 17,000 కోట్ల రూపాయల కోత విధించారని చెప్పారు.

**మరికొన్ని హైలైట్స్:** స్థానిక సంస్థలకు జనరల్ పర్పస్ ఫండ్ ₹3237 కోట్లు, మెయింటెనెన్స్ ఫండ్ ₹4316 కోట్లు, ప్లాన్ ఫండ్ ₹10,189 కోట్లు * జర్నలిస్టు పెన్షన్ నెలకు ₹1500 పెంపు * పంచాయితీ సభ్యులు, కౌన్సిలర్ల గౌరవ వేతనం పెంపు * స్థానిక సంస్థల మాజీ ప్రజా ప్రతినిధుల సంక్షేమం కోసం సంక్షేమ నిధి * గిగ్ (Gig) కార్మికుల కోసం ఆధునిక సౌకర్యాలతో 'గిగ్ హబ్' ₹20 కోట్లు * పాత పెట్రోల్, డీజిల్ ఆటో రిక్షాలను తుక్కుగా మార్చి ఎలక్ట్రిక్ ఆటోలు కొనేవారికి ఒకేసారి ₹40,000 స్క్రాపేజ్ బోనస్ *ఎలక్ట్రిక్ ఆటో రిక్షాల కొనుగోలు రుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ * ఆటో స్టాండ్లలో సోలార్ ఆధారిత ఛార్జింగ్ యూనిట్ల ఏర్పాటుకు ₹20 కోట్లు.
* ఉపాధి హామీ పథకం కోసం గత ఏడాది కంటే అదనంగా ₹1000 కోట్లు
* రిటైర్మెంట్ హోమ్‌ల ఏర్పాటుకు సంస్థలు, గ్రూపులు,వ్యక్తులకు ప్రభుత్వ సబ్సిడీ. దీని కోసం ₹30 కోట్లు * ఇళ్లలో ఒంటరిగా ఉండే వృద్ధులకు ₹10 కోట్లుతో 'ఆన్ కాల్ వాలంటీర్ల' సేవలు

### కేరళ ప్రత్యామ్నాయాన్ని ప్రతిబింబించిన బడ్జెట్: బినోయ్ విశ్వం



శాసనసభలో ప్రవేశపెట్టిన 2025-26 రాష్ట్ర బడ్జెట్ కేరళ ప్రజల పక్షపాత ప్రత్యామ్నాయాన్ని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న ప్రతిఘటనను ప్రతిబింబిస్తోందని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం పేర్కొన్నారు. దశాబ్దాలుగా కేరళ నిర్మించుకున్న సంక్షేమ వ్యవస్థలను పటిష్టం చేస్తూనే, నూతన కాలానికి అవసరమైన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ఈ బడ్జెట్ ముందుకు తీసుకెళ్తోందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆర్థిక వివక్షకు పాల్పడుతున్నప్పటికీ, కేరళ వంటి రాష్ట్రం ఎలా పోరాడి నిలబడుతుందో ఈ బడ్జెట్ ప్రత్యక్షంగా చూపుతోంది. జిఎస్‌టి చట్టం వచ్చిన తర్వాత పన్ను వసూలు అవకాశాలు తగ్గిపోయి, రెవెన్యూ లోటు గ్రాంటు , జిఎస్‌టి పరిహారాన్ని కేంద్రం నిలిపివేసినప్పటికీ, రాష్ట్రం ముందడుగు వేస్తూనే ఉందని బినోయ్ విశ్వం అన్నారు.తీవ్రమైన ప్రతికూల ఆర్థిక పరిస్థితుల్లో కూడా, మలయాళీలను అన్ని రంగాల్లో భవిష్యత్తు వైపు నడిపించాలనే వామపక్ష ప్రభుత్వ దూరదృష్టి బడ్జెట్‌లో కనిపిస్తోందని ఆయన ఎత్తిచూపారు.

### అన్ని వర్గాలకు కేటాయింపులు : సిఎం పినరాయ్ విజయన్



అన్ని రంగాల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంలో ప్రజల కేంద్రంగా రూపొందిన ప్రణాళిక అని బడ్జెట్‌ను ఉద్దేశించి కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ వ్యాఖ్యానించారు. గత పదేళ్ళలో కేరళ ఆధునిక, అభివృద్ధి చెందిన మధ్యతరగతి సమాజంగా రూపాంతరం చెందిందన్నారు. కార్మికులు, రైతులు, మధ్యతరగతి, ప్రభుత్వోద్యోగులు, వ్యాపార వర్గాలందరికీ సమదృష్టితో కేటాయింపులు జరిగాయని చెప్పారు. ఈ బడ్జెట్ భారతీయ సమాఖ్య, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిని కేంద్ర ప్రభుత్వ చర్యలకు బలమైన రాజకీయ స్పందనగా నిలుస్తోందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com